- తెలంగాణ నాటక సాహిత్యం - ఒక విహంగ వీక్షణ
- తెలంగాణ సాయుధ పోరాటం - జనగామ పోరాటం
- ప్రాచీన తెలుగు కావ్యాలు - గిరిజనుల సాంస్కృతిక చిత్రణం
- తొలినాళ్ళ తెలుగు సాహిత్యం - స్త్రీ చైతన్యం
- సవర ధ్వనిశాస్త్రం - ఒక పరిశీలన
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-4
- తెలుగులో గజల్ ప్రక్రియ - సామాజిక మాధ్యమాల పాత్ర
- శ్రీవేంకటాధ్వరి 'విశ్వగుణాదర్శ చంపూ'

# మూసీ
# MUSI

• Samputi : 27 • Sanchika : 06 • Pages : 64 • Rs. 20
• April 2024

UGC CARE List
Approved Journal







వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 6
ఏప్రిల్ - 2024
'క్రోధి' చైత్ర మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలంగాణ నాటక సాహిత్యం - ఒక విహంగ వీక్షణం ... డా. భీంపల్లి శ్రీకాంత్ 7
తెలంగాణ సాయుధ పోరాటం - జనగామ పోరాటం ... రేశపల్లి భానుచందర్ 13
ప్రాచీన తెలుగు కావ్యాలు - గిరిజనుల సాంస్కృతిక చిత్రణం - డా. నూనావత్ రాంబాబు 19
సామాన్యుని హృదయవేదన - కన్నీటి సీమ ... డా. కలువకుంట ఈశ్వరబాబు 23
తొలినాళ్ళ తెలుగు సాహిత్యం - స్త్రీ చైతన్యం ... డా. ఎన్. రజని 27
సవర ధ్వనిశాస్త్రం - ఒక పరిశీలన ... వేదాంతం మురళీధర్ 33
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-4 ... డా. అట్టెం దత్తయ్య 41
తెలుగులో గజల్ ప్రక్రియ - సామాజిక మాధ్యమాల పాత్ర .. డా.కెడిడి మృణాళిని 44
శ్రీవేంకటాధ్వరి 'విశ్వగుణాదర్శ చంపూ' - వర్ణనలు ... సాగి తేజశ్రీ 49
సిరిచెల్మ జాతర ... చంద్రకాంత్ మునేశ్వర్ 53

### సమీక్షలు

డా. శ్రీరంగస్వామి 'కావ్యావలోకనం'.... డా. గుమ్మా సాంబశివరావు 56
సామాజిక పరిణామమే జీవనయానం ... యం. సంతు 57
జీవన సత్యాలను ఆవిష్కరించిన పాలకంకుల కల ... స్తంభంకాడి గంగాధర్ 59
స్వీకృతి ... 61

### కవితలు

క్రోధి యుగాది ... కటకం వెంకటరామ శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; కాలవాహిని ... డా. వొజ్జల శరత్ కుమార్ - 12; ఇది నేటి ప్రపంచం ... ఆర్. నవజీవన్ రెడ్డి-18; కట్టెల మండే ... సాహిత్య మణి - 34; దయజూడు రాముడా! - ఆచార్య మసన చెన్నప్ప - 43; నవ వసంతం ... ధూళిపాళ అరుణ - 62; దైవచింతన నేర్పగ తరలు క్రోధి ... డా. జనమంచి విరలేశ్వర శర్మ -62;

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by* : **B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 4 హైదరాబాద్ ఏప్రిల్ : 2024

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# కాలము - మానము

కలయతి ఆయుః కాలయతి, సర్వాణి భూతాని – ఆయువును లెక్కించునది, ప్రాణులన్నింటికిని కారణమైనది, నలుపు, లోహము, యముడు, శివుడు, ఘడియ మొదలగు కాల పరిణామములు. కాల శబ్దానికి అర్థం ఇది. భూమి తనచుట్టూ తాను తిరగడం వల్ల కాలం ఏర్పడుతుంది. భూమి శివునికి సంకేతం కావడం వల్ల కాలం కూడా శివునికి సంకేతమే. కాలం తీరితే ఈ భూమిలో అంతా కలిసి పోవలసిందే. ఒక నియమం ప్రకారం నడిచేది ఈ భూమి, కాలం మాత్రమే.

మీయతే అనేన మాన. దీనితో కొలుతురు, జోకుదురు, తరాజు, బాట్లు, పరిణామము, కొలబద్ద అని అర్థాలు. కొలతకు ప్రమాణం మానం. ప్రమాణ, ఉపమాన, సమాన, విమాన, అనుమాన, అవమాన మొదలైన శబ్దాలు దీనికి అనుగుణంగా కనిపిస్తున్నాయి. కాలాన్ని కొలవడానికి కూడా ఒక మానం కావాలి. ఆకాశంలోని మూన్ (చంద్ర) శబ్దం కూడా 'మాన'కు సంబంధించినదే. మాస అనే అర్థంలో ఒక మూన్(థ్).. మంత్‌గా గుర్తింపబడింది. చంద్రుడే ఒకనొక రోజుల్లో మనిషి జ్ఞానవికాసానికి, కాలగణనకు కారణమైనవాడు కావడం వల్ల 'మాన' శబ్దంతో ఉపయోగిస్తారు. అదేవిధంగా చంద్రమస్ నుండి 'మాస', వెన్నెల నుండి 'నెల' శబ్దాలు మనం వినియోగించుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. మానం కొలత అయితే బ్రహ్మ, పిత్, చాంద్ర, సౌర, బార్హస్పత్య, పైతామహ మొదలైన మానాలు కాలాన్ని గణించడానికి తోడ్పడుతున్నాయి. ఈ నాటి కాలంలో 'మాన' శబ్దం అర్థ సంకోచంతో కేవలం స్త్రీల సౌశీల్యానికి సంబంధించిన కొలతగా వినియోగిస్తున్నారు.

ఉగాది సమయంలోనైనా కాలాన్ని అర్థం చేసుకోవాలి. కాలమానాలను తెలుసుకునే ప్రయత్నమూ చేయాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో పడాలి. నిత్యం, నిరంతరం కాలాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఈ లోకంలో, ఇంత మంచి జన్మలోకి పుట్టిన వారంతా ఇంతకన్నా ఉత్తమమైన, ఉన్నతమైన కార్యక్రమాలు 'సకాలం'లో నిర్వర్తించే ప్రయత్నం చేస్తూ ఉండాలి. కాలాన్ని వ్యర్థం చేయనే కూడదు. ఉన్నంతవరకు కాలాన్ని పూర్ణంగా వినియోగించుకోవాలి. ప్రతి నిమిషం మనస్సును, పూర్ణశక్తితో అనుబంధం పెంచుకునే మార్గంలో ఉండాలి. వ్యర్థమైన, అనవసరమైన ఆలోచనలు ఏవీ ఏ కాలంలోనూ చేయకూడదు. ఏ రూపంలోనైనా వేరు వేరు ఆలోచనలు వస్తుంటే మన శక్తి తగ్గుతుంది కానీ, పెరిగే అవకాశం లేదు. ఆలోచనలను అధిగమించి శక్తిని పెంచుకునే మార్గం చూడాలి. ఉండేది కొద్ది కాలమేనని గుర్తించాలి. ఈ కొలత గలిగిన కాలాన్ని ప్రతి క్షణం మనకన్నా ఉన్నత శక్తితో అనుసంధానం చేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ.. ఒక్క క్షణం కూడా ఆగకుండా ఉన్నట్లు, మన మనస్సు కూడా మరో ఉన్నత శక్తి వైపు కేంద్రీకరించి, జ్ఞానాన్ని పెంచుకుంటూ ప్రశాంతంగా గడపాలి. శక్తివంతులైన వారు మాత్రమే ఈ లోకంలో గొప్ప కార్యక్రమాలు నిర్వహించగలుగుతూ ఉంటారు. శక్తి హీనులైన వారు ఏ కార్యక్రమాలు కూడా నిర్వహించలేరు. తమను తాము కూడా రక్షించుకోలేరు. అందుకే కొలవగలిగిన ఈ కాలంలో ప్రతి క్షణాన్ని శక్తిని గూర్చి ఆలోచించడం కోసం కాక మరోవైపు కేంద్రీకరించనే కూడదు. దానివల్లనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఉగాది, ఇటువంటి నిర్ణయాలు తీసుకోవలసిన సమయం. శక్తివంతులైన వారు సృజించిన కావ్యాలు, విమర్శలు ఉత్తమోత్తమమైన ప్రభావాన్ని తెలియజేస్తాయి. శక్తిహీనులైన వారి సృజన ఏ రూపంలోనూ సమాజాన్ని ప్రభావితం చేయలేదు. వ్యక్తి తనను తాను సంస్కరించుకునే క్రమంలో భాగంగా ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ... ఉగాది శుభాకాంక్షలు.

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# క్రోధి యుగాది



శ్రీమన్మంగళ క్రోధి వత్సరమును సు శ్రేయంబులన్గూర్చుగా
కామాక్షీ కరుణా కటాక్షములతో కాలమ్ము సవ్యంబునై
భూమిన్మెండుగ పాడి పంటలమరున్ పొంగంగ జీవాంబువుల్
శ్యామాలంకృతమైన సస్యముతో సమృద్ధమౌ నేలలే!

భూమికి రాజు భూ సుతుడు, పొందెనుగా మరి రెండు శాఖలన్
స్వామికి యుద్ధమన్న కడు సంతసమౌ గతి యెట్టులున్నదో?!
తామసుదయ్యె మంత్రి మరి దక్కెను మూడు ప్రధాన శాఖలే
సోమరులౌదురేమొ ప్రజ సూర్యకుమారుని పాలనమ్ములో!

గురువు రసాధిపత్యమును గొప్పగ పట్టెను మేలు మేలనన్
సరియగు వానలంది పలు సస్యములెల్లడ విస్తరించులే
సరుకులు వెండి కాంచనము చక్కెర వస్త్రములందుబాటులో
దొరకు నిదే ప్రసాదమని తోరపు సంతసమందరే జనుల్.



శిశిరమ్మందున శుష్క పత్రములనే చెట్లెట్లు వర్జించునో
కృశియించంగ నసాధ్యమైన తలపుల్ కీడంచు వర్జించగా
వశమౌ నూత్న వసంత పల్లవములే భాసించు నవ్యత్వమే
విశదమ్మౌనిట నూతనత్వమనగా వైజ్ఞానికామోదమే

ఎక్కడ దాగె పికమ్ముల?
వెక్కడ దాగెను కిసలము లీ తరువులలో!
మెక్కియు మధుమాసమ్మున
స్రొక్కగ కూసెదవుగాదె శుభములు కలుగన్

శోభకృతునకు సెలవని
ప్రాభవముగ సాగనంపి పంచాంగముగా
వైభవమగు శ్రీ క్రోధిని
లాభక్షేమములు కోరి రమ్మని పిలుతున్!



పద్య సుమములెన్నొ పరచి యాహ్వానించి
నూత్న వత్సరమును నుతుల జేసి
సకల జీవ శాంతి సౌఖ్యమభిలషించు
కవుల కంజలింతు గరిమతోడ

పూర్వ సస్యాధిపతి శశిమోదమలర
పండ్లు, పంటల నీ యేడు పరిఢవిల్ల
వృక్షజాతులనెంతయో వృద్ధి సేయు
నమృత వర్షము కురిపించు హర్షమలర

స్వస్తి పలికెద కవిరాజ సహృదయులకు
స్వస్తి పలికెద సుజన సుభాషితులకు
స్వస్తి పలికెద శాస్త్ర విశ్వాసులకును

**కటకం వెంకట రామ శర్మ**
హైదరాబాద్. ఫోన్ : 94404 72321

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 6 హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

దుఃఖం.... దాచుకుంది
కడుపున సుఖం
జన్మ రాహిత్య కారణం
తత్త్వజ్ఞాన సుబోధకం
దుఃఖం....వర్తమాన
మార్గదర్శ వీక్షణం

నిరాశనుండి పుట్టును ఆశ
ఆశ మందు ప్రయాసకు బాట
ఉపాయమందు అపాయము దాటు
ఆవశ్యకమున అవసరములు దాగు

జయము అపజయమున జనించును
అధైర్యమందించు ధైర్యము
అనుపమాన మవమానము
విజయ కీర్తి వైపు నడిపించును

తుకా సుఖ దుఃఖాల సారము
రాజయోగులకిది అవసరము
ఆది హరిని చేరుకునుటకు
నిన్ను నిర్మించు సాధనములు




అనువాదం :
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 హైదరాబాద్ ఏప్రిల్ : 2024


# తెలంగాణ నాటక సాహిత్యం – ఒక విహంగ వీక్షణం

డా. భీంపల్లి శ్రీకాంత్, ఫోన్ : 903 284 4017

**'కావ్యేషు నాటకం రమ్యం'** అన్నారు అలంకారికులు. నాటకం వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తుంది. సామాజిక స్పృహను కలుగజేస్తుంది. జనులను చైతన్యవంతం చేస్తుంది. తెలంగాణలో వచ్చిన అనేక ఉద్యమాలపై నాటకం ప్రభావం ఎంతో ఉంది. ఆనాటి ప్రాచీన సాహిత్యం నుంచి నేటి ఆధునిక కాలం వరకు ఎన్నో నాటకాలు తెలంగాణాలో ఆవిర్భవించాయి. మొదట పౌరాణిక, చారిత్రక నాటకాలు వచ్చాయి. ఆనంతరం ఉద్యమ స్వభావంతో కూడిన నాటకాలు వచ్చాయి. తర్వాత సాంఘిక నాటకాలు వచ్చాయి.

సామాజిక, రాజకీయ, జాతీయ, సాహిత్య, సాంస్కృతికోద్యమాల్లో క్రియాశీలమైన పాత్రను పోషించిన తెలంగాణ నాటక సాహిత్యం విశేషమైన కృషి సల్పింది. నాటకం దృశ్యకావ్యం, ప్రదర్శన యోగ్యమైనది. అన్ని రసాలను పలికించగల ఏకైక సాహిత్య ప్రక్రియ నాటకం. తెలంగాణలో నాటక రచన సంస్థానాల కాలం నుంచి పురుడుపోసుకున్నది. పండిత పామరజనకంగా అందరికీ అందుబాటులో ఉండి ప్రదర్శించే కళ నాటకం. నాటకం పురాణాల నుంచి సామాజికం వైపు నడిచి అనేక రూపాల్లో అభివ్యక్తమైంది. నాటిక, రూపకం, భువనవిజయం వంటి రూపాల్లో నాటకం రంజింపజేసింది. దశ రూపకాల్లో నాటకం సర్వసమగ్రమైన కళారూపం. నాటకం ప్రారంభం నుంచి నేటివరకూ అనేక మార్పులకు లోనై సమగ్రతను పొంది తన స్థానాన్ని భద్రపరచుకుంది. తెలంగాణలో సమకాలీన సమస్యలను పట్టి చూపించే సాంఘిక నాటకాలు అనేకం వచ్చాయి. జనజీవన పరిస్థితులను, సమస్యలను తెలుపుతూ రాయబడ్డ నాటకాలు తెలంగాణాలో విరివిగా వచ్చాయి.

కాకతీయ సామ్రాజ్యాన్ని క్రీ.శ. 1289 – 1323 మధ్యకాలంలో పాలించిన ప్రతాపరుద్రుడు **'యయాతి చరిత్ర, ఉషారాగోదయం'** అనే సంస్కృత నాటకాలను రచించాడు. రెండవ ప్రతాపరుద్రుడి కాలంలో ఉన్న విశ్వనాథుడు తాను రాసిన **'ప్రతాపరుద్ర యశోభూషణం'** అనే లక్షణ గ్రంథానికి అనుగుణంగా ఆయన **"ప్రతాప కల్యాణము"** అనే నాటకాన్ని రచించాడు. అలాగే ఇదే కాలంలో జీవించిన నరసింహుడు (1289–1323) అనే కవి **"కాదంబరీ కల్యాణం"** అనే నాటకాన్ని రచించినట్లు సాహిత్య పరిశోధకుల అభిప్రాయం. రాచకొండ రాజ్యాన్ని పరిపాలించిన అనపోతనాయకుడు (1360–1385) రాజు **'అభినవ రాఘవము'** అనే నాటకాన్ని రచించాడు. సర్వజ్ఞ సింగభూపాలుడు సంస్కృత నాటక రచయిత. కాకతీయుల సామ్రాజ్య పతనం అనంతరం రాచకొండ రాజధానిగా రేచర్ల వెలమరాజులు తెలంగాణను




పాలించారు. 1381–1405 ప్రాంతంలో పాలించిన ఈ రేచర్ల వెలమరాజు **"రత్నపాంచాలిక లేదా కువలయావళి"** అనే నాటికను రచించాడు. కువలయావళిగా అవతరించిన భూదేవిని శ్రీకృష్ణుడు వివాహం చేసుకోవడం ఇందులోని ఇతివృత్తం. ఇది స్వతంత్ర రచన.

తెలంగాణలో వెలిసిన సంస్థానాలలో తెలుగు, సంస్కృత నాటకాలు విరివిగా వచ్చాయి. సంస్థానాల ఖిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే అనేక నాటకాలు వచ్చాయి. గద్వాల, జటప్రోలు, వనపర్తి, ఆత్మకూరు, అలంపురం, గోపాలపేట తదితర సంస్థానాల నుంచి అనేక నాటకాలు వెలుగుచూశాయి. ప్రాచీన కళారూపమైన యక్షగానం నాటకానికి పూర్వరూపమని చెప్పవచ్చు. ఈ సంస్థానాలలోనే అనేక యక్షగానాలు వచ్చాయి. ఆయా సంస్థానాలలో నిర్వహించే జాతర్లలో, బ్రహ్మోత్సవాలలో ఈ యక్షగానం ఆడేవారు. సంస్థానాల కాలం నుంచే యక్షగానం పురుడు పోసుకుని తదనంతర కాలంలో నాటకంగా ఊపిరిపోసుకుంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జటప్రోలు సంస్థానాధిపతి సురభి మాధవరాయలు ఆస్థాన కవి అయిన ఎలకూచి బాలసరస్వతి **'రంగకౌముది'** అనే నాటకాన్ని రచించాడు. 1570–1650 మధ్యకాలానికి చెందిన ఆయన అసలు పేరు వెంకటకృష్ణయ్య. 1730 సంవత్సరంలో జన్మించిన తిరుమల బుక్కపట్నం కిరీటి వెంకటాచార్యులు **'ఉషాపరిణయం'** అనే నాటకాన్ని రచించాడు. ఆయన తమ్ముడు తిరుమల బుక్కపట్నం బుచ్చి వెంకటాచార్యులు **"కల్యాణ పురంజనం"** అనే నాటకాన్ని రాశాడు.

వనపర్తి సంస్థానాధీశుడు ''అష్టబహిరీ'' గోపాలరావు **"శృంగారమంజరీ భాణము, రామచంద్రోదయము"** అనే సంస్కృత నాటకాలను రాశాడు. ఇతడు 17 వ శతాబ్దానికి చెందినవాడు. ఇదే సంస్థానానికి చెందిన హొసదుర్గము కృష్ణమాచార్యులు అనేక

సంస్కృత నాటకాలు రాశాడు. ఇందులోని కొన్ని సంస్కృత నాటకాలను మాదిరాజు విశ్వనాథరావు తెలుగులోకి అనువాదం చేశాడు. అలాగే కాళిదాసు "**అభిజ్ఞాన శాకుంతలం**" ను అనువదించాడు. ప్రసిద్ధ సంస్కృత పండితుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రితో కలిసి బిల్హణుడి ప్రఖ్యాత నాటకం "**కర్ణసుందరి**" ని అనువదించాడు. ఆత్మకూరు సంస్థానంలోని బాలసరస్వతి బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు (1862 – 1920) అనేక సంస్కృత నాటకాలను రచించాడు. "**కిరీటి వెంకటాచార్య విజయ వైజయన్తి**" అనే సంస్కృత నాటకాన్ని రచించాడు.

నల్లగొండ జిల్లా నారాయణపుర సంస్థానంలో జన్మించిన రామకవచం కృష్ణయ్య (క్రీ.శ.1863 – 1926) "**హరిప్రియ**" అనే నాటకాన్ని రచించాడు. మెదక్ జిల్లా మద్దికుంటకు చెందిన కందాళ సుందరాచార్యులు "**రాజసూయం, పుష్పవేణి విలాసం, సంపూర్ణ రామాయణం, తిరుమంగయాళ్వారు చరిత్రం**" అనే నాటకాలను రచించాడు. మామిడిపల్లి సాంబశివశర్మ (క్రీ.శ.1870 లో జననం) "**మంగళ హారతులు, కీర్తనలు, భద్రావతి, త్యాగయ్య**" అనే నాటకాలను రచించాడు. మెదక్ జిల్లా సిద్దిపేటలో జన్మించిన గడ్డం రామదాసు '**ఋతుధ్వజ**' అనే నాటకాన్ని రచించాడు. 19వ శతాబ్దానికే చెందిన ప్రబంధం అనంతయ్య "**హరిశ్చంద్ర, బిల్హణీయం**" అనే నాటకాలను రాశాడు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా గొరిటకు చెందిన చెన్నకృష్ణమరాజు "**ఋతుధ్వజ**" నాటకాన్ని రాశాడు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ కు చెందిన చందాల కేశవదాసు '**బలిబంధనం, కనకతార**' అనే నాటకాలను రచించాడు. వరంగల్ జిల్లాకు చెందిన ఒద్దిరాజు సోదరులు బహుముఖ ప్రజ్ఞాశాలురు. ఒద్దిరాజు సీతారామచంద్రరావు '**మోహినీ విలాసం, ప్రేమవివాహం, నవనాగరిక భార్య, మైత్రీపరిణితి, ఎరువు సొమ్ము, జమీందారి తీరు, మేనరికము, మేనత్త, మగసంసారం, ఆడపెత్తనం**' వంటి నాటికలను రచించాడు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా రేపాలకు చెందిన కె.ఎల్. నరసింహారావు దాదాపు 25 నాటికలు, నాటకాలు రచించాడు. "**ఆదర్శ లోకాలు, గెలుపు నీదే, గొడిగంటలు, అడుగుజాడలు (1956), కొత్తగుడి, క్రీనీడలు**" వంటి నాటకాలను రచించాడు. నల్లగొండ జిల్లాకు చెందిన గవ్వా జానకిరామిరెడ్డి "**దేశబంధు**" అనే మూడంకాల నాటకాన్ని రాశాడు.

ఇంకా భాగి నారాయణమూర్తి '**పరీక్ష చదువు**' నాటకాన్ని, శేషబాబు '**అశోక రాజ్యం**' నాటకాన్ని రచించారు. మెదక్ జిల్లాకు చెందిన వెల్దుర్తి మాణిక్యరావు '**దయ్యాల పన్గడ**' అనే నాటకాన్ని ఆ జిల్లా మాండలికంలో రాశాడు. హైదరాబాద్ కు చెందిన ఎస్.కె. ఆంజనేయులు "**రాధికా స్వాంతనం, స్మృతి ప్రతీక, శిరోమణి, వలయం, ఆత్మీయులు, రాగరాగిణి, పవిత్రులు, చావకూడదు, నీడలు – నిందలు**" వంటి పలు నాటికానాటకాలను రచించాడు. ఆర్.వి.ఎస్. రామస్వామి "**చీకటి కోణాలు, వలయం, సుడిగాలి, గాలివాన, కెరటాలు, వెల్లువ, శ్రీమాన్ శ్రీపతి, వర్ధంతి, గాలిపటం**" వంటి నాటకాలను రచించాడు.

ప్రసిద్ధ సంపాదకులు, చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి "**భక్త తుకారం, ఉచ్ఛల విషాదము**" అనే నాటకాలను రచించాడు. శేషాద్రి రమణ కవులు '**విచిత్ర వివాహం, సుశీల, చంద్రరేఖ**' వంటి సామాజిక నాటకాలను రచించాడు. సందేశాత్మక రచనగా '**విచిత్ర వివాహం**' నాటకం రచించబడింది. '**చంద్రరేఖ**' నాటకంలో అస్పృశ్యత, నిరుద్యోగం, బాలవితంతువు, రైతుల శ్రమ వంటివి పేర్కొనబడ్డాయి. తెలంగాణా నాటకరంగంలో తొలి ప్రయోగాత్మక నాటకమైన '**భిషగ్విజయం**' ను డాక్టర్ చొల్లేటి నృసింహ్మ రామశర్మ రచించాడు. ఈ నాటకం ఆయుర్వేద వేదవిజ్ఞానానికి సంబంధించినది. ప్రఖ్యాత నాటక కర్త, నాటక సాహిత్య పరిశోధకుడు డాక్టర్ పి.వి.రమణ '**ఆకు రాలిన వసంతం, వెంటాడే నీడలు, దేవతలెత్తిన పడగ, చలిచీమలు, మహావీర కర్ణ, ప్రతాపరుద్ర, మహస్సు, మానవతకూ నిండాయి నూరేళ్లు, లోలకం, మృత్యునీడ, కళ్యాణమే ఒక కానుక, ప్రేమ పోరాటం, గురువుగారూ మన్నించండి**' వంటి నాటికా నాటకాలను రచించాడు. ఇవన్నీ బహుళ ప్రాచుర్యం పొందాయి. ఇంకా వానమామలై వరదాచార్యులు '**రాజ్యశ్రీ**', దాశరథి '**వాసనలేని పూలు**', పాములపర్తి సదాశివరావు '**ఆత్మగౌరవం, కర్తవ్యం, పోరాటం**' నాటకాలను రచించాడు. ఎం.మధుసూదనరావు '**సార్థకజీవి**', వల్లంపట్ల నాగేశ్వరరావు '**మాయాజూదం, రాతిబొమ్మ, కళకారులారా కళ్ళు తెరవండి, మహిమా నీ చోటెక్కడ, ఎలచ్చన్లచ్చినయ్**' వంటి నాటకాలు వివిధ సామాజిక రుగ్మతలపై మార్కెట్ మాయాజాలంపై రచించబడ్డ నాటకాలు. నల్గొండకు చెందిన ప్రముఖ కవి, విమర్శకులు, ప్రొఫెసర్ దేవరాజు మహారాజు '**దయ్యాల సందడి**' అనే నాటకాన్ని తెలంగాణా భాషలో మొదటిసారిగా రచించాడు. కోదాటి లక్ష్మీనరసింహారావు "**గెలుపు నీదే, ఆదర్శలోకాలు, అభాగ్యులు, స్వార్థం, అడుగుజాడలు, కొత్తగుడి, అగ్ని పరీక్ష, వసంత భారతి, కొడిగట్టిన దీపాలు, కల్పతరువు, ప్రజాదేవత, పుట్టినరోజు పండుగ, మతిలేని మహారాజు, ముచ్చట్లు, అందరికీ చదువు**" వంటివి రచించాడు. వరంగల్లుకు చెందిన తూము రామదాసు (1856 – 1904) '**కాళిదాసు**' అనే నాటకం రాశాడు.

ఎ.ఆర్.కృష్ణగా ప్రసిద్ధిపొందిన అడుసుమిల్లి రాధాకృష్ణ ప్రముఖ నాటక రచయిత. ఆంగ్ల నాటకాలను అనేకం తెలుగులోకి అనువాదం చేశాడు. ఆస్కార్ వైల్డ్ '**ఐడియల్ హస్బెండ్**' ను '**ఆదర్శమూర్తి**' (1967) పేరుతో, హెరాల్డ్ పింటర్ రచించిన 'కేర్ టేకర్' నాటకాన్ని '**సంరక్షకుడు**' (1968) పేరుతో, '**హ్యాయర్స్ ఆఫ్ కోల్**' నాటికను '**చీకటివెలుగులు**' (1962) పేరుతో అనువదించాడు. "**అరగంటలో అదృష్టం**" వంటి స్వతంత్ర నాటక రచనలు కూడా చేశాడు.

హైదరాబాద్‌కు చెందిన జమ్మలమడక శశిమోహన్ **"కోహినూర్ ఫర్ సేల్, మాకు శాంతి కావాలి, మంచితనం మరోసారి చచ్చింది, మాకో నియంత కావాలి"** నాటికలను, **"కాగితం పులి, అశ్వత్థామ హతః, సిరికిన్ చెప్పడు"** వంటి నాటకాలను రచించాడు.

తెలంగాణ సాయుధ పోరాటకాలంలో నాటికలు, నాటకాలు చాలా వచ్చాయి. **"న్యాయం, సరబరాహి, పగ, వీరకుంకుమ, కాంగ్రెసా – అంగ్రేజా, శాంతిరక్షణ కోసం, రిపబ్లిక్ వెలిసింది, వీరనారి"** వంటి నాటకాలు ఆవిర్భవించాయి. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకుని సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు కలిసి **'మా భూమి'** నాటకాన్ని రాశారు. వీరిద్దరూ తెలంగాణకు చెందినవారు కాకపోయినా నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకుని వారు దీన్ని రాశారు. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగానే వాసిరెడ్డి భాస్కరరావు **"పోతుగడ్డ"** అనే నాటికను రచించాడు. తెలంగాణ పోరాట చరిత్ర మలిదశను చిత్రించిన నాటకం **'గెరిల్లా'**. దీనిని సుంకర, భాస్కరరావులు రాశారు. ఈ నాటకానికి కూడా నల్లగొండ జిల్లాలో జరిగిన సాయుధ పోరాటమే ఇతివృత్తం కావడం విశేషం. ఈ గెరిల్లా నాటకాన్ని ఆరు రంగాలుగా రచించారు. శ్రీకాకుళ పోరాటం ప్రేరణతో తెలంగాణ నక్సలైట్ ఉద్యమానికి ఊపిరి పోసేందుకు సుంకర సత్యనారాయణ **"వీరకుంకుమ"**, డాక్టర్ రాజారావు **"వీరనారి"** నాటికలను రాశారు. వీరిద్దరు కూడా తెలంగాణేతర రచయితలే కావడం గమనార్హం. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను వీరనారి తెలియజేస్తుంది.

మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఇప్పటూర్ గ్రామానికి చెందిన కొత్లాపూర్ మఠం రాచయ్య గాంధీజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని **'శ్రీ మహాత్మాగాంధీజీ జీవిత చరిత్ర'** అనే పేరుతో బృహత్ నాటకాన్ని రచించాడు. ఇది వందసార్లకు పైగా ప్రదర్శించబడింది. ఇది సరళ గ్రాంథికంలో రచించబడ్డ నాటకం, గాంధీజీ జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఈ నాటకం ఆవిష్కరించింది. నవాబ్‌పేట్ మండలానికి చెందిన దాయపంతులపల్లి చెన్నదాసు **'మాయానాటకం, అశ్వత్థామ, బంగారు లేడి'** అనే నాటికలను రచించాడు. వనపర్తి జిల్లాకు చెందిన ఉమ్మెత్తల యజ్ఞరామయ్య **"ధర్మచక్రం"** పేరుతో నాటకాల సంపుటిని వెలువరించాడు. ఇందులో **ధర్మచక్రం, అంగులీమాల, వేనుడు, మహాకవి భారవి** వంటి నాటకాలున్నాయి. ఇందులో ఒక పౌరాణికం, మూడు చారిత్రక నాటకాలున్నాయి. ఇందులోని 'ధర్మచక్రం' ఆకాశవాణిలో ప్రసారమైంది. గంధం కుప్పదాసు **"యయాతి చరిత్ర"** పేరుతో ఒక నాటకాన్ని రచించాడు. కవిగా, గేయకవిగా, నాటక కర్తగా పేర్గాంచిన టి. రామకృష్ణారెడ్డి **"స్వప్నబాల, ఊర్వశి, ఉలూచి, ఉమర్ ఖయూమ్, కలువరాణి, ఏకాదశి, రాసలీల"** వంటి సంగీత



నృత్య నాటికలను రచించాడు. మహబూబ్ నగర్ పట్టణ కేంద్రానికి చెందిన గాధిరాజు సత్యనారాయణ రాజు **'హనుమ సాక్షాత్కారం'** పేరుతో ఒక సాంఘిక నాటకాన్ని రచించాడు. ఇది అభయవీర హనుమాన్ క్షేత్ర మహిమను తెలిపే నాటకం.

ప్రముఖ నాటకకర్త బి.ఎల్.నరసింహారావు **'కులం'** మొదలైన నాటకాలను రచించాడు. 'కులం' నాటకాన్ని తెలంగాణ మాండలికంలో రచించాడు. ఇందులో ప్రాంతీయ భాషాచైతన్యాన్ని ఆవిష్కరించాడు. మానవ పురోభివృద్ధికి, ప్రగతికి కులం అనేది ఎంత అవరోధంగా ఉంటుందో ఈ నాటకంలో తెలియజెప్పాడు. అనేక నాటక రచనల్లో తెలంగాణ భాషా మాండలికాలను ప్రవేశపెట్టి భాషాపరమైన ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ జిల్లా నుంచి సురమౌళి గొప్ప నాటక సాహిత్యాన్ని ఆవిష్కరించాడు. ఆవిష్కరించడమే కాదు **"ఎథియిస్ట్ బాయిస్ క్లబ్"** అనే నాటక సమాజాన్ని స్థాపించి నాటకాలను వేయించాడు. సురమౌళి, రెడ్డి చినవెంకటరెడ్డిలు కలిసి అనేక నాటికలు రాశారు. వీరిద్దరూ కలిసి రాసిన నాటకం **'కీలుబొమ్మలు'**. ఈ కీలుబొమ్మలు నాటకం సమకాలీన గ్రామ పంచాయితీ వ్యవస్థ తీరుతెన్నులను కళ్ళకు కడుతుంది. పంచాయితీ వ్యవస్థ ద్వారా లబ్ధిపొందే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరనీయకుండా అడ్డుపడి సామాజికాభివృద్ధికి నిరోధకులుగా మారిన సజీవ దృశ్యాలను కీలుబొమ్మలు నాటికలో రచయిత సురమౌళి చక్కగా చిత్రించాడు. వరంగల్ జిల్లాకు చెందిన పొట్లపల్లి రామారావు **"పగ, సరబరాహి, న్యాయం"** వంటి నాటికలను రచించాడు.

నల్లగొండ జిల్లాకు చెందిన తిరునగరి రామాంజనేయులు పలు నాటకాలు, నాటికలు రాశారు. **"వెట్టిచాకిరి"** వంటి నాటికలను **"తెలంగాణ, వీర తెలంగాణ"** వంటి నాటకాలను రచించాడు. ఆనాటి తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాటాన్ని ఇవి ప్రతిబింబించాయి. కవిగా, నవలారచయితగా ప్రసిద్ధుడైన చెరబండరాజు **"గంజినీళ్లు, గ్రామాలు మేల్కొంటున్నాయి"** అనే నాటకాలను, **"టెంపరరీ లేబర్, పల్లె పిలుస్తోంది, వెన్నెల్లో మంటలు, సంఘర్షణ"** అనే నాటికలను రచించాడు. తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం నేపథ్యంగా ప్రసిద్ధ

రచయిత అల్లం రాజయ్య **"నాగేటి చాళ్లల్లో"** అనే నాటకాన్ని రచించాడు. అలాగే ప్రసిద్ధ రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డితో **"బొగ్గు పొరల్లో"** నాటకాన్ని రచించాడు.

సాహిత్య ప్రక్రియలన్నింటిలో హాస్యరసానికి పెద్దపీట వేసింది మాత్రం నాటకరంగమేనని చెప్పవచ్చు. డాక్టర్ పల్లా దుర్గయ్య **'మాయరోగం'** అనే హాస్యనాటికను చక్కగా రచించాడు. ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకోవడానికి ఒక కొడుకు తండ్రి ముందు నటించిన నటనే 'మాయరోగం' నాటిక. గీట్ల రాంరెడ్డి **"మధ్యతరగతి మానవుడు, ఈ బ్రతుకు మాకొద్దు"** వంటి నాటికలను రచించాడు. నంది రాజారెడ్డి **"సబల, మా మతం మానవత్వం"** వంటి నాటికలను రచించాడు. గంటి వెంకటరెడ్డి **"కనువిప్పు, స్వార్థానికి సంకెళ్లు"** నాటికలను రచించాడు. ఆనంద్ కుమార్ **"పూలపల్లకి, సఖరాం బిందర్"** వంటి నాటికలను రాశాడు. అబ్దుల్ కరీం **'గగనంలో గడ్డిపూవు'** నాటికను రచించాడు. వరంగల్ కు చెందిన నాటక రచయిత, పరిశోధకుడైన డాక్టర్ వనం మధుసూదన్ **"నాటకం, అమ్మయ్యో గాంధీ బ్రతికాడు, ఋణం తీరిపోయింది, భారతి కళ్లు తెరిచింది, అంటరాని వాళ్లు"** వంటి నాటికలను రచించాడు. రంగస్థల నటుడు, రచయిత అయిన రొట్టె విశ్వనాథశాస్త్రి **"చైనాతో యుద్ధం"** (1962) సందర్భంగా **'జయం మనదే'** నాటకాన్ని రాశాడు.

తెలంగాణ మాండలిక రచయిత్రి పరిశోధకురాలు, కథా రచయిత్రి అయిన ఆచార్య పాకాల యశోదారెడ్డి పలు నాటకాలను రచించింది. **'నందుని ధర్మదీక్ష, జీవన యాత్ర, ప్రహసనం'** వంటి నాటకాలను రచించి ప్రదర్శింపజేసింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి పలు గేయ, వచన నాటికలు రాశాడు. ఆయన రచించిన వచన నాటికలు **'నారాయణరెడ్డి నాటికలు'** పేరుతో సంపుటిగా వచ్చాయి. అవి **ఊర్మిళ, వరూధిని, మేఘమాధురి, దీపలీల, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విజయ సంక్రాంతి, రఘుపతి రాఘవరాజారాం, కాళిదాసు పునరాగమనం, హరిచరణ దాసి** మొదలైనవి. **"వలపునాడు, దగ్ధశాంతి, భిన్నస్వరాలు, అజంతా సుందరి, సుగాత్రి, ఋతువుల రాణి, వెన్నెలవాడ, దివ్వెల సంగీతం, సంక్రాంతి, గోకుల విహారం, మనిషి-యంత్రం"** వంటి గేయనాటికలను రచించాడు. ఇవేకాక **"వసంతలక్ష్మి, బలే లక్ష్మి, శిథిలశిల, సినీకవి"** వంటి నాటికలు రాశాడు సినారె. తెలంగాణ గేయనాటికను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళిన మహాకవి డాక్టర్ సినారె. యువకళావాహిని ఆధ్వర్యంలో పి.వి.కృష్ణమూర్తి **"స్వామి వివేకానంద, నేతాజి, సమ్రాట్ అశోక"** తదితర చారిత్రక నాటకాలను రాసి ప్రదర్శించాడు. మామునూరు రామదాసు **'రంగుటద్దాలు'** నాటకాన్ని రచించాడు.

నల్లగొండకు చెందిన పెరిక రాజారత్నం **'ఇష్టంలేని పెళ్ళి, నూతన కాంతులు, ఎవరు బాధ్యులు'** వంటి సామాజిక నాటకాలను రచించాడు. చిల్లర భావనారాయణ **'కళాభిమాని, దేశద్రోహం, ఉప్పెన, కామందు, పరిణామం, కొత్త మనిషి, పదవులుపెదవులు'** నాటకాలను, ఎ.ఆర్.కృష్ణ **'అరగంటలో అదృష్టం, కల్లోలం ఎక్కడికి, దేశంకోసం చేసిన నేరం'** నాటకాలను రచించారు. ఇంకా గుండాల నరసింహారావు **'మరుగుతున్న తరం, ఎర్రబస్సు'** లను, అంకం లింగమూర్తి **'జలతారు, చక్రశీల, అగ్నిదీపం, పితృదేవోభవ'** నాటకాలను, ఎం.వి.సుబ్రహ్మణ్యం **'చదరంగం, జెండాపై కపిరాజు, మీరు మారాలి'** నాటకాలను, డాక్టర్ నాంపల్లి మధుబాబు **'మేడిపండు, దూరపుకొండలు'** నాటకాలను, తక్కెళ్ల బాలరాజు **'నవతరానికి నాంది, చైతన్యపథంలో, మరో పొద్దు పొడుపు'** నాటకాలను డాక్టర్ పెద్ది వెంకటయ్య **'చైతన్యరథం, అంబేద్కర్ మళ్ళీ పుట్టాడు, మేలుకొలుపు, చెమట బిందువులు, నేను సైతం'** వంటి నాటకాలను రచించారు. ఎ.వి.నరసింహారావు **'అభయపదం, మలయ సమీరం, నీలిరాగం, జీవనసమరం'** నాటకాలను, వల్స పైడి **'ఆచార్య దేవోభవ'** వంటి నాటకాలను రచించాడు. జాజాల వెంకటశేషయ్య **"వసంతవన విహారం"** అనే నాటక రచన చేశాడు. గద్వాలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకరవర్ధన్ **"ప్లాను సాగింది, విద్వత్ గద్వాల, భూదాన్, ప్రమీలార్జునీయం"** అనే నాటికలను రచించాడు. ప్రసిద్ధ పరిశోధకులు డాక్టర్ కపిలవాయి లింగమూర్తి **'రాజరథం'** అనే భువన విజయ నాటకంను, ఇతర సాంఘిక నాటకాలను రచించాడు. ప్రసిద్ధ రచయిత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అనేక నాటికలు రాశాడు. **"వికృత శిశువు, ఆపరేషన్ వంకాయ, పూలమ్మిన చోట - ప్లాట్లు అమ్మబడును, జంతువు"** వంటి నాటికలను రచించాడు. అలంపురం కు చెందిన డా.వి.వీరాచారి అనేక నాటకాలు రచించాడు. **"వర్ణమాల"** నాటిక సంపుటిని వెలువరించాడు. ఇందులో 15 నాటికలు, 3 ఏకపాత్రాభినయాలు ఉన్నాయి. హాస్య, చారిత్రక, రేడియో, స్త్రీపాత్ర లేని నాటికలు ఇందులో కనిపిస్తాయి. టి.వి.రంగయ్య **"అందరూ అందరే, డాక్టర్ తికమక, మాకు స్వతంత్ర్యం కావాలి, అక్షరజ్ఞానం, ఔన్నత్యం, గురువును కొట్టిన శిష్యుడు, అక్షరమే ఆయుధం, చదువు విలువ"** వంటి నాటకాలను రచించాడు. అంపయ్య **"తుఫాను గాలి, నారూ పోయా పోతావుంటే"** వంటి నాటికలను రచించాడు. విశ్రాంత ఆంగ్ల ఉపాన్యాసకుడు రాజేంద్రబాబు **'నడుం బిగించుదాం'** అనే నాటికను రచించాడు. ఖమ్మం జిల్లాకు చెందిన దెంచనాల శ్రీనివాస్ **'దొంగ సత్తయ్య'** అనే నాటకాన్ని, **"ఆదిశక్తి, మా ఊళ్లో మా రాజ్యం, ఒక్క నువ్వు నాకు కోటి నేనులు నీకు"** వంటి నాటికలను రచించాడు. కల్వకుర్తికి చెందిన బాల సాహిత్య రచయిత గుర్రాల లక్ష్మారెడ్డి రచించాడు. **"ముల్కిరి, యమలోకం"** అనే నాటికలను రచించాడు.

షాద్‌నగర్ తాలూకా వెలికట్టె గ్రామానికి చెందిన వంగీపురం నరసింహాచార్యులు **'అభినవ శశిరేఖ'** అనే నాటకాన్ని రచించాడు. పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ కళాకారుడు, నటుడు అయిన

దుప్పల్లి శ్రీరాములు పలు భక్తి, చారిత్రక, సాంఘిక, ఏకపాత్రాభినయా లతో **'బాల నాటికలు'** అనే పుస్తకాన్ని రచించాడు. **గుహునిభక్తి, దానవీరం, కుంతీకర్ణ సంవాదం, అహంకారం, క్రమశిక్షణ, మాతృదేవోభవ, జ్ఞానోదయం, విజయరహస్యం** వంటి నాటికలను రచించాడు. **స్వామి వివేకానంద, ఝాన్సీ లక్ష్మీబాయి, వీరపాండ్య కట్టబ్రహ్మన, చంద్రశేఖర ఆజాద్, జిజియాబాయి, కైక, భీముడు** వంటి ఏకపాత్రాభినయాలను రచించాడు. పాలమూరు పట్టణానికి చెందిన ప్రముఖ కవి కమలేకర్ డాగోజిరావు **'దేశంకోసం, చెప్పినట్టు చేస్తారా'** వంటి బాల నాటికలను రచించాడు. బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన గంగారం నరసింహాచార్యులు **'సప్తాహ మహాత్మ్యం'** అనే నాటకాన్ని రచించాడు. షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ టి.వి.భాస్కరాచార్య దూరదర్శన్ కోసం 15 దాకా బాల నాటికలను రచించాడు. అలాగే రేడియో నాటకాలను కూడా రచించాడు. విశ్రాంత తెలుగు పండితుడైన మఠం అల్లమాప్రభు **'విద్యార్థి జీవితం, చీకటిపల్లె, జన్మభూమి'** వంటి నాటికలను రచించాడు. జిల్లాలో ప్రసిద్ధకవిగా పేర్గాంచిన వల్లభాపురం జనార్దన మొట్టమొదటిసారిగా **"విజయక్రాంతి"** అనే సంగీతరూపకాన్ని రచించాడు. ఇది గేయ రూపకం. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన కడదాసు వెంకటయ్య **'భక్త శిరియాల చరిత్ర, దత్తాత్రేయ చరిత్ర, భక్త మార్కండేయ చరిత్ర, శ్రీ అయ్యప్ప విజయం'** వంటి నాటకాలను రచించాడు. ఇటిక్యాల మండలం వేముల గ్రామానికి చెందిన వేముల కృష్ణమూర్తి **'శమంతకమణి, వయోజన విద్య'** అనే నాటకాన్ని రచించాడు. శమంతకమణి ప్రాచీన నాటకం. శ్రీకృష్ణుడి చుట్టూ అల్లిన నాటకం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ అధ్యక్షుడిగా పనిచేసిన ఆచార్య మసన చెన్నప్ప బహుముఖ ప్రజ్ఞాశాలి **'వీర సావర్కర్'** అనే పేరుతో ఒక దృశ్యనాటికను రచించాడు. దేవరకద్ర మండలం డోకూరులో జన్మించిన వరకవుల నరహరిరాజు **'భువన విజయం, శ్రీశ్రీ విరాట్ వీరబ్రహ్మంగారి పద్యనాటకం, కలినిగ్రహం, వివేకానంద, శివపార్వతుల కళ్యాణం, అభినవ పడక దృశ్యం'** వంటి నాటకాలను రచించాడు. బల్మూరు మండలానికి చెందిన తిరుమల కృష్ణదేశికాచార్యులు ప్రముఖ పద్య, నాటక కవి. అనేక రచనలు చేశాడు. పిల్లలమర్రి పినవీరభద్రుడు రచించిన నాటకం **'వాణి నారాణి'**, రెండవది **'బిల్హణీయం'** లను పద్యనాటకాలుగా రచించాడు. గద్వాలకు చెందిన తిరుమల వెంకటస్వామి **'ఈ భక్తులు మాకొద్దు'** అనే పేరుతో నాటకాన్ని రచించాడు. దురాశతో దేవుళ్ళను వాడుకునే దొంగ భక్తుల నేపథ్యంలో దేవతలే ఈ భక్తులు మాకొద్దు అనే నాటకాన్ని రాయబడింది. కోస్గికి చెందిన ఆర్.ఎం.ప్రభులింగశాస్త్రి **"బెజ్జమహాదేవి"** అనే నాటకాన్ని రచించాడు. ఖిల్లాగణపురం మండలం మామిడిమాడకు చెందిన ఛందోజిరావు **'అభినవ సావిత్రి'** పేరుతో ఒక చిన్న హాస్య నాటికను రచించాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాలెల అంజిలయ్య గౌడ్ **'బలి, తాగితే వొట్టు, పాఠశాలోపాఖ్యానం'** తదితర నాటకాలను రచించాడు. ఉపాధ్యాయ ఉద్యమకర్తగా పేర్గాంచిన జి.అంపయ్య **"తుఫాను గాలి, నారూ పోయా పోతావుంటే"** వంటి నాటికలను రచించాడు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పల్లెర్ల రామ్మోహన్ రావు **"గద్వాల వైభవం, శ్రీవినాయక వైభవం"** అనే సాహిత్య రూపకాలను రచించాడు. మద్దూర్ మండలం చింతలదిన్నె గ్రామానికి చెందిన పోతుల హన్మంత్ రెడ్డి **'భీమార్జున విజయాలు, భక్త తుకారం, భక్త మార్కండేయ'** వంటి నాటకాలను రచించాడు. పాలమూరు పట్టణానికి చెందిన యువకవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ **"స్వాతంత్ర దినోత్సవం"** అనే నాటికను రచించాడు. స్వాతంత్ర దినోత్సవం ప్రాముఖ్యత గూర్చి నేటి తరానికి చెప్పాలనే ఉద్దేశ్యంతో దీనిని రచించాడు. పెబ్బేరుకు చెందిన ఎడవల్లి నాగరాజు **"కాకి-కోకిల"** అనే చిన్న నాటికను రచించాడు. ప్రముఖ కవి, ఆధ్యాత్మిక వక్త అయిన డాక్టర్ పి. భాస్కరయోగి **'స్వామి వివేకానంద'** అనే ఏకపాత్రాభినయం అనే పుస్తకాన్ని రచించాడు. తాండూరుకు చెందిన చెందిన రచయిత రుద్రారం శ్రీనివాస్ రెడ్డి **'కుచేల సంసారం, అపూర్వసంపద, భారతనారి, క్రమశిక్షణ'** వంటి నాటికలను రచించాడు. అచ్చంపేటకు చెందిన ప్రసిద్ధ వైద్యుడు డాక్టర్ బి. బాలనారాయణ **'ఔట్ పేషెంట్'** అనే నాటికను రచించాడు. గద్వాలకు చెందిన ప్రముఖ కవి తిరుమల వెంకటస్వామి **"వినాయక చవితి"** అనే హాస్యనాటికను రచించాడు.

ఇంకా ఎందరెందరో తెలంగాణ నాటకరంగానికి ఊపిరి పోశారు. శక్తివంతమైన మాధ్యమంగా ప్రజల్లోకి చొచ్చుకెళ్ళ గల ఏకైక సాహిత్య ప్రక్రియ నాటకం. ఒకప్పటి రాజసాన్ని పొందిన నాటకానికి ఊపిరిపోయడానికి ప్రభుత్వం, సంస్థలు, కంకణం కట్టుకున్నప్పుడే అది సజీవమై నిలుస్తుంది. 'నాటకాంతం హి సాహిత్యం' అన్న ఆర్యోక్తికి దర్పణంగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. నారాయణ రెడ్డి. సి, ప్ర.సంపా. చెన్నయ్య. జె, సంపా. తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం, 2013. హైదరాబాద్. ప్రచురణ : తెలంగాణ సారస్వత పరిషత్తు

2. గౌరీశంకర్, జూలూరి ప్ర. సంపా. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, 2022. హైదరాబాద్. ప్రచురణ : తెలంగాణ సాహిత్య అకాడమీ

3. శ్రీహరి, రవ్వా, సంపా. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, 2016. హైదరాబాద్. ప్రచురణ : తెలుగు అకాడమీ

4. శ్రీకాంత్, భీంపల్లి. మహబూబ్ నగర్ జిల్లా తెలుగు సాహిత్య వికాసం, (పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం)

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# కాలవాహిని

డా. వొజ్జల శరత్ కుమార్, ఫోన్ : 996 353 3937



కాలమెంత కరుణ కాంచుచున్న దిలను
సమరవర్తియై తాను సాగుచుండు
ఏ విరామము నింత నెపుడైన గోరక
నెవరితో సంబంధ మెరుగకుండు
తా బుట్టిన దెపుడొ తా నాగున దెపుడొ
తా జీవకోట్లలో దనరుచుండు
తత్పరతను గాంచ తన సాటి యెటలేరు
వేగమందు దనకు వేఱు లేరు
నిష్ఠ దప్పక నీల్గక నియమ విధిని
వెలితి జూపక పరుగున వెళ్ళుచుండి
సాక్షియై నిల్చి యందరి చరిత దెలిసి
తాను గాదియై పుట్టును తప్పకుండ

వేప పూతల కాలమేదిల? వేళ మార్పుకు సూచ్ఛమై
కాపు గాసెడి కాలమేదిల? కమ్మ మామిడి తీపికై
తాపమార్పెడి చింత పుల్పుల తల్పు కాలమదేదియో
రూపమే కనరాని వత్సర రూపమౌను యుగాదిగన్

ముదమగును సమయము గనక
ఎద యెదను సుమధుర స్మృతుల యెరుకకు నిధియై
మది నిలుచును పికపు సుధలు
వదలని గురుతుల వలపుల వనితగ నెపుడున్

కాల వృక్షమునందు గనపట్టు నెప్పుడూ
ప్రభవ విభవలాది పత్రములుగ
శాఖోపశాఖలై షష్ట్యబ్ది చక్రము
ఆయువీయగ నిల్చు ననవరతము
యుగయుగంబుల బల యుతపు గాదులు
కాండమై యలరును గట్టి పడుచు
సూర్యచంద్రుల దీప్తి శుద్ధోదకము కాగ
విలసత్ ధృతియు కల్గి పెరుగుచుండు
శీత వర్షాతపములను పూత లిడుచు
కష్టసుఖ ఫలములొసగి కడకు తాను
లయమొనర్చు నీ గతిన లీలా వశమున
నేడు క్రోధి తాను చిగురై నిలువజేరె



మా నవ వాంఛలన్నిటికి మంగళరూపము గల్గజేయుమా
మానని గాయమేద్పులను మాన్పుచు జల్లగ మమ్ము గాచుమా
తేనెల నింపు శుద్ధమగు దీప్తిగ భాసిలు వాక్కు నీయుమా
మా నవ వర్ష క్రోధివిక మమ్ముల జేరెడి క్రోధమార్పుమా!
మా 'రామ'ణీయమౌ మందిర ప్రభ జూపి
శోభకృత్తెల్లెడన్ శుభము పలికె
కాశ్మీరవాణి నీ కన్నుల నిల్పెను
శోభకృత్తీవిధి సుందరాంగి
కాశీశు చరితపు కామ్యపథము నిచ్చి
శోభకృత్తీరీతి శోభగూర్చె
సర్వ మంగళ రూప మూర్వి కామాఖ్యగా
శోభకృత్తిట పున: సొబగు గూర్చె
క్రోధి స్వాగతమిక నీకు! గుండె నిండి
యున్న మంగళ క్రియలను మిన్న జేయ
బూని కీర్తి నిల్పవలెనో భువిని రామ్మ!
స్వాగతమ్ము సహృదయ సంతసంబు తోడ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక   సంపుటి -27 : సంచిక - 6

UGC CARE List Approved Journal
హైదరాబాద్   ఏప్రిల్ : 2024

# తెలంగాణ సాయుధ పోరాటం – జనగామ పాట

**రేశపల్లి భానుచందర్,** పరిశోధక విద్యార్థి, డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.ఫోన్ : 9160381693

**వ్యాస సంగ్రహం**

తెలంగాణ ప్రాంతం అణువణువున సాహిత్యసంపద కలిగిన ప్రాంతం. కవులు, కళాకారులు నడయాడిన ప్రాంతం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పరిపాలన సౌలభ్యం కొరకు 31 జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా ఏర్పడిన జనగామ జిల్లా ఎంతో మంది కవులు నడయాడిన ప్రాంతం. ఆదికవి పాల్కురికి సోమనాథుడు, తెలుగు ప్రజలకి శ్రీమత్ మహాభాగవత మాధుర్యాన్ని అందించిన పోతన పుట్టినగడ్డ, కాకతీయుల పరిపాలనలో శిల్పకళా సాహిత్య వైభవాన్ని నిలుపుకున్న ప్రాంతం. తమ రక్తార్పణ తోటి దొరల గడీలకి బీటలు పారించి సామాన్యులను సమరయోధులుగా మార్చి తెలంగాణ బానిస సంకెళ్ళు తెంచిన షేక్ బందగి, దొడ్డి కొమురయ్య పుట్టిన వీరగడ్డ. ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు, పీడిత ప్రజల విముక్తి కొరకు ఎర్రజెండా నీడలో ప్రజాయుద్ధంలో తనదైన ముద్ర వేసుకున్న పోరుగడ్డ. నిజాం పాలకుల అణచివేతను తరిమికొట్టడానికి ఉవ్వెత్తున లేచిన తెలంగాణ సాయుధ పోరాటంలో తమ ఆత్మార్పణతో ఉద్యమ కాగడాను వెలిగించిన వీరయోధులు పుట్టిన ఉద్యమ గడ్డ. ఇంతటి ఘనచరిత్ర కలిగిన జనగామ జిల్లా సాహిత్యంపై పరిశోధన చేయడం చాలా అవసరం. జనగామ ప్రాంతం గేయసాహిత్యంలో పేరొందిన ప్రాంతం కనుక **"తెలంగాణ సాయుధ పోరాటంలో 'జన'గామ పాట"** అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని గుణాత్మక పరిశోధన పద్ధతి (Qualitative Resarch Method) లో వివరిస్తాను. దీనికోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యంలో వచ్చిన జీవిత చరిత్రలు, కథలు, నాటకాలు, పాటలు, వ్యాస సంకలనాలు. విశ్వవిద్యాలయాల స్థాయిలో వచ్చిన పరిశోధనలు, విమర్శకులు, పరిశోధకుల అభిప్రాయాలను సందర్భోచితంగా విశ్లేషణకు ఉపయోగించుకుంటూ విశ్లేషణాత్మక పద్ధతిలో ఈ వ్యాసాన్ని వివరిస్తాను. జనగామ ప్రాంతంలో నుండి వచ్చిన అనేక ఉద్యమ పాటలు నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో తిరుగులేని ఆయుధంగా పని చేశాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుపరిచితమైన వ్యక్తి సుద్దాల హనుమంతు గారు కానీ అతనితో పాటు సమానంగా పాటలు రాసి పాడిన వాగ్గేయకారుడు వయ్యా రాజారాం అతని పాటల గురించి ఈ వ్యాసంలో కొంత పరిచయం చేయడం జరుగుతుంది.

**కీలక పదాలు :** తెలంగాణ సాయుధ పోరాటం, గేయాలు, సుద్దాల హనుమంతు, వయ్యా రాజారం, మౌఖిక సాహిత్యం.




**ఉపోద్ఘాతం**

గేయ ప్రక్రియ అనేది అతి ప్రాచీన ప్రక్రియ. మానవుడు భాషా జ్ఞానాన్ని పొందక ముందు నుంచే కొన్ని ధ్వనులను చేస్తూ తన భావాలను ఇతరులతో పంచుకోవడం జరిగింది. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు పాట అనేది మనిషి జీవితంలో ఒక ప్రత్యేకమైన విషయంగా కలిసిపోయింది. అంతేకాకుండా పాట కాలానుగుణంగా తన స్వరూప స్వభావాలను మార్చుకుంటూ వస్తూ ఉంది. ఒకానొక సందర్భంలో శ్రమశక్తిని మర్చిపోవడం కోసం పాట పని చేసింది. మరొక సందర్భంలో పాట మానసిక ఆనందాన్ని అందించడం కోసం ఉపయోగపడింది. కొన్ని సందర్భాల్లో పాట మనిషిలోని ఉద్వేగాలను ప్రేరేపించడం కోసం పని చేసింది. అయితే ఆధునిక కాలంలో పాటను ఒక చైతన్య సాధనంగా గుర్తించవచ్చు. ప్రత్యేకించి తెలంగాణ ప్రాంతం ఉద్యమాల ప్రాంతం కనుక ఈ నేల మీద జరిగిన అనేక ఉద్యమాలలో పాట క్రియాశీలకమైన పాత్రను పోషించింది. అందులో భాగంగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వేదిక అయిన జనగామ ప్రాంతం నుండి వచ్చిన పాటలను పరిశీలించడం మన బాధ్యత. కొంతమంది తమ జీవితంలో జరిగిన అనేక సంఘటనలో క్రియాశీలకమైన పాత్రను పోషించి ప్రజా రంజక విధానాలతో ప్రజలను చైతన్య పరుస్తారు. కానీ కాలక్రమంలో వారి సేవలను, గొప్పతనాన్ని ప్రజలు మర్చిపోవడానికి అవకాశాలున్నాయి. దానికి కారణాలు అనేక రకాలుగా ఉంటాయి. అయితే అలాంటి వారి యొక్క గొప్పతనాన్ని సమాజానికి అందించడం పరిశోధకులకు ఉన్న ఉత్తమ లక్షణం. జనగామ ప్రాంతంలో పేరుపొందిన కవి వయ్యా రాజారాం ఇలాంటి వారి పాటలను ఆధారంగా చేసుకుంటూ ఈ పరిశోధన వ్యాసం రాయడం జరిగింది.

విషయం

భూమి మీద నివసించే ప్రతి మనిషి స్వేచ్ఛను కోరుకుంటాడు. తన స్వేచ్ఛను ఎవరైనా దోపిడీ చేస్తే వారిపై తిరగబడతాడు. అలా తిరగబడడమే మార్పుకు సంకేతం. మార్పు అంటే విప్లవం. ప్రపంచ చరిత్రలో ఎన్నో మరుపురాని విప్లవోద్యమాలు వెలుగులోకి వచ్చాయి. అందులో ప్రముఖంగా చెప్పుకోవాల్సినవి అమెరికా స్వాతంత్రోద్యమం, ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవం, భారత స్వాతంత్ర్యోద్యమం. అయితే ఇందులో ఒక్కొక్క ఉద్యమానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. వీటన్నింటికి భిన్నంగా ఏర్పడ్డ విప్లవం తెలంగాణ సాయుధ పోరాటం. ఈ పోరాటంలో ప్రజలు తమ కడుపులో రగులుతున్న మంటను హోమ జ్వాలగా బయటకు తీసుకువచ్చి, అగ్నిశిఖల్లా భూస్వామి పెత్తందారి వ్యవస్థలపై కురిపించారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడత ప్రజల విముక్తి కోసం జరిపిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది తమ సర్వస్వం కోల్పోయారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి ఉద్యమానికి మొదటగా రక్తార్పణ చేసి, ఎంతోమంది ఉద్యమకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిన ఘనత మాత్రం జనగామ ప్రాంతానికి చెందుతుంది. 4000 మందికి పైగా ప్రాణార్పణ చేసిన తెలంగాణ సాయుధ పోరాటంలో జనగామ ప్రాంత ప్రజలు తమ రక్తంతో ఉద్యమానికి నెత్తురు తిలకం దిద్దారు. ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న అనేకమంది ఉద్యమ నాయకులను కన్నగడ్డ జనగామ ప్రాంతం. గన్నులతో రాజ్యంపై తిరుగుబాటు చేసిన వీరయోధులతో పాటు, కలం ద్వారా వారి గళం ద్వారా పోరాటానికి ఒక ఊతాన్ని ఇచ్చిన కళాకారుల గురించి కూడా చెప్పుకోక తప్పదు. జనగామ ప్రాంతంలో ప్రజలని సాయుధ పోరాటంలో భాగస్వాములుగా చేయడానికి పాట ఒక తిరుగులేని ఆయుధంగా మారింది. సుద్దాల హనుమంతు, వయ్యా రాజారాం, బండి యాదగిరి వంటి కరుడుగట్టిన ఉద్యమకారులను ఆదరించింది జనగామ ప్రాంతం. తెలంగాణ ప్రాంతంలోనే అతి క్రూరుడిగా పేరుగాంచిన విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి దౌర్జన్యాలను ప్రపంచానికి అర్థం అయ్యేలా వివరించారు నాటి కవులు. విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి కబంధహస్తాల్లో నలిగిపోతున్న జనగామ ప్రాంతానికి తెలంగాణలో అప్పుడప్పుడే మొలకెత్తుతున్న ఉద్యమాలు ఒక కొత్త ఊపిరిని ఇచ్చాయని చెప్పొచ్చు. గ్రంథాలయోద్యమం నుండి ఆంధ్ర మహాసభ వరకు వచ్చిన ఉద్యమాలు ప్రజల కష్టాలను, కడగండ్లను అర్థం చేసుకున్నాయి. సమర సంకేతాలను ప్రజా పోరాట ప్రతీకలుగా గుర్తించాయి.

**షేక్ బందగి – దొడ్డి కొమురయ్య మరణం– పాటల ఉధృతి**

అన్నదమ్ముల ఆస్తి తగాదాలలో అన్న పక్షాన బందగీ అనే ముస్లిం యువకుడు భూ పోరాటాన్ని ప్రారంభించి విసునూరు దొరపై విజయం సాధించడాన్ని తెలంగాణ ప్రజలు ఒక పెను మార్పుగా భావించారు. కానీ ప్రత్యర్థులను నామరూపాలు లేకుండా చేయడం నాటి ప్రభువులకి అలవాటే. ఆ కోణంలోనే షేక్ బందగిని దారి కాచి దారుణంగా హత్య చేశారు. ఈ పచ్చి ఘాతుకానికి ప్రజలు నా నా రకాలుగా స్పందించారు. బందగి వీర మరణం తర్వాత తెలుగు సాహిత్యంలో పాటకి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగేలా చేశారు నాటి ఉద్యమ నాయకులు. బందగి పోరాట తత్వాన్ని అనేక రకాలుగా పాటల రూపంలో రచించారు నాటి తెలంగాణ కవులు.

**"బందగి రక్తంబు చింది జ్వాలై**
**లేచి జాగీరుదారులను ఊగించి వేసింది"**

బందగి వీరమరణం తర్వాత ఎంతోమంది వారి ప్రాణాలను అర్పించారు. వీర కరుణ రసాలలో వారి గాథలను కట్టుకొని జనం అమరవీరులను నిత్యం స్మరిస్తూ ఉన్నారు. బందగి మరణం తర్వాత జనగామ ప్రాంతంలో ప్రజా చైతన్యం పెల్లుబికింది అని చెప్పవచ్చు. లేవి విధాన్యానికి వ్యతిరేకంగా కడవెండి గ్రామంలో నిరసనగా చేపట్టిన ర్యాలీలో విసునూరు దేశ్‌ముఖ్ గుండాలు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపి దొడ్డి కొమరయ్య అనే యువకుణ్ణి హత్య చేశారు. భూమి కోసం, భుక్తి కోసం లేవీ నుండి విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో నేలకొరిగిన తొలి వీరుడు దొడ్డి కొమరయ్య. అతని మరణం ప్రజలను మరింతగా కార్యోన్ముఖులను చేసింది. 1949 జూలై 4వ తేదీ నాడు మొదలైన ఈ పోరాటంలో ఎంతోమంది వీరులు ఉద్భవించారు.

దొడ్డి కొమరయ్య వీరమరణాన్ని నాటి కవులు తమ యొక్క కలం ద్వారా తెలంగాణ ప్రపంచానికి అందించడంలో సఫలీకృతులయ్యారు.

**"అమరజీవి నీవు కొమరయ్య / అందుకో జోహార్లు కొమరయ్య**
**న్యాయమన్నది లేని నైజాము రాజ్యాన /**
**విశ్వరాక్షసుడైన విసునూరు దేశ్ముఖ్**
**పాలించుచున్నయా పల్లె కడవెండిలో**
**ప్రజల హక్కుల కొరకు కొమరయ్య /**
**ప్రాణాలనిచ్చావు కొమరయ్య"** (జయధీర్ తిరుమల రావు, తెలంగాణ పోరాట పాటలు, పుట–212 )

అంటూ నాటి కవులు దేశ్ముఖ్ దౌర్జన్యాలను, అతని చేతిలో చనిపోయిన దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని తెలియజేస్తూ పాటలు పాడారు. ఈ పాటల యొక్క స్వభావాన్ని పరిశీలిస్తే మొదట అమరవీరుల కీర్తిని మరియు వారి త్యాగాలను ప్రజానీకానికి తెలియజేస్తూ, పాట చివరలో ప్రజల యొక్క కర్తవ్యాన్ని నిర్దేశించడం జరుగుతుంది.

**"నిన్ను బలిగొన్నటి నీచులను దునుమాడి /**
**నిన్ను గన్నట్టి తెలుగు గడ్డకి మేము**
**స్వాతంత్రముగా చేసి శాంతి చేదముగాక**
**నీ పేరు నిలపకనే కొమురయ్య /**
**మేము నిదురైన బోమోయి కొమురయ్య"**

అంటూ తెలంగాణ ప్రజలు వారి బానిస సంకెళ్ళ నుంచి విముక్తి పొందే విధంగా పోరాటం చేస్తామని దొడ్డి కొమరయ్య పేరు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా కీర్తిస్తామని పాట చివరిలో కవులు తెలియజేసేవారు. అయితే జనగామలో జరిగిన పోరాటలను నేపథ్యంగా తీసుకుని తెలంగాణలో ఉన్న కవులు అనేక సాహితీ ప్రక్రియలలో రచించేవారు. కానీ జనగామ ప్రాంతంలో పుట్టినటువంటి వయ్యా రాజారాం, సుద్దాల హనుమంతు గారు స్వయంగా వారు అనుభవిస్తున్నటువంటి అనేక సమస్యలను పాటల ద్వారా వివరించారు. ఉద్యమం తర్వాత సుద్దాల హనుమంతు గారి పేరు తెలంగాణ మొత్తం సుపరిచితమైనప్పటికీ తొలితరం ప్రజాకవిగా పేరుపొందిన వయ్యా రాజారాం గారి ఘన చరిత్ర మరుగున పడిపోయింది.

**వయ్యా రాజారం**

బుర్ర కథల రాజన్నగా ప్రజల్లో నిలిచిన వయ్యా రాజారం తెలంగాణ సాయుధ పోరాటంలో ఒక పాటల ప్రవాహం. ఆశువుగా పాటను కైకట్టడం ఈయన ప్రత్యేకత. ఆంధ్ర మహాసభను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాజారం పాత్ర అనితర సాధ్యం. ఆంధ్ర మహాసభలో సభ్యత్వం తీసుకున్న ప్రజలకు దొరలు, దేశ్ముఖ్ ల యొక్క వేధింపులు ఎక్కువైనాయి. ఆ సమయంలో దొరల గుండాల నుండి కాపాడటానికి "గ్రామ రక్షక దళాల" ను ఏర్పాటు చేయడం తప్పనిసరి అయింది. గ్రామ రక్షక దళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి ప్రజలు యువకులు ఉత్సాహం చూపించారు. వాలంటీర్లను కూడా నియమించడం జరిగింది. రాజారం వాలంటీర్ల చేరిక కోసం

**"వాలంటీల్లారా మీరందరూ వినండి**
**ప్రాణాముల నర్పించి పైకి నడువండి**
**దేశ సేవ కొరకు దీక్ష బూనండి**
**దాసులై ఉండండి దేశంబు కెల్లా"** అంటూ ప్రజలను చైతన్యపరిచే పాటలు ఎక్కువగా రాజారం కలం నుండే వెలుపడ్డాయి. వాలంటీర్లుగా ప్రజలను సంఘంలో క్రియాశీల సభ్యులుగా చేర్చడానికి ఇలాంటి పాటలను ప్రతి గ్రామంలో పాడుతూ ఉండేవారు.

**"మీ పల్లె రక్షణ మీపై కలదు / మీ ఇంటి రక్షణ మీదేను సుమ్మీ"**

అంటూ ప్రజల యొక్క కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ

**"ప్రజల రాజ్యము కొరకు పోరాడండి /**
**దెబ్బలకు జైలుకు భయపడకండి"**

అంటూ వాలంటీర్లపైన, గ్రామ రక్షక దళాల పైన అక్రమ కేసులు పెట్టిన భయపడకుండా ఎదుర్కోమని చెబుతూ

**"నాజీ నైజాం రాజు నరహంతకున్ని /**
**పడగొట్టి తొడగొట్టి పైకి నడవండి**
**కదలండి కదలండి కదన భూమికి /**







**ఎత్తండి ఎత్తండి ఎర్రజెండా ఎగురాలి**
**బాలచంద్రులై బయలుదేరండి /**
**వీరాభిమన్యుల్లాగా పోరాడండి"**(జయధీర్ తిరుమల రావు, తెలంగాణ పోరాట పాటలు, పుట-34)

ఈ విధంగా ప్రజలను నిజాంపై దండెత్తే లాగా చేయడంలో జనగామ ప్రాంత కవులు ముందు వరుసలో ఉన్నారు. ఇలా గ్రామ రక్షక దళాల సభ్యులుగా చేరిన వారి ఆచూకీ చెప్పండి అంటూ అనేకమంది సామాన్య ప్రజలను చిత్రహింసలకు గురిచేసి గడ్డివాముల్లో వేసి కాల్చి చంపేసేవారు. అనేక మందిని జైల్లో వేసేవారు. ఊర్లను ఊర్లనే క్యాంపులుగా మార్చేసారు. ఇలాంటి సంఘటనలు అనేకం జరిగేవి వాటిని కూడా పాటలుగా మార్చారు.

**"విసునూరి దేశంబు దొరోడు తలుసుకుంటే**
**దోపిడీకి బహు దొంగలే అన్నన్న / దొరల వేషము గట్టిరి**
**గబ్బేట గ్రామాన జూడు**
**కామ్రేడ్ తిరుమల రెడ్డిని / క్యాంపు లల్లా పెట్టి**
**కనికరము లేకుండా / కాళ్లు చేతులు చెట్టుకు కట్టి కాల్చి**
**చంపించినారన్నా"** (తెలంగాణ పోరాట పాటలు, పుట-123)

పోరాటంలో స్త్రీల పాత్ర కూడా చాలా ఎక్కువ అని చెప్పవచ్చు. గ్రామ రక్షక దళాల్లో పాల్గొన్న యువకులని పోలీసు వారు అరెస్టు చేసి క్యాంపులలో పెట్టినప్పుడు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మహిళలు ఎంతగానో కృషి చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచిత పటిమను చూపించిన మల్లు స్వరాజ్యం గారికి కూడా జనగామ ప్రాంతంతో అనుబంధం ఉంది. కామారెడ్డి గూడెంలో ఉన్నటువంటి తమ అమ్మమ్మ వాళ్ళ ఇంటికి తరచూ వస్తూ, ఉద్యమ కార్యక్రమాలు ఇక్కడి నుంచే నిర్వహించేది. రామచంద్రారెడ్డి అఘాయిత్యాలను, నిజాం రాజు దౌర్జన్యాలను ఆడవారు పాడుకునే బతుకమ్మ పాటల రూపంలో కైగడుతూ గ్రామ గ్రామాన రాత్రి సమయాలలో చుట్టుకాముల రూపంలో, బతుకమ్మ

పాటల రూపంలో ప్రజలకు వివరించేవారు. భారతి భారతి ఉయ్యాలో అంటూ సాగే బతుకమ్మ పాటల బాణి దొరల, దౌర్జన్యాలను వివరిస్తూ సాగుతూ ఉండేవి. ఉయ్యాల పాటలు ఎక్కువగా స్త్రీలు నాట్లు, కలుపు, కోతల పని చేస్తూ మరియు రాత్రులు వినోదం కోసం చుట్టూ కాముడు వేస్తూ పాడుకుంటారు. ఉయ్యాల పాటల పల్లవికి భారతి, చెల్లెలా మొదలైన పదాలని ప్రతి చరణం చివర పాడుకుంటారు. ఈ పాటలల్లో ప్రజా కంటకుల గురించి ప్రజావీరుల గురించి పాడుకుంటారు.

**"ఇస్నూరి గ్రామాన ఉయ్యాలో....**
**ఏసుమంటి సంగతి ఉయ్యాలో...ఏ తీరుగున్నది ఉయ్యాలో...**
**ఇస్నూరి దోరోడు ఉయ్యాలో...ఎంత పాపిస్టోడు ఉయ్యాలో...**
**అప్పుడు దోరోడు ఉయ్యాలో... ఏమేమి చేసిండు ఉయ్యాలో...**
**ప్రజల నోరు గట్టి ఉయ్యాలో... బంగాళా గట్టి ఉయ్యాలో...**
**అప్పుడు దొరోడు ఉయ్యాలో ... ఏమేమి చేశాను ఉయ్యాలో...**
**12 మందిని ఉయ్యాలో ... జీతగాళ్ళను పిలిచి ఉయ్యాలో" ...**

అంటూ సాగే ఈ పాటలో దొర గడి నిర్మాణం కోసం ముసునూరు గ్రామంలో ప్రజలను కట్టుబట్టలతో ఇండ్లను విడిచి వెళ్లగొట్టి వారి ఇంటి స్థలాలను ఆక్రమించుకొని ఆ స్థలంలో గడిని నిర్మాణం చేయించినటువంటి ఒక సంఘటనను వివరించారు ఇలాంటి అనేక దౌర్జన్యాలని వివిధ రూపాలలో వివిధ బాణీల్లో పాటలు కడుతూ వివరించేవారు.

**భూపోరాటం- భూ పంపకం**

ఈ విధంగా పాటల ద్వారా ప్రేరేపితులైన తెలంగాణ ప్రజలు వారు సాధించిన ప్రతి విజయం మీద ఒరిగిన ప్రతి వీరుని మీద ఆనాడు పాటలు రాసుకునేవారు, పాడుకునేవారు. చదువు సంధ్యలు లేకపోవచ్చు గాని బతుకు తెరువులో గుండె బరువును తగ్గించుకోవడానికి తమ బాధలు, వీరగాథలు పదం కట్టుకొని పాడుకోవాలన్న ఇంగితం ప్రతి కాలంలోని పేదవారికి ఉంటుంది. సామాన్యులు ఈ విధంగా సామాజిక సాహిత్యాన్ని సృష్టించుకుంటూ ఉంటే విద్యావంతులైన కవుల ప్రక్షణ నిలబడి వాళ్ళ కష్టాలను కన్నీళ్లను తొలగించే సాహిత్యాన్ని నిర్మించారు. సంఘం యొక్క కార్యక్రమాలు తెలంగాణ మారుమూల గ్రామాలలోకి కొద్దికొద్దిగా విస్తరిస్తున్న సందర్భంలో తరతరాలుగా అడవులు నరికి, బావుల్ని తొవ్వుకొని వ్యవసాయం చేసే గిరిజనుల భూములను కబ్జా చేసుకోవడం కోసం నాటి దొరలు ప్రయత్నాలు చేశారు. కానీ అప్పటికే పోరాట తత్వాన్ని పుణికి పుచ్చుకున్న ప్రజలు ఒడిసెలతో, రోకళ్ళతో, కారంపొడులతో దొరలను ఎదుర్కొన్నారు. ధర్మాపురం మైదం చెరువు కింద 30 ఎకరాల భూమిని లంబాడాల నుండి దోచుకోవడానికి ప్రయత్నం చేసి ఎనిమిది మందిని సజీవ దహనం చేసి భూమిని లాక్కున్నారు. ఆ సమయంలో కూడా మహిళలు, పిల్లలు, వృద్ధులు అనేక రకాలుగా పాటలు పాడుకుంటూ దొరలను ఎదిరించారు. రాత్రిపూట భూములలో కాపలా ఉండేవారు.

**"చేను కాపల మనం ఉంటే /**
**చేలో పందులు పడవు పశువులు ఎన్నడు రావు**
**వేగంబున మీరు రండి /**
**వెనుకబడి ఉన్న స్త్రీలను వెంటేసుకొని రండి"**

అంటూ ప్రతి ఒక్కరిని పోరాటంలో భాగస్వాములుగా చేస్తూ వారి భూమిని కాపాడుకోవడం కోసం అనేక రకాలుగా ప్రయత్నించారు. ఇలా ప్రజలు ప్రజా పోరాటాన్ని అందులో అసువులు బాసిన వీరులను తలుచుకుంటూ జనగామ ప్రాంతం నుంచి పాటలు వెలుబడ్డాయి.

**"మొండ్రాయి గ్రామాన చూడు**
**జారాతు తాను బట్టి / వందలాది ప్రజలు**
**వలవలగా ఎడవంగా / నిలబెట్టి కాల్చీరన్నో"**

అంటూ తమ భూమిని రక్షించుకోవడం కోసం ప్రజలు చేసిన ఉద్యమాల్ని సహించని నాటి దొరలు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నటువంటి తాను నాయక్‌ను అందరూ చూస్తుండగానే చెట్టుకు కట్టేసి కాల్చి చంపిన సంఘటనను ఉద్యమంలో ఒక ప్రార్థన గీతంగా మలుచుకుని పాడేవారు నాటి జనగామ ప్రాంత కవులు.

దొరలకు, భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా దళాల నిర్మాణం చేపట్టిన తర్వాత సంఘానికి సంకేతంగా ఎర్రజెండా ఎగిరింది. సంఘం పేరు మీద వచ్చిన పాటలన్నీ కూడా ఎర్రజెండా తన ఖాతాలో వేసుకుంది. కొన్ని వందల పాటలు ఎర్రజెండా పేరు మీద వచ్చాయి. ఎర్రజెండా ఎగిరిన చోట భూస్వామ్య పెత్తనం లేదన్న విషయం తెలిపోయింది. పోలీసు దాడులను తిప్పి కొట్టడానికి దళాలు ముందుకు వచ్చాయి. దొరల, భూస్వాముల అదనపు భూములను పంచే కార్యక్రమాన్ని చేపట్టాయి. రైతులు సాగు చేసుకుంటున్న భూముల నుండి భూస్వాములు భేదకలు చేయడం ఆపు చేసిన తర్వాత మళ్లీ ఆ భూములను రైతులను ఆక్రమించుకున్నారు.

**"రైఫిల్లు చేతబట్టి రణమందు దూకి బల్ దండిగా పోరి**
**రైతు రాజ్యము కోరి పోరాడే వీరు వీరాదీ వీరులు**
**................................................**
**రైతు కూలీ కల్సిమెల్సి రాజ్యాలు ఏలే రోజులు వచ్చే"**

(వయ్యా రాజారం, తెలంగాణ పోరాట పాటలు, పుట- 117)

దొరల ఆధీనంలో ఉన్న బీడుపడిన భూమిని చూసి రైతు ఎంతో బాధపడేవాడు అతని కళ్ళ ముందున్న భూమి తనది కాదని. అలాంటి పరిస్థితి మారి రైతు చాలా ఏళ్ల తర్వాత సగర్వంగా తన భూమిలో నూతన పంటలు పండించుకోగలిగాడు. వెనకబడిన తెలంగాణలోని భూమి పచ్చ పచ్చని పైరుతో నిండిపోతుంది అని భావించారు.

ఇలాంటి చారిత్రాత్మక సంఘటనలకి సజీవ సాక్ష్యాలుగా నాటి పాటలు మన కళ్ళముందు కనిపిస్తాయి.

**సైనిక చర్య ప్రభావం**

సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో జరిపిన సైనిక చర్య ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్ సైన్యాలు నిజాం సైన్యంపై సంపూర్ణంగా పట్టు సాధించాయి. నిజాం రాజు తను లొంగిపోతున్నట్లు అంగీకరించి ఇండియన్ యూనియన్‌లో నిజాం రాజ్యాన్ని విలీనం చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇదిలా ఉండగా సాయుధ దళాల ప్రతిఘటనకు భయపడి నగరాలకు పారిపోయిన దొరలు, భూస్వాములు ఖద్దరు బట్టలతో, గాంధీ టోపీలతో రాజకీయ నాయకులుగా మారారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల ద్వారా సాధించుకున్న విజయాలను, గ్రామ కమిటీలను కాపాడుకోవాలని ప్రచారం ప్రారంభమైంది. ఈ దశలో జనగామ తాలూకాలో ఒక పాట బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

**"మనకొద్దు దోపిడి రాజ్యం / మళ్లీ మనకొద్దు దొరల రాజ్యం**
**వద్దు మనకు వద్దు బానిస రాజ్యం / తినగ తిండి కట్టు**
**కొన గుడ్డలు అడిగితే / కనులెర్ర చేస్తుంది రాజ్యం**
**అల్లరి అని నిందవేస్తుంది రాజ్యం/శాంతి అని గొంతులను గోయూ రాజ్యం**
**రక్షణయని ప్రజల భక్షించు రాజ్యం/అన్నమన్న మన్ను చూపే రాజ్యం**
**అన్నమన్న ప్రజల నణిచివేస్తుంది రాజ్యం "**
(తెలంగాణ పోరాట పాటలు, పుట- 118)

అంటూ ఇండియన్ యూనియన్‌లో కలిసినప్పటికీ రాజకీయంగా దొరల ఆధిపత్యం ఎక్కువగా ఉన్నటువంటి సందర్భాన్ని గమనించిన ప్రజలు వివిధ పాటల రూపంలో వాళ్ళ నిరసనను తెలియజేశారు. కొత్త రాజకీయాల దుష్ట పోరాటాన్ని ప్రచారం చేయవలసినటువంటి అవసరం ఏర్పడింది. అందువల్ల ప్రచార సాధనాలు మార్పు చెందాయి. సైనిక చర్య తర్వాత పోరాటం కొనసాగింపు కోసం మౌలిక రూపాలతో గ్రామాల్లో ప్రచారాన్ని ఎక్కువగా చేయవలసి వచ్చింది.

**"ఒరి! మూట ముల్లే నెత్తిన బెట్టుక**
**ఏ ఊరెలెతావు ఏడ నువ్వుంటావు**
**ఎక్కడ బోయిన ఇదే విప్లవం**
**మూట ముల్లె కాలిపోతుంది**
**నైజాం మోదు నలిగిపోతాడు**
**మధ్యనే నువ్వు మాడిపోతావురో నెహ్రూగా "** (వయ్యా రాజారం, తెలంగాణ రైతాంగ పోరాట పాటలు, పుట-130 )

పోలీసు చర్య ద్వారా దళాలను, విప్లవాన్ని అణచాలని ఆలోచన చేసిన జవహర్ లాల్ నెహ్రూకి పాటల ద్వారా విప్లవం అనేది ఉదయిస్తున్న సూర్యునిలా నిరంతరం మానవాళితోనే ఉంటుందని కవులు ముందే హెచ్చరించారు.




దళ సభ్యులు ఇక్కడ ఒకరికొకరు ప్రభావితం చేసుకునేవారు. తమ ప్రచారాన్ని కొనసాగించేవారు ఇక్కడి పాటలల్లో వారి అవసరాలను, ప్రయోజనాలను మరియు యూనియన్ సైన్యానికి వ్యతిరేకంగా పాటల నిర్మాణం జరిగింది. దళాల మీద నిర్బంధం ఎక్కువైనకొలది కార్యకర్తలతో పాటు కవులు, గాయకులు, కళాకారులు కూడా గ్రామాలలో ప్రజలు పగలు తిరగలేక పోయారు. కొంతమంది అడవుల్లోకి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిని గుర్తించిన స్త్రీలు ప్రజలలో చైతన్యం కలిగించడానికి వారు పొలాలలో చేసే పని పాటల సమయంలో పాటలను కట్టుకొని పాడేవారు. ఈ పాటలు ఇప్పటికీ శ్రమ చేసే సమయంలో పాడుకుంటున్నారు.

సువ్వీ సువ్వన్నాల్లారా అంటూ సాగే రోకటి పాటను వయ్య రాజారామ్ కైకట్టి స్త్రీల ద్వారా ప్రచారం చేయించాడు.

**"సువ్వి సువ్వన్నల్లారా మాయన్నల్లారా**
**సువ్వి అని పోటు వేసి పాటా పాడంగా నేను ఒడ్లు దంచంగ**
**అట్లట్ల పోయేటి వారాలెవ్వరు ఆ ధీరులెవ్వారు**
**అడవుల్లా దిరిగేటి ఆంధ్ర బిడ్డలు**
**మన కన్నా బిడ్డలు / చిన్ని మన తమ్ముళ్లు చీకాటి దొరలు**
**వారు చీకటి దొరలు'** (జయధీర్ తిరుమల రావు, తెలంగాణ పోరాట పాటలు, పుట. 117)

ఈ విధంగా స్త్రీలు పొలం పనులకు పోయినట్లుగా సైన్యాలను నమ్మించి గెరిల్లా యోధులకు సద్దిమూటలు పట్టుకుపోయేవారు. వారు పాడుకునేటటువంటి పాటలు దళాల వారికి చెప్పి సంతోషపడేవారు. అలా పోయినటువంటి స్త్రీలు తమ పాటలను దళ సభ్యులకు, దళ సభ్యులు రాసిన పాటలను స్త్రీలకు వినిపించేవారు. ఈ విధంగా పాటల్ని ప్రచారం చేసేవారు. కానీ తర్వాత గుట్టలల్లో, ఊరి పొలిమేరల అడవులలో దాక్కున్న దళాలు సైన్యంచేపట్టే వలయాకారపు దాడులవల్ల చెల్లాచెదురైపోయాయి. సామాన్య ప్రజానీకానికి దళాలవారు క్రమక్రమంగా దూరమయ్యారు. కానీ ఏదో ఒక విధంగా దళ సభ్యుల పాటలు మౌఖికరూపంలోకి మారి ఊర్లలోకి ప్రవేశించేవి.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 18 హైదరాబాద్ ఏప్రిల్ : 2024

## ఇది నేటి ప్రపంచం

ఆర్. నవజీవన్ రెడ్డి, ఫోన్ : 9742377332

ఎండిన డొక్కలు
మాడిన బ్రతుకులు
నిరాశా నిస్పృహలు నేస్తాలు
మారని జీవితాలు
వర్షించని మేఘం
కరుణించని పాడిపంటలు

రెక్కాడని రోజులు
పస్తులతో నిదురపోతూ
మంచినీళ్లు తాగుతూ...
కొంచెం ఎంగిలి దొరికితే బాగుండు అన్న ఆలోచనలు
పసి కడుపులు నింపొచ్చు అనే తాపత్రయం
కన్నం వేసే ఆలోచన ఒకవైపు
మనిషినని గుర్తు చేసుకుంటూ మరోవైపు...

హృదయం ఎప్పుడో భూమిలాగ నెర్రెలువారింది
సహాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తూ
ఆ నీలిమేఘం ఎప్పుడు నాలుగు చినుకులను రాలుస్తూ
ఆ చినుకులతోనైనా కడుపు నింపుకుంటాం

నీరు లేక పైరు లేదు
పైరు లేక గింజలు లేవు
గింజలు లేక మనుగడే లేదు
అయినా
పండని నేలకు విలువ లేదు
పండించే రైతుకు విలువ లేదు
ఇది నేటి ప్రపంచం...
ఆధునిక హంగులతో
ముందుకెళ్తూ మరచిన అసలు నిజం



ఆ వీరుల వీరోచిత కార్యాలు ప్రజల పాటల్లో వినిపిస్తూ ఉండేవి. ఇలా అజ్ఞాతంలో ఉన్న వీరులు అమర జీవులైనటువంటి యోధుల గాధలు ప్రజల జీవితాలలో గుండెల్లో జీవంగా పాటల రూపంలో నిలిచిపోయాయి. ఆ తరువాత దళాలన్నీ కూడా ఏటూరునాగారం, ములుగు వంటి ప్రాంతాలకు వెళ్లడంతో జనగామ ప్రాంతంలో తెలంగాణ రైతంగ సాయుధ పోరాటం ఉద్యమానికి సంబంధించిన పాటల ప్రభావం కొంతమేర తగ్గిందనుకోవచ్చు.

**ముగింపు**

తెలంగాణ సాయుధ పోరాటానికి జనగామ ప్రాంతం ఒక దిక్సూచి ఈ ప్రాంతంలో జరిగిన ప్రతి ఒక్క సంఘటన తెలంగాణ ప్రజలను స్వేచ్ఛా వాయువులుగా పీల్చుకునే విధంగా చేసింది. దానిలో పాట పాత్ర చాలా గొప్పది. ఉద్యమకారులుగా అనేక పాటలు రాసిన కవులు తర్వాత రాజకీయ పరిణామాల వల్ల పోరాట పాటలను రాయడం తగ్గించారు. కానీ వారి స్ఫూర్తితో తెలంగాణ ప్రాంతంలో జరిగిన అనేక ఉద్యమాలలో సామాజిక చైతన్యంలో తమ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం జనగామ ప్రాంత కవులు తమ కలాన్ని గళాన్ని ప్రజా శ్రేయస్సు కోసమే వాడుతున్నారు. నాటి నుండి నేటి వరకు జనగామ ప్రాంతం ఉద్యమ సాహిత్యంలో పాటను శిఖరాగ్రాన నిలబెట్టిందని చెప్పవచ్చు. జనగామ ప్రాంతం కవుల కాణాచి అలాంటి ప్రాంతంలో నుండి వెలుగులోకి వచ్చిన అనేక మంది కవులు గురించి తెలుసుకోవడం మన బాధ్యత ఈ పరిశోధన వ్యాసం ద్వారా వివరించిన పాటలలో ఈ ప్రాంతానికి చెందిన కవుల గొప్పతనం తెలంగాణ సమాజానికి పరిచయం అవుతుందని ఆశిస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు**

1. తిరుమల రావు జయధీర్, 1990 జనవరి, తెలంగాణ పోరాట పాటలు, ప్రథమ ముద్రణ , పద్మావతి ప్రింటర్స్, హైదరాబాద్.

2. నారాయణరెడ్డి రావి, 2015, వీర తెలంగాణ నా అనుభవాలు-జ్ఞాపకాలు, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

3. రమేష్ పన్నీరు, 2021, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కడవెండి ప్రజల వీరోచిత పోరాటం, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

4. వెంకటేశ్వర్లు దేవులపల్లి. 2015, జనగామ ప్రాంత ప్రజల వీరోచిత పోరాటం, రెండవ ముద్రణ, పోరునేల పబ్లిషింగ్ హౌస్, హైద్రాబాద్.

5. శంకర్ రావ్ ఎలికట్టె, 2016 జూలై, ద్వితీయ ముద్రణ, తెలంగాణ రైతాంగ పోరాట భూమిక చాకలి ఐలమ్మ, నవ చేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

ఫోన్ నం :
6309873682



# ప్రాచీన తెలుగు కావ్యాలు – గిరిజనుల సాంస్కృతిక జీవనం

**డా. నూనావత్ రాంబాబు,** సీనియర్ ప్రాజెక్టు ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనం కేంద్రం, నెల్లూరు,
ఫోన్ : 9652009764

**పరిచయం :** ప్రాచీన కావ్యాల మీద గౌరవం తగ్గింది. ఆధునిక రచనలమీద మోజు పెరిగింది.మంచిదేకాని పరిశోధనకు ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి. ప్రాచీన కవుల రచనలలోని అనేక కోణాల మీద కొంత పరిశోధన జరిగింది. అయితే తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి వంటి అంశాల మీద తీక్షణమైన పరిశోధన జరగవలసి ఉంది. అలాంటి ఉద్దేశంతోనే, ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఉన్న గిరిజనుల జీవనాన్ని పరిశీలించదలచాను. ఇది గిరిజనుల సంస్కృతిని పరిరక్షించి తర్వాత తరం వారికి అందించడానికి తోడ్పడుతుందని భావించవచ్చు. గిరిజనుల జీవనపరంగా, సంస్కృతికపరంగా సాగే గిరిజనుల పరిశోధనద్వారా తెలుగువారి జీవన విధానంలో గిరిజనుల మూలవాసులుసామాజిక జీవితంఏవిధంగా ఉందో ప్రాచీన కావ్యాల ద్వారా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

నన్నెచోడుడు కుమార సంభవం, పోతన–ఆంధ్రమహాభాగవతం, శ్రీనాథుడు–శివరాత్రి మాహాత్మ్యం, పిల్లలమర్రి పినవీరభద్రుడు శృంగార శాకుంతలం, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక, అల్లసాని పెద్దన మనుచరిత్ర, శ్రీకృష్ణదేయరాయలు ఆముక్తమాల్యద మొదలైన ప్రాచీన కవుల కావ్యాల్లో ఉన్న గిరిజన సాంఘిక జీవనాన్ని లోతుగా గిరిజనులు ఆదిమూలవాసులైన సాంస్కృతిక చారిత్రక అధ్యయనం ద్వారా భవిష్యత్తు తరాలలోని భాషలు ఎలా అభివృద్ధి చెందాయో అనేది మూలవాసుల ద్వారా లోతుగా అధ్యయనం చేయడానికి పరిశోధన ఉపయోగపడుతుంది. ఈ కింది విధంగా గిరిజనుల సాంఘిక జీవనం తెలుగు ప్రాచీన సాహిత్యానికి ఎంతగానో తోడ్పడుతుంది.గిరిజనుల సాంఘిక జీవన విధానంలోని వేషధారణ, వేట, వ్యవసాయం, రాజ్యపాలనం, వస్తుసేకరణ, ఆహారం, వైద్యం మొదలైన అంశాలు తెలుగు ప్రాచీన కావ్యాల్లో ప్రస్తావించబడ్డాయి. ఈ పరిశోధన ద్వారా గిరిజనుల సాంఘిక జీవనాన్ని వివరిండం నా ఉద్దేశం.

**1.వేషధారణ :** గిరిజనుల జీవన విధానాన్ని వర్ణించే సందర్భంలో కవులు వాళ్ల వేషధారణలోని తీరు తెన్నుల్ని ప్రస్తావించారు. స్త్రీల, పురుషులు, పిల్లల వేషధారణ కావ్యాల్లో ప్రధానంగా కన్పిస్తుంది. స్త్రీల వేషధారణ ఇలావుంది.

**స్త్రీలవేషధారణ :** ఆంధ్రమహాభారతంలో గిరిజనుల ప్రస్తావన ఉన్నా, వాళ్ల వేషధారణ ప్రస్తావన కన్పించదు. నన్నెచోడుడు, ధూర్జటి, రఘునాథ నాయకుడు మొదలైన వాళ్ళు గిరిజనుల వేషధారణను వర్ణించారు.



నన్నెచోడుడు 'కుమారసంభవం'లో తపోవనానికి వెళ్ళుతున్న పార్వతి ఎదుకు స్త్రీలను చూసిందని వర్ణిస్తూ వాళ్ల వేషధారణ ఎలావుందో క్రింది పద్యంలో చెప్పబడింది.

**"హరినీల రాణులకు నాయువు వచ్చెనా**
**గమనీయమగు తనుకాంతులెసగ**
**మెఱుగుదీగలు గండుమీలపై నెలసెనా**
**దృగాసుర ద్యుతుల్ దేజరిల్ల**
**జమరను కేశపాశముల దుమ్మెద పిండు**
**దగిలెనా గుతిల కుంతలముల మర.....**
**శైలేంద్ర తనయ" ....** (పుట. 133)

గిరిజన స్త్రీల రూపురేఖల్ని రమణీయంగా వర్ణించబడ్డ పద్యమిది.

**కొఱవి గోపరాజు :** సంహాసన ద్వాత్రింశిక'లో చెంచు స్త్రీల వేషధారణ ప్రస్తావన ఉంది. విక్రమార్కుడు మారువేషాన్ని ధరించి దేశ సంచారానికై వెళ్లుతుండగా ఒకచోట చెంచు స్త్రీలు కన్పించారని వర్ణిస్తూ వారు ధరించిన వేషాన్ని ఇలా పేర్కొనడం జరిగింది...

**"గురిజ పేరులఱుత గొమరార ధరియించి**
**యడవి మొల్లల గురులందు జెరివి**
**పాఱుటాకులు మొలబాగుగా గట్టియే**
**తెంచు చెంచు సతులగాంచి"…….** (11–6)

గిరిజన స్త్రీలు పాఱుటాకుల్ని వస్త్రాలుగా, గురువిందపూసల దండల్ని ధరించారట, కొప్పులో కొండమల్లెల్నిపెట్టుకున్నారని పై పద్యం వర్ణిస్తుంది.

**ధూర్జటి :** 'శ్రీకాళహస్తిమాహాత్మ్యం'లో చెంచు స్త్రీల వేషధారణ వర్ణించబడింది. ఉడుమూరిలో చెంచు స్త్రీలుఎంత భాగ్యవంతులైనా తమ కులాచారాన్ని అనుసరించి పాటుటాకుల్ని వస్త్రాలుగా, గురివింద పూసల దండల్ని ధరించారని వర్ణించబడింది.

**'పట్టు చీరలు గట్ట భాగ్యంబు గల్గియు**
**బాఱుటాకుల గట్ట భారమనరుల**
**'మాణిక్య భూషా సమాజంబు గల్గియు**
**నెఱ్ఱని గురివిందలేటి కనరు'** .......(3-6)

కులాచారాన్ని అనుసరించి వేషధారణ చేయడం ఈనాటికీ గిరిజన సంప్రదాయంలోవుంది.

మరో సందర్భంలో భిల్లాంగనలు తమ భర్తలు సంచరిస్తున్నారని చెబుతూ వాళ్ల తమ తలలపై నెమలి పింఛాన్ని, నుదుట జేగురు రంగుబొట్టును. మెడలో గురువింద పూసల దండల్ని, వస్త్రాలుగా పాఅటాకుల్ని, నడుముకు జమిలి ఒడ్డాణాన్ని ధరించారని వర్ణించిన పద్యం ఇలావుంది.

**కఱకు జుంజుఱు వెంట్రుకల కొప్పుగాఢత**
**రంబుగా నెమలి పింఛంబు జుట్టి**
**తట్టుపునున వన్నె పెట్టునట్టు లలాట**
**పట్టిక జేగుఱుబొట్టు పెట్టి.....** (3-15)

పండుగ సమయాల్లో ధరించే విశేష వేషధారణ గురించి ధూర్జటి ప్రస్తావించారు.కాటిజేని జాతరకు పోతున్న చెంచుస్త్రీలు ఇలా ఉన్నారని ధూర్జటి వర్ణించారు.

**కుటిల కుంతల జాలఫాల పట్టికలు జేగురు...**
**కాండమండిత దోర్దండంబుల నెమలి పురిదండలు**
**బులనవతం భూత మయూర వర్ణంబులు....**(3-36)

**రఘునాథనాయకుడు :** 'వాల్మీకి చరిత్రం'లో రెండు సందర్భాల్లో స్త్రీల వేషధారణను ప్రస్తావించడం జరిగింది. కిరాతుని భార్యను ఇలా వర్ణించారు.

**"కుదురుగ జంగసాని చనుగుబ్బల మీదుగా బాబుటాకు బయ్యెదపాదలంగ....."** అని అంటాడు. (2-15)

తపోనిష్ఠలో ఉన్న కిరాతుని తపస్సును మాన్పించడానికై వచ్చిన కిరాతుని భార్య గురువింద పేరుల్ని, దంతపు కమ్మల్ని, పగడాలు, రతనాలు, పికిలి పూలదండల్ని కొప్పులో మల్లెమొగ్గల్ని ధరించిందని వర్ణించినపద్యం ఇలావుంది.

**కుఱుకు గుబ్బలతోనే గురువింద పేరులు**
**గునియుచు బెనగొన గొండ్లి చూప....**
**చెక్కుటద్దంబు సేయు......** (2-140)

**గడియారం వేంకటశేషశాస్త్రి :** 'శివభారతం'లో గిరిజనులైన మాపళా స్త్రీల వేషధారణ వర్ణించబడింది.

శివాజీ చుట్టూ చేరిన మావళా స్త్రీలు ఏనుగుదంతపు గాజుల్ని, గవ్వల దండల్ని, గురువింద పూసల దండల్ని, మాసిన అల్లికల బొంత పావడల్ని ధరించారని తెసియజేసే పద్యం ఇలా ఉంది.

**ఏనుగు దంతపుం జికిలి యెత్తిన గాజులు గువ్వగత్తులన్**
**దూనిగలైన పెన్ జడలు తోరుములే గురువెంద దండలున్**
**మానితశీలరక్షక మాసిన యల్లిక బొంతపావడల్**
**పూనిన మావలే సతులు పొడమియూరి శివాజి కన్నులన్.**(2-50)

కవులు వర్ణించిన పై పద్యాల్ని పరిశీలిస్తే గిరిజన స్త్రీలు పాఱుటాకుల్ని చీరలుగా, గురువింద పూసలదండల్ని, గవ్వ దండల్ని హారాలుగా, నెమలి ఈకల ఆభరణాన్ని అలంకారంగా నుదుట జేగురు రంగుబొట్టును, ఏనుగు దంతాల గాజుల్ని ధరిస్తారని, కఱకు జంజురు వెంట్రుకలపై నెమలి పింఛాన్ని ధరిస్తారనితెలుస్తుంది. నేటి గిరిజనుల వేషధారణకు పై పద్యాలు దగ్గరగా ఉన్నాయి.

**2. పురుషుల వేషధారణ :** పిల్లలమర్రి పినవీరభద్రుడు 'శృంగార శాకుంతలం'లో పుళిందులు ధరించిన వేషధారణను వర్ణించాడు. దుష్యంతునికి కానుకలు సమర్పించడానికై వచ్చిన పుళిందుల వేషధారణను ఈకింది పద్యంలోఎలా వర్ణించారు.

**జుంజురు పల్ల వెంద్రుకల జొంపములుందగల మస్తకంబులుం.**
**గెంజికురాకు గెంపుదులంకించెడు వట్రువ కన్నులు జర**
**త్కుంజర చర్మ పట్టములకున్ సరివచ్చు బెరళ్లమేసులున్**
**ముంజులుగొల్వ గౌందఱు సముద్ధతి వచ్చి పుళింద వల్లభుల్**(1-97)

ఎరుపురంగు గల జుంజురు వెంట్రుకల సమూహం, లేత ఎరుపు రంగుతో సమానమైన వట్రువ కన్నులు, ఏనుగు చర్మాలతో సమానమైన చెట్టు బెరడుల వస్త్రాలతో పుళిందులు వచ్చారని కవి వర్ణించారు.

**కొఱవి గోపరాజు :** గోపరాజు 'సింహాసనద్వాత్రింశిక'లో చెంచుల వేషధారణను ప్రస్తావించారు. విక్రమార్కునిసభలోకి ఒక చెంచు వచ్చాడట. అతడు పచ్చని నీలివస్త్రాల్ని, పూసల దండల్ని ధరించాడట. నుదుట ఎర్రనిబొట్టును పెట్టుకొన్నాడట. పిడికత్తి, విల్లు సమ్ముల్ని ధరించాడని వర్ణించిన పద్యం ఇది.

**నెమ్మిబచ్చని కుప్పసంటును మీరి తీరములీలియుం**
**దమ్మిపీసల పేర్లు వెఱ్ఱని ధాతు గొట్టును జూడనం**
**గమ్మమై గదు సొమ్ముగా పిరివత్తి కాసిన మర్చి పా**
**అమ్ములన్విలుగేలు బొక్కానియంత జెంచరుదెంచుచున్'..**(8-9)

**అల్లసాని పెద్దన :** పెద్దన 'మనచరిత్రలో'లో ఎఱుకుల వేషధారణను గూర్చి ప్రస్తావించారు. వేటకై స్వరోచి వెంట బయలుదేరిన ఎఱుకుల వేషధారణను ఇలా వర్ణించారు.

**"కట్టిన నీలిదిండ్లు సెలకట్టియు విండ్లును విండ్లగేసెనల్**
**చుట్టి నొసళ్ళపై నిడిన జుంజురుబల్లసిగల్ కటితటిం**
**బెట్టిన మూట కత్తులును మేనులగార్కొను కప్పులేర్పిచే**
**బట్టినయమ్ములును........** (4-33).

నుదుట వ్రేలాడుతున్న ఎరవ్రి చింపిరి జుట్టుతో రకరకాల విల్లుల్ని, అమ్ములిన్న, మోటకతుల్ని ధరించి వేటకు బయలుదేరారట.

**తరిగొప్పుల మల్లన :** మల్లన 'చంద్రభానుచరితం'లో ఎరుక పాళెగాని వేషధారణను వర్ణించారని సురవరం ప్రతాపరెడ్డి గారు తమ 'ఆంధ్రుల సాఘిక చరిత్ర'లో పేర్కొన్నారు. అంపపొదికి నెమలి పురిచుట్టి, నెలను అను కట్టెతో చేసిన విల్లును బూని మొలకు పులితోలు చుట్టి నడుము దట్టీతో కురుచవిడెముడోసి, పికిలి పూలదండలు చేసుకొని, కుడిచేతి నందిపై గురిగింజల దండలు పెట్టుకొన్నారని వర్ణించారు. (ఆంధ్రుల సాంఘిక చరిత్ర. పుట. 321)

**రఘునాథ నాయకుడు :** రఘునాథ నాయకుడు తన 'వాల్మీకి చరిత్రం'లో బోయవాని వేషధారణను గూర్చిప్రస్తావించాడు. ఋషులు బోయపల్లెను దాటిపోతుండగా వారిని ఒక బోయవాడు అడ్డగించాడని, అతడునడుముకు నల్లని వస్త్రాన్ని ధరించాడని, నల్లని శరీరం కలవాడనీ, అటూ ఇటూ బాణాల్ని ప్రయోగిస్తూసమీపించాడని వర్ణించిన పద్యం ఇలా ఉంది.

కటినటియించు నీలిబలుకాసెయు నల్లని మేను జిమ్మ చీ
కటి ఘటియింపజేత విలుగైకొని మేఘము పిల్లవోలెన
ట్టిటు శరపంక్తులడ్డముగ చేయుచునాయుడు వచ్చి.... (2-98)

మునుల హితోపదేశాన్ని విన్న కిరాతుడు తన సహజ వేషాన్ని వీడి మునివేషాన్ని ధరించాడని వర్ణించేసందర్భంలో కిరాతుడు ధరించే సహజ వేషధారణ ప్రస్తావించబడింది. నుదుట జేగురు రంగుబొట్టు పెట్టుకోవడమానేశాడనీ, విల్లుధరించడం, సిగను ధరియించడం, నీలివస్త్రాన్ని ధరించడం మానేశాడని ఈ కింది పద్యం తెలియజేస్తుంది.

'నుదుట జేగురు బొట్టు పదనింక గాదని.
తులసి మృత్తిక నూర్వ తిలకమిడియె
నెలను విల్లు వహించు కెలసంబుగాదని.
వేణుకుండిక యొందు పాణిబూనె
సొగసు నున్నని కోరసిగ సూటిగాదని
నిడుద పన్నెఱులెట్ల జడలుదార్చి
నిండుగాటంపు నీలిదిండుగాదని కోటి
బఱచని నార చీరలు ధరించె......(2-127)

జేగురు రంగుబొట్టు, కోరనిగ, నీలివస్త్రం కిరాతుల వేషధారణలో సహజంగా కన్పిస్తాయి. కిరాతుడు నెమలిపింఛాన్ని ధరించాడని మరోచోట చెప్పబడింది. నెమ్మిపించెపు దండు గ్రమ్మి చుట్టెడికొప్పు (2-132)

**ముద్దుపళని :** 'రాధికాస్వాంతనం'లో ఎఱుకుల వాని వేషధారణ ప్రస్తావించబడింది. నడుముకు దట్టిని చుట్టుకున్నాడని, దట్టీలో కొడవలిని చెక్కుకున్నాడని, మెడలో పూసల దండల్ని, చెవులకు



పీలిబెండ్లను, తలలో కొంగ ఈకల్ని, గవ్వల దండ్లని, సెలసువింటిని, అల్లికబుట్టను ధరించి పక్షుల్ని వేటాడడానికి బయలుదేరాడని వర్ణించిన పద్యం ఇలా ఉంది..

'కుఱుచగా జుట్టిన కుఱుమాపుదట్టిపై
గోడవలి లోదోటి కూడ జెరివి
కొడిది పూసల పేరు మెడనంటగా గట్టి
బిగి యొక్క జెవి చీలిబెండ్లు వెట్టి
కొంగ యీకలు గొన్ని యంగుగా దలజుట్టి
గట్టి యల్లిక తట్టబుట్ట చంకన మర్చి......
గొక్కెరను బట్టుచును వచ్చెనొక యెఱుకు'.... (1-105)

**గడియారం వేంకటశేషశాస్త్రి :** వీరు తమ 'శివభారతం'లో మావకావీరుల్ని గిరిజనులుగా పేర్కొన్నారు. గిరిజనులైన మావళా వీరులు శరీర సౌష్టవం కలవాళ్లని, కౌపీనం ధరించారని మెలికలు తిరిగిన కొరకుచ్చు మీసాలు కలవారని వర్ణించిన పద్యం ఇలా ఉంది.

**'కరిగిపోసిన యుక్కుగంటమ్ములను బలి**
**ష్ఠములైన శ్యామలాంగములు మెఱయ**
**జలిగాలి నెండకాకలుదరి బలుపారు**
**మాయ మర్మములేని మనసునకద్దమౌ......**
**జవకోరకుచ్చు మీనములు వెలయు'** (2-249)

పై ఉదాహరణల్ని పరిశీలించినచో గిరిజనులు సాధారణంగా బలిష్ఠమైన నల్లటి శరీరం కలవాళ్లని, జింకచర్మాన్ని లేదా పాఱుటాకుల్ని వస్త్రాలుగా ధరిస్తారని, చింపిరిజుట్టు, నుదుట జేగురురంగు బొట్టు, తలపైనెమలిపింఛం లేదా పక్షుల ఈకలు ధరిస్తారని విల్లమ్ములు, కత్తిలాంటి ఆయుధాన్ని కలిగి ఉంటారని చెప్పవచ్చు.

**3. పిల్లల వేషధారణ :** గిరిజన పిల్లలకు సంబంధించిన వేషధారణ ప్రస్తావన కేవలం ధూర్జటి రాసిన శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో మాత్రమే కన్పిస్తుంది. చెంచు కుమారుడైన తిన్నని తల్లి స్నానం చేయించి అలంకరించిందని వర్ణించిన పద్యం ఇలా ఉంది.

**జలకంబార్చి విభూతిబెట్టి కటిగుంజాబీజ సంకీర్ణ మే
ఖల బంధించి మయూర పక్షలతికా కాండంబులజేసి సం
దిలి దండల్స వరించి కన్నుగవ గాంతి గాటుక దీర్చిమం
దులతాయెత్తులు గట్టినన్ శబర పుత్రుల్ గూడియాడంబురిన్**(3-32)

స్నానం చేశాక విభూతి రేఖల్ని తీర్చి, నడుముకు గురువిందె పూసల మొలత్రాడు జుట్టి, నెమలి ఈకల్నితలపై పెట్టి, సందిటిలో పూసల దండల్ని కట్టి, కన్నులలో కాటుకను తీర్చి, మందుల తాయెత్తును కట్టి తిన్ననికి అలంకారం చేశారట. ఇది సాధారణమైన వేషధారణ.

మరో సందర్భంలో అడవిలో జరిగే కాట్రేని జాతరకు పోతున్న సమయంలో చేసిన ప్రత్యేక వేషధారణ ప్రస్తావన ఉంది. జాతరకు పోయేటప్పుడు తల్లిదండ్రులు తిన్ననికి స్నానం చేయించి విభూతి పెట్టి, రక్షమూలికల మాలల్ని మెడలోవేసి, తలపై లేతతీగల్ని జుట్టి, విల్లునమ్ముల్ని ధరింపజేశారని ధూర్జటి ఇలా వర్ణించారు.

**జలకంబాడి విభూతి పెట్టుకొని రక్షామూళికామాలికా
వలయంబుల్ తొడి దట్టిగట్టుక శిరోవర్ధిష్ణు నీలాలకం
బులలేదీగను జుట్టికేల విలునమ్ముల్ పూని కాట్రేని పూ
జలు సేయన్ వెడలెంగుమారుడు.......**(3-38)

పూజ సమయంలో ప్రత్యేక వేషధారణ కలిగి ఉంటారని ధూర్జటి వర్ణించారు. పై విధంగా పురుషుల, స్త్రీల, పిల్లల వేషధారణ ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రస్తావించబడింది.

**ముగింపు :** గిరిజనుల సాంఘిక జీవనాన్ని చిత్రిస్తూ స్త్రీ, పురుషులు, పిల్లల వేషధారణ, వారి ధైర్యం సాహసాలు, కపటంలేని నిర్మల హృదయం, దైవభక్తి, ధర్మానురక్తి, ధర్మరక్షణ మొదలైనవి ప్రాచీన సాహిత్యంలో పేర్కొనబడ్డాయి. గిరిజనుల ప్రధానవృత్తి వేటయని కొందరు కులాచారాన్ని యధావిధిగా అనుసరించే వాళ్ళనీ, మరికొందరు వ్యవసాయం, అటవీ వస్తువుల సేకరణ, మరికొందరు రాజ్యపాలన చేసేవాళ్ళని వర్ణించబడ్డారు, రాజ్యపాలనను ప్రస్తావిస్తూ రాష్ట్రం, దేశంలాంటి శబ్దాల్ని కొందరు కవులు ప్రయోగించారు. కొన్నింటిలో గిరిజనుల ఆహారం, వైద్య విధానం మొదలైన అంశాలు తెలుగు ప్రాచీన కావ్యాల్లో చర్చింబడ్డాయి. ప్రాచీన సాహిత్యంలో ఉన్న గిరిజనుల గురించి లోతుగా పరిశోధన జరగవలసిన అవసరం ఎంతైనావుంది. అలాంటా పరిశోధనలు రావడం వల్ల భవిష్యత్తు తరాలవారికి గిరిజనుల ప్రాచీన సాహిత్యాన్ని తద్వారా తెలుగు ప్రాచీన సాహిత్యానికి పరిపుష్టి చేయడానికి గిరిజనులు ప్రాచీన అధ్యయనం కూడా ఎంతో అవసరమని నా అభిప్రాయం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గోనానాయక్, ఎం. గిరిజన సాహిత్యం, హైదరాబాదు: తెలుగు అకాడమి, 2012.

2. చినవెంకటేశ్వర్లు,భూక్యా, ట్రైబల్ లైఫ్ (ఆదిమతెగల, గిరిజనుల సమగ్ర జీవిత చిత్రణ), గుంటూరుయోజిత్బుక్ లింక్స్, 1994.

3. నరసింహారెడ్డి, పి, ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు. తిరుపతి : శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, 1984,

4. రామరాజు, బి. తెలుగు జానపద గేయసాహిత్యం, హైదరాబాదు ఆంధ్ర రచయితల సంఘం, 1958.

5. రామాచార్యులు, బి, తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి, హైదరాబాదు : ఓంసాయి గ్రాఫిక్స్, 2001,

6. బాలగంగాధరరావు, యార్లగడ్డ. శ్రీమహాభారతము (ఆది, సభాపర్వాలు) విజయవాడ : నిర్మలా పబ్లికేషన్స్, 2006. 7. బాలగంగాధరరావు, యార్లగడ్డ, శ్రీమహాభారతము (ఆరణ్యపర్వము -వచనము విశేషవ్యాఖ్య) విజయవాడ :నిర్మలా పబ్లికేషన్స్, 2011.

8. వెంకటరెడ్డి, కసిరెడ్డి, జానపద గిరిజన సాహిత్యం. హైదరాబాదు : తెలుగు భారతి సాహిత్య పత్రిక, 2010.

9. సూర్యాధనంజయ్. రామాయణ అరణ్యకాండలోని ఆశ్రమాలు – శ్రీరాముని దర్శనాలు. హైదరాబాదు : శీతల్ పబ్లికేషన్స్, 2009.

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

**సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177**

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**

**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# సామాన్యుని హృదయ వేదన – 'కన్నీటి సీమ'

**డా. కలువకుంట ఈశ్వర బాబు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల. ఫోన్ : 94416 44462

సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు ఏలిన ప్రాంతంగా దీనిని రాయలసీమ అన్నారు. ఇక్కడ వజ్రాలు రాసులుగా పోసి అమ్మేవారట. అటువంటి ఈ రాయలసీమ కాలక్రమంలో కరువు ప్రాంతంగా మారిపోయింది. ఇప్పటికీ ఈ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నది. దేశంలోనే అత్యంత తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లా అనంతపురం ఈ ప్రాంతంలోనే ఉన్నది. ఈ కరువు ప్రాంతంలోని ప్రజల సమస్యల్ని కవిత్వీకరిస్తూ రాయబడినదే ఈ 'కన్నీటిసీమ'.

డాక్టర్ ఈశ్వరరెడ్డి గారు వివిధ సందర్భాలలో రాసిన కవితలన్నిటినీ కలిపి **'కన్నీటిసీమ'** అనే పేరుతో గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో సామాన్యుని సమస్యలు, కష్టాలు, ఇబ్బందులు, ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు వంటి అంశాలు కేంద్రంగా చేసుకొని రాసిన కవితలు ప్రధానంగా ఉన్నాయి. 'కన్నీటిసీమ' కవితా సంపుటి 2003లో ప్రథమ ముద్రణ పొందింది. 2007లో తిరిగి ముద్రించబడింది. ఇందులో మొత్తం 28 కవితా ఖండికలున్నాయి. ఇవన్నీ కూడా విభిన్నాంశాలకు చెందినవి. ఇందులోని చాలా కవితా ఖండికలు రచయిత స్వయంగా చూసినవి, అనుభవించినవి. అందుకే ఇందులోని కవిత్వం అంత అద్భుతంగా ఉంటుంది.

రచయితకు గ్రామసీమలంటే ఎంతో మక్కువ. అందుకే ఈ 'కన్నీటిసీమ'లో గ్రామాల అవసరాన్ని, పల్లె ప్రజల నిష్కల్మషమైన ప్రేమానురాగాలను, వారి నమ్మకాలను, చక్కగా కవిత్వీకరించారు. అనేక రుగ్మతలకు నిలయమైన నగర జీవితాన్ని **'నాకొక పల్లె కావాలి'** కవితలో వ్యతిరేకించి పల్లె కావాలంటూ గ్రామీణ జీవితం పట్ల తన అనురక్తిని చాటుకున్నాడు. పల్లెలో ఉండే ప్రేమలు, ఆప్యాయతలు, అనుబంధాలు, పట్టణాలలో కనిపించవు. పల్లెలో ఒకరికి కష్టం వస్తే మిగతా వారు వారిని ఓదార్చుతారు, వీలైనంత సహాయపడుతారు. అదే పట్టణంలో ఎవరు బ్రతుకు వారిదే, ఎవడి కష్టం వాడిదే. పక్కింటి వారికి కష్టం వచ్చినా పట్టించుకొనే నాథుడు ఉండడు. పల్లె జీవితం, పట్టణ జీవితం రెండింటినీ రుచి చూసిన రచయిత **'నాకొక పల్లె కావాలి'** అనే కవిత రాశారు. ఇక్కడ పల్లె కావాలి అంటే రచయిత ఉద్దేశం ఆ పల్లెలోని ప్రజల మధ్యన ఉండే ఆప్యాయతలు, అనురాగాలు, అభిమానాలు, ప్రేమలు, కష్టాల్లో అండగా నిలబడడం వంటివి కావాలనే భావనతో ఈ కవిత రాశాడు. పల్లెటూరులో నిద్ర లేవగానే ఇంటి కల్లాపి చల్లి ముగ్గులు పెట్టడడం, సంక్రాంతి పండుగకి బొబ్బమ్మ ముద్దలు పెట్టడం వంటివి పట్టణాలలో కనిపించవు. గ్రామీణ భోజనమైన రాగి సంగటి, చింతకాయ ఊరుబిండి, ఒట్టి మిరకాయ కూరలు పట్టణంలో పెద్దగా వినియోగించరు. గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు ఆడుకొనే కోత్తి కొమ్మచ్చి, తొక్కుడు బిల్ల, ఎన్నో కుప్పలాటలు పట్టణాలలో మచ్చుకైన కనిపించవు. రచ్చబండ దగ్గర వీధినాటకాల వద్దికలు, భజన మందిరాల దగ్గర పండరి భజనలు వంటి విషయాలు పల్లెలకే ప్రత్యేకం. అసలు 'అతిథి దేవో భవ' అనే మాట పుట్టిందే పల్లె సీమలో. పచ్చని పొలాలు, రంగురంగుల పక్షులు, నీటితో నిండిన బావులు, పశువులు వంటి వాటితో సందడిగా ఉండే నా పల్లె టీ.వీ.లు, కేబుల్ కనెక్షన్ రాకతో స్వరూపమే మారిపోయింది. నాగరికత పేరుతో రోజురోజుకి పల్లె జీవితం ఎటువంటి కల్మషం, నాగరికతల అంటు జాడ్యంలేని స్వచ్ఛమైన పల్లె కావాలంటూ రచయిత ఈ కవితలో ఆకాంక్షించారు.



"కాఫీ నీళ్ళ అవకాశవాద అనుబంధాల్ని
కళ్ళను ఏమార్చే కాగితప్పూల మాయావలయాన్ని
అమ్మస్థానాన్ని ఆయాకు బదలీచేసిన విషసంస్కృతిని
ముక్కలు చేసి వెళ్ళదానికి నాకొక పల్లె కావాలి"

"ఆకాశాన్ని గడియారంగా ధరించిన కోడిపుంజు
నక్షత్రాల కదలికను జాముల్లోకి అనువదించి
వేకువ గొంతుతో ఊరిని నిద్రలేపేది"

ఇటీవలి కాలంలో కరువు అత్యంత సాధారణ సమస్యగా మారిపోయింది. రాయలసీమకు కరువుకు మధ్య విడదీయరాని అనుబంధం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో ఏళ్ళైనా తాగునీటి కోసం అల్లాడుతున్న పల్లెలు ఇంకా ఉన్నాయి. పాతిక సంవత్సరాలకు పూర్వం వచ్చిన ఏడేళ్ళ కరువు ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. అప్పుడు అడవుల్లో

దొరికే దేవదారాకును తిని ప్రాణాలు కాపాడుకున్నారని **'గుండె కరువు'** కవితలో విశదీకరించాడు. రాయలసీమ ప్రజలకు కరువు అలవాటే. కరువులో తినడానికి తిండిలేక ప్రాణాలను కాపాడుకోవడానికి అడవికి ఆకో, ఆలుము తిని బ్రతికేవారంట. అయితే ఇప్పుడు ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి పేరిట అడవులను నరికేస్తున్నారు. మట్టిని త్రవ్వేస్తున్నారు. అందువలన వర్షాలు కూడా సరిగా కురవడంలేదు. ఈ రకంగా మానవుడు అడవుల్ని నాశనం చేసి దిష్టి బొమ్మలుగా మార్చేస్తుంటే వ్యవసాయం పై ఆధారపడి జీవించే పల్లె ప్రజలు ఏమైపోవాలి. ఎలా బ్రతకాలి. అందుకే ఎందరో పల్లె ప్రజలు బ్రతుకు తెరువు కోసం గుండెలు నిండా బాధతో వలస పోతున్నారని రచయిత ఎంతో ఆవేదనతో ఈ 'గుండె కరువు' కవిత రాశారు.

**"ఏడేళ్ళ కరువు బుసకొట్టినప్పుడు**
**అన్నం మెతుకు అదృశ్యమైపోతే**
**దేవదారాకు ఉడకబెట్టి ప్రాణాలకు ఉట్టికట్టుకున్నారట**
**ఇప్పుడు వొట్టిపోయిన అడవులు దిష్టిబొమ్మలై వెక్కిరిస్తుంటే**
**మనసు కాలిన పల్లె వలసబోయింది"**

కరువు నిత్యకృత్యంగా మారిన రాయలసీమ దుస్థితిని గురించి **'కన్నీటిసీమ'** కవితలో రచయిత చెప్పిన విషయాలు మనసుతో చదివితే గుండె బరువెక్కి కళ్ళు కన్నీటి జలపాతాలవుతాయంటే అతిశయోక్తి కాదేమో! వర్షాలులేక నీటి వసతిలేక రాయలసీమలో కరువు నిత్యం కరాళ నృత్యం చేస్తుంటుంది. నీటి వసతిలేక పంటలు పండించక పోవడంతో ఇక్కడి భూములు పగ్గులతో నిండి ఉంటాయి.

**"నా నేల తల్లిని / ఏ నిప్పుల బైరాగి శపించాడో!**
**మంట ఉలితో మట్టి దేహాన్ని / నెర్రెలు నెర్రెలుగా చెక్కుకొని**
**పైరు బిడ్డను నిమరలేని / మొండి చెయ్యిగా మిగిలిపోయింది"**

ఒకప్పుడు రాయలసీమ రతనాల సీమగా ప్రసిద్ధి. ఇప్పుడు రాయలసీమ రాళ్ళ సీమగా మారిపోయింది. వ్యవసాయం తప్ప మరో పని తెలియని రైతన్నలు ఎందరికో అన్నం పెట్టి ఉపాధి కల్పించిన రైతన్నలు నేడు కూలీలుగా మారిపోయారు. వర్షాలు లేక బావులు నిండిపోయి వ్యవసాయం చేయలేక, బ్రతుకు సాగించలేక, ఆత్మాభిమానం చంపుకోలేక రైతుల జీవితాలు దుర్భరంగా తయారైనాయి. వ్యవసాయంపై ఆశ చావని కొందరి రైతులు అప్పో చప్పో చేసి బోరులు వేసి వాటిల్లో నీరు పడక, అప్పులకు వడ్డీ కట్టలేక మరియు అప్పులు తీర్చలేక అవమాన భారంతో బక్కచిక్కిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పురుగుల మందు రైతులకు పెరుగన్నమైనది. రచయిత స్వయంగా రైతుబిడ్డ. ఇవన్నీ స్వయంగా చూసిన రచయిత బరువెక్కిన హృదయంతో ఈ 'కన్నీటిసీమ' కవితలో రైతుల కష్టాలను లోకానికి తెలియజెప్పాడు. సమాజంలో 'రైతు' అందరికీ సానుభూతి తెలపడానికి ఒక సాధనంగా మిగిలిపోయాడే తప్ప అతని బాధను తీర్చేవారెవరూ ఈ లోకంలో లేరేమోననిపిస్తుంది.

**"మా కళ్ళలో వుబికే అన్ని నీళ్ళు / మా వూరి బావుల్లో ఊరితే ఆశలొదిలేసిన ఎముకల గూళ్ళలో/ మృత్యువు సాలెగూళ్ళు కట్టేది కాదు"**

ఒకవేళ ప్రకృతి కరుణించి పంటలు పండినా సరైన గిట్టుబాటు ధరలు లభించక దళారులు రైతులను దోచుకోవడాన్ని **'కరువుపాము'** కవితలో తీవ్రంగా నిరసించాడు. అన్ని కష్టాలను ఎదురొడ్డి ఎప్పుడో ఒకసారి ఏ కాస్త పంటో పండిస్తే వాటిని అమ్ముకొనే అవకాశం కూడా లేదు రైతన్నకి. ఈ దేశంలో పంట పండించే రైతుకి తన పంటకు ధర నిర్ణయించే అధికారం లేదు. అదే కార్పొరేట్ కంపెనీ వాడు మాత్రం తాను తయారు చేసే వస్తువులకు ధర నిర్ణయిస్తాడు. రైతు పంటలకు ధరలు నిర్ణయించేది దళారులే. దళారులందరూ ఒక గ్రూపుగా తయారై పంటలకు తక్కువ ధరలు నిర్ణయించి రైతుల జీవితాలను చిదిమేస్తున్నారు. పంటకు తగిన గిట్టుబాటు ధరలు లేక, తాను పంట కోసం పెడుతున్న ఖర్చుకూడా రాక రైతుల జీవితాలు అన్యాయమైపోతున్నాయి. ఆవేదన చెందిన రైతన్నలు ఆత్మహత్యల పాలవుతున్నారు. ప్రజలు కూడా కార్పొరేటు కంపెనీల తయారు చేసే వస్తువులను ఏ మాత్రం బేరం ఆడకుండా కొంటారు కానీ రైతుల దగ్గర మాత్రం బేరాలాడుతూ ఇంతకిస్తావా, అంతకిస్తావా అని అడుగుతుంటారు. ఇది సరికాదు. ఈ పరిస్థితి మారాలి. పంట పండించిన రైతు తన పంటకు తానే ధర నిర్ణయించుకొనే అవకాశం ఉండాలి. అప్పుడే రైతు కాస్త నిలదొక్కుకోగలడు. అంతేకాదు రైతు స్వయంగా దళారుల ప్రమేయం లేకుండా పంటను అమ్ముకొనే అవకాశం రావాలి. ఇలా పంటలు పండించిన రైతుల కష్టాలు, పంటలు పండక అన్యాయమైపోతున్న రైతుల కష్టాలు గురించి ఆవేదనభరిత హృదయంతో రచయిత 'కరువు పాము' కవితలో తెలియజేశాడు.

**"పంట పండితే దళారి గద్దలు / పండకుంటే శవాలపై గద్దలు వాలడానికి సిద్ధంగా /రైతుల ఇళ్ళపైనే గిరికీలు కొడుతుంటాయి".**

సృష్టిలో ప్రతి మనిషికీ అమ్మంటే ఇష్టం. ఆ అమ్మే లేకుంటే ఈ భూమిపై మనిషే ఉండడు. అటువంటి అమ్మ గొప్పదనాన్ని వేనోళ్ళ కీర్తిస్తూ డాక్టర్ ఈశ్వరరెడ్డి రాసిన **'అమ్మ'** కవి అపురూపం. తాను ముళ్ళబాటలో నడుస్తూ బిడ్డ కాళ్ళకింద గుండెను పూల తివాచీ చేస్తుందని చెప్పిన మాటలతో హృదయం ఉన్న ప్రతి ఒక్కరి గుండె బరువెక్కుతుంది. అమ్మ గొప్పదనాన్ని వర్ణించడానికి ఇంతకంటే గొప్పమాటలు లేవంటే అతిశయోక్తి కాదేమో!

**"నాకంటిలో నలుసుపడితే**
**అమ్మ గుండెలో / గునపం దిగినంత బాధపడుతుంది".**
**"అమ్మ ముళ్ళబాటలో నడుస్తున్నా**
**నా కాళ్ళ కింద అమ్మ గుండెను**
**పూల తివాసీ చేసి పరుస్తుంది".**

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 (25) హైదరాబాద్ ఏప్రిల్ : 2024

ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే కష్టాలను గురించి వివరిస్తూ రాసిన కవిత **'మార్చురీ మైదానం'**. భూకంపాలు, తుఫానులకు జనజీవనం స్తంభించిపోతుంది. కోట్లాది ప్రజలు అనాథలై నిరాశ్రయు లవుతున్నారు. ఆ సమయంలో జరిగే ప్రాణనష్టాన్ని వివరిస్తూ భూమి మార్చురీ మైదానమై విలపిస్తోందని రాసిన ఆవేదనాభరితమైన కవిత ఇది. మానవుడు చేసిన ప్రకృతి విధ్వంసం కారణంగానే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. సాంకేతికత సహాయంతో ప్రకృతిని జయించాలనుకోవడం మానవుని భ్రమ. మానవుడు ప్రకృతిపై ఆరాధన భావంతో జీవించాలి. కానీ మానవుడు ఆ విషయం మరచి ప్రకృతి విధ్వంసక చర్యలు చేపడుతున్న కారణంగా భూకంపాలు, తుఫానులు, సునామీలు వచ్చి జనజీవనం అల్లాడిపోతున్నది. లక్షలాదిగా మనుషులు, అనేక జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి. సాధారణంగా సముద్ర తీరమంటే అందరికీ ఇష్టం. మరీ ముఖ్యంగా కొందరు కవులు, రచయితలు సముద్ర తీరాన కూర్చొని రచనలు చేయడానికి ఇష్టపడుతారు. సినిమా రచయితలు కూడా కొందరు సినిమాలకు కథలు రాసుకోవడానికి సముద్ర తీరానే ఎంచుకొంటారు. అయితే 1995లో కోస్తాలో వచ్చిన భయంకర తుఫానుకు నదీ తీరాలు, సముద్ర తీరాలంతా శవాలతో నిండిపోయాయి. ఈ హృదయ విదారక దృశ్యాన్ని చూసి తల్లడిల్లిన రచయిత **'మార్చురీ మైదానం'** పేరుతో రాసిన కవిత ఇది. ఇదే విధంగా 2004లో వచ్చిన సునామీ కారణంగా సముద్ర తీరాలన్నీ శవాలతో నిండిపోయి 'మార్చురీ'ని తలపించాయి. ఇప్పటికైనా మానవునిలో మార్పు రావాల్సి ఉంది. మానవుడు ప్రకృతితో కలిసి జీవించడాన్ని అలవాటు చేసుకోవాలి గానీ ప్రకృతిని జయించాలనే ఉద్దేశాన్ని వదులుకోవాలి. ప్రకృతిని జయించాలని భావిస్తే నాశనం అయిపోయేది మానవుడే. ఆ విషయాన్ని గుర్తుంచుకొని మసలుకొంటే అందరికీ మంచిది.

**"భూమి కడుపున కలుక్కుమంటే / భూకంపమై వణికిపోతుంది**
**సముద్రానికి రెక్కలు మొలిస్తే / తుఫానై విరుచుకుపడుతుంది.**
**కవులను రవులను / తన కనుసన్నలతో**
**కట్టి పడేసిన మనోహరతీరం**
**పచ్చి శవాలనుకుంటూ / మార్చురీ మైదానమై విలపిస్తోంది".**

దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న వీరసైనికుల త్యాగాలు అజరామరం. జిహాదీ పేరిట పేట్రేగిపోతున్న ఉగ్రవాదుల దుశ్చర్యలను అడ్డుకుని దేశాన్ని కాపాడుతున్న భారతసైనికులకు ఈ దేశ ప్రజానీకం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. తల్లిదండ్రులు, భార్యా పిల్లలు, బంధువులందరినీ వదిలిపెట్టి దేశరక్షణే ఏకైక ధ్యేయంగా దేశ సరిహద్దులలో అనేక ప్రతిబంధకాలకు ఎదురొడ్డి పోరాడుతున్న వీరులు మన సైనికులు. కొన్ని సందర్భాలలో ప్రాణాలను పోతాయని తెలిసి కూడా ముందుకు సాగడంలో దేశం కోసం వారి చేసే త్యాగం కనిపిస్తుంది. వారి దేశభక్తికి అవధులు లేవు. సరిహద్దు దేశమైన పాకిస్థాన్ దుశ్చర్యలను ఎదుర్కొంటూ, ఉగ్రవాదులను మత్తుపెడుతూ కొన్ని సందర్భాలలో మన సైనికులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. 1999లో పాకిస్థాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధ సందర్భంలో నిర్వహించిన **'ఆపరేషన్ విజయ్'**లో భాగంగా మంచు చర్యలు మీద పడుతున్న లెక్కచేయక మన సైనికులు శత్రువు దేశంపై విజయాన్ని సాధించారు. ఆ విషయాలను వివరిస్తూ రాసిన కవిత ఈ 'ఆపరేషన్ విజయ్'మ్. ఈ కవితలో 'కాళ్లను ఉక్కు గోడాలుగా', 'నెత్తుటి సెగను భోగి మంటగా', 'కార్గిల్ కొండలు తలలు వంచి సలాం చేస్తాయి' వంటి పదాలు రచయిత ఉపయోగించిన తీరు అద్భుతం. ఆపరేషన్ విజయ్ లో నెత్తురోడ్చిన అటువంటి సైనికుల కష్టాలను, త్యాగాలను కీర్తిస్తూ రాసిన కవిత 'ఆపరేషన్ విజయ్'మ్. భారత ప్రజానీకం నీ వెంటే ఉందంటూ సైనికుల్లో స్ఫూర్తి నింపే ఈ కవిత రచయిత దేశభక్తిని, సైనికుల త్యాగాలపై గల గౌరవాన్ని తెలుపుతోంది.

**"ఓ వీరపుత్రుడా!**
**ఉగ్రవాదం మళ్ళీ నోరు తెరిస్తే**
**ఒక్కసారి మీసం మెలేసి గాండ్రించు**
**నీ వొంటి మీద నిక్కబొడుచుకున్న వెంట్రుకలు**
**వారిపాలిట శతఘ్నులౌతాయి.**
**భరత రక్షకా / విజృంభించు**
**వందకోట్ల గొంతుల్లో / నీ విజయగీతిక మ్రోగుతోంది".**

తల్లిదండ్రుల తర్వాత, భగవంతుని కంటే ముందుగా పూజించాల్సిన వ్యక్తిగా 'గురువు'ను నిర్ణయించారు మన పెద్దలు. సమాజంలో గురువు పాత్ర ఉదాత్తమైనది, బాధ్యతాయుతమైనది కూడా! గురువు లేకుంటే సమాజం ఏమైఉండేదో తలచుకుంటే మాటలు రావు. నేటి సమాజంలో అంతో ఇంతో సక్రమ మార్గంలో నడుస్తోందంటే అందులో ప్రధానపాత్ర గురువులదే. 'అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి విజ్ఞానం అనే వెలుగును నింపువారు గురువులు'. విద్యార్థి దశలో పిల్లలు తల్లిదండ్రుల కంటే గురువులు చెంతనే ఎక్కువగా గడుపుతారు. విద్యార్థులు గురుల్ని ఆదర్శంగా భావించారు. కనుక గురువు ఎంతో నియమబద్ధంగా జీవించి నలుగురికి మార్గదర్శకంగా నిలవాలి. అందుకే అంటారు గురువుని 'ఆచరించి చూపువారు ఆచార్యుడని' **'కృష్ణం వందే జద్గురుం'.** అంటే శ్రీకృష్ణుడు ఈ జగత్తుకు అంతా గురువు అని అర్థం. అటువంటి శ్రీకృష్ణుడే తన అన్న బలరామునితో కలిసి 'సాందీపని' అనే గురువు దగ్గర విద్య నేర్చుకున్నారంటే గురువు యొక్క ప్రాధాన్యత తెలిసిపోతుంది. ఎందరో విద్యార్థుల ఆశయాల సాధనలో తోడ్పాటును అందించే గొప్ప సాధనం గురువు. అటువంటి గురువు గొప్పదనాన్ని కీర్తిస్తూ రాసిన కవిత 'అక్షర బ్రహ్మ' ఏ పదాన్నీ విడిచిపెట్టలేనంతగా గొప్పగా రాసిన కవిత ఇది.

**"గురువంటే / అజ్ఞానుల్ని అమరజ్యోతులుగా తీర్చి**
**ఆశల్ని ప్రగతిబాసలుగా నిలబెట్టగల / విచిత్ర మంత్రదండం**
**గురువంటే / శిష్యులప్రజ్ఞపై**
**విజయాల వర్షం కురిపించి /కళ్ళకొసల్లో వేలాడే ఆనంద బాష్పాల్ని**
**వరాల మూటలుగా స్వీకరించగల ఉదాత్తుడు"**

సమాజంలో స్నేహానికి గొప్ప ప్రాధాన్యత ఉంది. స్నేహితులు లేని మనిషంటూ ఈ లోకంలో ఉండరంటే అతిశయోక్తి కాదు. స్నేహం కోసం ప్రాణాల్ని సైతం త్యాగం చేసే మిత్రులను మనం పురాణ కాలం నుంచే చూస్తున్నాం. ఇప్పటికి అటువంటి ప్రాణ స్నేహితులు ఉన్నారు. అయితే చాలా తక్కువ సంఖ్యలో మాత్రం అటువంటి వారు అరుదుగా కనిపిస్తారు. మానవ సంబంధాలన్నీ **'మనీ'** సంబంధాలుగా మారుతున్న నేటి కాలంలో స్నేహానికి ప్రాధాన్యత తగ్గిపోతున్నది. నేటి కాలపు స్నేహాల్లో చాలా వరకు అవసరార్థపు స్నేహాలుగా ఉంటున్నాయి. కాలక్రమేణ స్నేహాల్లో మోసం పెరిగిపోతున్నది. నమ్మించి మోసం చేయడం నేటి కాలపు స్నేహం యొక్క ప్రాధాన్యత. ఇటీవలి కాలంలో స్నేహం వలన మోసంపోయిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. స్నేహం పేరుతో ద్రోహం చేసే మిత్ర ద్రోహుల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. తప్పులు చేసిన వారిని క్షమించవచ్చు కానీ మోసం చేసేవారిని ఎట్టి పరిస్థితి లోనూ క్షమించరాదు. మిత్ర ద్రోహాన్ని గురించి తెలియజేస్తూ రాసిన కవిత **'కల్తీ నెత్తురు'.** ఇందులో రచయిత మిత్ర ద్రోహం చేసే వారిని విశ్వాసంలేని **'వీధి కుక్కలతో'** పోల్చాడు. మిత్ర ద్రోహం నేరమని, మిత్రద్రోహానికి పాల్పడే వారెవరూ క్షమించమని అడగొద్దని సూటిగా స్పష్టం చేస్తాడు రచయిత. నీలాంటి మిత్రద్రోహిని క్షమిస్తే మానవత్వం నన్ను బహిష్కరిస్తుందంటాడు.

**"ఇంకా నటించకు మిత్రమా / నీ దొంగ జపం వెండి**
**జీవితం చేప నీ నోట్లో పడిందిగా**
**అసత్యాలన్నీ విత్తనాలు చల్లడంలో**
**నీకు నువ్వే సాటి / నీ కల్తీ నెత్తుటి చౌడుగుండెలో**
**మంచి పెరగడం అసంభవం**
**ఇంకెప్పుడూ క్షమించమని అడగద్దు**
**నిన్న క్షమిస్తే / మానవత నన్ను బహిష్కరిస్తుంది".**

భారతదేశంలో క్రికెట్ క్రీడకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. ఇక్కడి ప్రజలు క్రికెట్‌ను, ఆటగాళ్ళను విపరీతంగా ఆరాధిస్తారు. దేశంలో ఎన్నో క్రీడలు ఉన్నా వీరికి క్రికెట్ అంటేనే పిచ్చి. తమదేశపు ఆటగాళ్ళు ఆటలో అద్భుతంగా రాణించి దేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తారని ఆశపడతారు. భారతదేశంలో క్రికెట్‌ను ఓ మతంలాగా ఆరాధిస్తారు. అటువంటి క్రికెట్ ఆటలో కొందరు ఆటగాళ్ళు 'మ్యాచ్ ఫిక్సింగ్' పేరిట కాసులకు కక్కుర్తిపడి అభిమానుల నమ్మకాల్ని వమ్ముచేస్తూ దేశ పరువు ప్రతిష్టలని బజారున పడేస్తున్నారు. 1999–2000లో జరిగిన 'మ్యాచ్ ఫిక్సింగ్' లో భారత్ – పాకిస్థాన్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ళు ఉన్నట్లు వార్తలు రావడంతో క్రికెట్ అభిమానులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. అప్పటి నుండి 'మ్యాచ్ ఫిక్సింగ్'కు సంబంధించి ఎన్నో వార్తలు వస్తూనే ఉన్నాయి. తమ దేశపు జట్టు గెలిస్తే నిజాయితీగా గెలిచిందా లేక 'ఫిక్సింగ్' వల్ల వచ్చిన గెలుపా? ఒకవేళ ఓడితే నిజాయితీగా పోరాడి ఓడిపోయారా లేక కావాలనే ఓడారా? అనే అనుమానాలు క్రికెట్ అభిమానుల మనసుల్ని నిత్యం వేదనకు గురిచేస్తున్నాయి. తమ జట్టు, అభిమాన ఆటగాళ్ళు సాధించిన రికార్డును వాస్తవమైనవా లేక 'ఫిక్సింగ్' ద్వారా వచ్చినవా అనే ఆలోచనలతో సాధారణ క్రికెట్ ప్రేమికులు కుమిలిపోతున్నారు. నిజానికి క్రికెటర్లకు లక్షలాది రూపాయలు ఆదాయం వస్తుంది. ఇవన్నీ ప్రేక్షకులు చెల్లించే డబ్బులే. అయినా ధనం దాహం తీరక 'పిక్సింగ్'కు పాల్పడుతున్నారు. దేశపు జట్టు గెలిస్తే జాతీయ జెండాలు చేతపట్టి కెరింతలు కొడుతూ, నృత్యం చేస్తూ తాను విజయం సాధించినంతగా క్రికెట్ అభిమానులు ఉప్పొంగిపోతారు. అదే జట్టు ఓటమి పాలైతే తీవ్ర దు:ఖంలో మునిగి పోతారు. అటువంటి అమాయకపు క్రీడాభిమానులను 'ఫిక్సింగ్' పేరిట మోసం చేయడం అత్యంత దారుణమైన విషయం, క్షమించరాని నేరం. ఇక్కడ క్రికెట్ అభిమానులను మోసం చేయడమే కాదు యావత్తు దేశాన్ని మోసం చేయడమే కాక దేశ పరువు ప్రతిష్టల్ని తాకట్టు పెట్టడం క్షమించరాని నేరం. రచయిత కూడా క్రికెట్ అభిమానే. ఈ 'ఫిక్సింగ్' సంఘటల్ని చూసిన రచయిత క్రికెట్‌ను పిచ్చిగా ఆరాధించి మోసపోవద్దంటూ అభిమానులకు చూసిస్తూ రాసిన కవిత ఈ 'డోంట్ ఈట్ క్రికెట్'.

**"దేశ గౌరవాన్ని చొక్కాగా తొడిగి పంపిస్తే**
**ఆటగాళ్ళు పందేల బురదగుంటల్లో దొర్లొస్తారు**
**జాతి జాతంతా మరకల పాలౌతుంది".**

ఇలా విభిన్నాంశాలకు చెందిన విషయాలలో సామాన్యుల గుండె చప్పుళ్ళను కవితల రూపంలో మనముందుకు తెచ్చిన అక్షరశిల్పి డాక్టర్ ఈశ్వరరెడ్డి. వీరు మరింత సాహితీసృజన చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.

**ఆధారగ్రంథాలు**

1. కన్నీటిసీమ (కవితా సంపుటి) – డాక్టర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి



# తొలినాళ్ళ తెలుగు సాహిత్యం – స్త్రీ చైతన్యం

**డా. ఎన్. రజని,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
ఫోన్ : 9010501030

ముఖ్యంగా స్త్రీ చైతన్యం అనే అంశాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. ఒక నిర్దిష్ట కాలంలో వచ్చిన స్త్రీ చైతన్యం అన్నప్పుడు ఆ కాలంలో జీవించిన రచయితల రచనల్లోని స్త్రీ పాత్రల చైతన్యమా, ఆ నిర్దిష్ట కాలంలో పుట్టిన రచయితల చైతన్యమా, ఆ నిర్దిష్ట కాలంలో పుట్టి, రచనలు చేసిన స్త్రీల చైతన్యమా అనే అంశాన్ని పరిగణనలోనికి తీసుకొని ఒక చర్చను ప్రారంభించవచ్చు. అయితే ఈ చైతన్యపు పరిధిని గురించి మనం ఆలోచించి నప్పుడు ఆ చైతన్యపు పరిధి, ఆ చైతన్యపు స్థాయి కొన్ని అంశాలను మన ముందుకు తెస్తుంది.

ఈ అంశాన్ని గురించి ఆలోచించినప్పుడు ముందుగా సంఘసంస్కరణ కాలం, ఆ కాలం కన్నా ముందుగా సమాజంలో, సాంఘిక జీవితాల్లో వచ్చిన మార్పులు, ఆ మార్పులతో పాటుగా సాహిత్యంలో ప్రతిఫలించిన చైతన్యం గురించి మనం పరిశీలించాలి.

ఆ తర్వాత ఆ కాలంలో పుట్టిన రచయితలు, రచయిత్రులను గురించి తెలుసుకోవాలి. ఆ సమయంలో వచ్చిన రచయితలను పరిశీలించాలి. ఆ రచనల్లోని స్త్రీల చైతన్యాన్ని అంచనా కట్టాలి. ఈ అంచనా కట్టే క్రమంలో ఆ కాలంలో జరిగిన సామాజిక సాహిత్య ఉద్యమాలు, ఆ కాలంలో పుట్టిన రచయితలు, ఆ కాలంలో పుట్టి రచనలు చేసిన వారు, వారి రచనల్లోని సామాజికాంశాలు, సాహిత్యాంశాలు వారివారి రచనల్లోని స్త్రీ పాత్రల చైతన్యము మొదలైన అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకోవాలి.

మనం తొలితరం రచనల గురించి పరిశీలించేటప్పుడు ముఖ్యంగా సంఘసంస్కరణ ప్రభావంతో కూడిన రచనలు ఎక్కువగా కనిపిస్తాయి. సంఘసంస్కరణ ప్రభావం కందుకూరి, గురజాడ వంటి రచయితలను ఎంతగా ప్రభావితం చేసిందో కూడా అర్థమవుతుంది. ఆయా కాలపు రచయితల్లో అభ్యుదయ దృక్పథం కూడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

మెకాలే విద్యావిధానం కూడా ఈ అభ్యుదయ దృక్పథానికి సమాజాన్ని కొత్త దృష్టితో చూడడానికి అవకాశం ఇచ్చిందన్న వాస్తవాన్ని కూడా మనం గుర్తించక తప్పదు.

నిజానికి ఆ కాలంలోనే తొలితరంలోనే మొసలికంటి రమాబాయమ్మ, వెంపటి శాంతాబాయమ్మ **"హిందూసుందరి"** పత్రికకు సంపాదకత్వం కూడా వహించారని తెలుస్తుంది. **"పాతకొత్తల మేలు కలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా"** అని పేర్కొన్నట్టు కొత్త సమాజం రూపు సంతరించుకొంటున్న తరుణంలో సాహిత్యం అభ్యుదయశీలంగా ఉండడం అనివార్యం.

1848–1919 మధ్యకాలంలో జీవించిన కందుకూరి వీరేశలింగం గురించి పాఠక లోకానికి ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేదు. బెంగాల్ రాజారామమోహన్ రాయ్ ప్రభావం ఆంధ్రదేశానికి ప్రసరించి, కందుకూరి వీరేశలింగం వంటి రచయితలు సంఘ సంస్కరణలో భాగంగా విధవా పునర్వివాహాలు చేయడం మూఢనమ్మకాలపై నిరసన తెలపడం వంటి చర్యలతో పాటుగా సాహిత్యాన్ని సృష్టించారు.

వీరేశలింగం సాహిత్యం సంఘ సంస్కరణోద్యమం ప్రచారానికీ, ఆందోళనకూ సాధనంగా ఉపయోగపడగా గురజాడ దానికి అపూర్వమైన కావ్యశిల్పాన్ని అమర్చారు. కందుకూరి వీరేశలింగం 1883 లో స్త్రీల కొరకు **"సతీహిత బోధిని"** అను మాసపత్రికను ఆరంభించారు. కందుకూరి వీరేశలింగం స్త్రీ నీతిదీపికలో

**విద్యవలనను జ్ఞానంబు వెలయుగొన**
**నవని నిది మంచి నిది చెడ్డ యనుచు**
**తెలియ బాలురును బోలె దప్పక**
**బాలికలును నేర్వంగా వలయును**
**హృద్యంబుగను....** అని స్త్రీ విద్య గురించి చెప్పారు

'రాజశేఖర చరిత్ర' వంటి నవలలే కాదు ఎన్నో పత్రికలలో సమాజ సంస్కరణ దిశగా వ్యాసాలను రచించారు. అప్పుడు సమాజ సంస్కరణలో ముఖ్యంగా భాగమైనది స్త్రీ జనోద్ధరణే.

1862–1915 మధ్యకాలంలో జీవించిన గురజాడ అప్పారావు గారు సాహిత్యం ద్వారా పెను మార్పు తీసుకురావడానికి ప్రయత్నించిన గొప్ప సాహితీ సంస్కర్తగా గురజాడను మనం చెప్పుకోక తప్పదు.

"infant marriage in india and enforced widowhood". అనే చిన్న పుస్తకం పార్సీవాళ్ళు ప్రచురించి భారతదేశం నలుమూలలకూ పంపారట. బహుశా దీని ప్రభావం వల్లనే 1887 లో మూడేళ్ళలో జరిగిన బ్రాహ్మణ కన్యాశుల్క పట్టీని తయారు చేయమన్నారు. ఆనందగజపతి రాజావారు బహుశా ఈ మాటలన్నిటి వల్లనే గురజాడ కన్యాశుల్క రచనకు ప్రేరణ కావచ్చు.

కన్యాశుల్కం నాటకం ఇతివృత్తం, బాల్య వివాహాలను నిషేధించే దిశగా, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించే దిశగా సాగుతుంది. ఆ ముఖ్యాంశాలే కాకుండా సంఘంలో ఉన్న అనేక అవలక్షణాలను, స్త్రీ పురుషుల సంబంధాలను, సంఘంలోని దురాచారాలను, మానవ ప్రవృత్తిని అన్నిటినీ తన సాహిత్యంలో ప్రతిఫలిస్తారు గురజాడ.

గురజాడ కథల్లో స్త్రీ పాత్రలన్నీ చైతన్యంతో ముందుకొచ్చిన పాత్రలే. ముఖ్యంగా దిద్దుబాటు కమలిని, నాంచారమ్మ, సరళ, మెటిల్డా – పాత్ర పరంగా చైతన్యం లేదంటే కథ పరంగా చైతన్యం లేదంటే పురుష పాత్రలతో సమాజ చైతన్యాన్ని అందించడం ఈ రకంగా ఐదు కథల్లో స్త్రీ చైతన్యాన్ని ప్రస్తావించారు గురజాడ.

కవిత్వంలో ముఖ్యంగా ముత్యాలసరాలు, పూర్ణమ్మ, కన్యక వంటి అన్నింటిలోనూ స్త్రీ పాత్ర చైతన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇక 'కన్యాశుల్కం' నాటక విషయానికి వస్తే స్త్రీ చైతన్యం ముఖ్యంగా మధురవాణి పాత్రను మలిచిన తీరు స్పష్టమవుతుంది. మొత్తంగా గురజాడ అందించిన సాహిత్య సంపదంతా ఏదో ఒక రకంగా స్త్రీ చైతన్యానికి, స్త్రీ పురోగమనానికి బాటలు వేసేవిగానే సాగాయని చెప్పవచ్చు. రచయితలు పురుషులైనా వారి చుట్టూ సమాజాన్ని దర్శించడం, సమాజంలోని స్త్రీ పురుష అసమానతలను గ్రహించడం, ఆ అసమానతలపై స్పందించడం, చైతన్యవంతం చేయడం, ముఖ్యంగా ఆ కాలంలో అట్లాంటి రచనలు చేయడం గురజాడ ముందుచూపుగా మనం భావించొచ్చు.

ముఖ్యంగా 150 ఏండ్ల తర్వాత కూడా "పతియే ప్రత్యక్షదైవం" అనే సమాజంలో ఇంకా బ్రతుకుతున్నాం. కానీ ఆ కాలంలోనే స్త్రీ పురుషుల సంబంధం ఎంత గొప్పదో ముఖ్యంగా ఇద్దరూ కలిసి నడపవలసిన కుటుంబం గురించి, ప్రపంచం గురించి వారు చెప్పిన **"మగడు వేల్పన పాత మాటది ప్రాణమిత్రుడ నీకు నేను"** అన్న వాక్యం లేదా పాదం గొప్ప స్త్రీ చైతన్యానికి ప్రతీక.

స్త్రీలకు ఇంకా చదువే నిషేధమైన ఆ కాలంలో, స్త్రీలు చదువుకుని ముందుకు రావాలనే సంస్కరణ మెల్లమెల్లగా ప్రారంభమవుతున్న ఆ కాలంలో కుటుంబంలో స్త్రీ పురుషుల సమాన ప్రాతినిధ్యాన్ని గుర్తించిన మొట్టమొదటి రచయితగా గురజాడను గుర్తించాలి.

**తాపీ ధర్మారావుగారు :** ఫ్యూడలిజం అవశేషమవుతున్న దశలో పూర్వరంగంలో తాపీ ధర్మారావు ప్రవేశించారు. 1887-1911 మధ్యకాలంలో జీవించిన తాపీ ధర్మారావు తాను స్కూలు చదువులో ఉన్నప్పుడే వీరేశలింగంని చదివారు. ఆయన తన ఇంట్లోంచే సంస్కరణలు ప్రారంభించారని చెప్పొచ్చు. భార్యను పేరుపెట్టి పిలవడం, ఆమెను తన తోడుగా వెంటబెట్టుకుని సభలు, సమావేశాలకు వెళ్ళడం ఇవన్నీ అప్పటికే తనలో ఉన్న అభ్యుదయ భావాలను కార్యాచరణలో పెట్టారు.

విజయనగరంలో తాను స్కూలుకు వెళ్ళేదారిలో ఒక 15 ఏండ్ల బాల వితంతువు కనిపించిందట అప్పుడు తాపీ ధర్మారావులో కలిగిన ఆలోచనే ఒక డిబేటింగ్ సంస్థ ఏర్పడడానికి నాంది. ఆ డిబేటింగ్ సంస్థ తన ప్రధాన ఆశయాలుగా రాసుకున్నవి కూడా బాల్యవివాహాల నిషేధం, స్త్రీ విద్య ప్రాధాన్యత, విధవా పునర్వివాహము, వరకట్న వ్యతిరేకత మొదలైన అంశాలు.

ధర్మారావు తాను 15 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు 10 ఏండ్ల అన్నపూర్ణతో వివాహమైంది. అప్పట్లోనే అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోవాలనుకోవడం, కట్నకానుకలు వద్దనుకోవడం ఇవన్నీ స్త్రీ చైతన్యాలుగా, మహిళా వికాస మార్గాలుగా చెప్పొచ్చు. **"సత్యవతికి సవాల్"** అంటూ సత్యవతి పేరుతో ధర్మారావు గారే ప్రశ్నించేవారు. ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా ఆలోచించేవారు.

పోతం జానకమ్మ రాఘవయ్య 1874లోనే తన లండన్ ప్రయాణపు అనుభవాలను రాసింది. ఒక స్త్రీ విదేశీయాత్ర చేయడమే ఆ కాలంలో ఒక సంచలనం. అయితే అమె అక్కడ పర్యటించిన విశేషాలను, ఇక్కడి స్త్రీల స్థితిగతులను, స్టీమరు ప్రయాణాన్ని కళ్ళకు కట్టినట్టు వర్ణించింది. ఈమెను తొలి ఆధునిక మహిళా రచయిత్రిగా పేర్కొంటారు. ఈమె మద్రాసు నివాసి. కొక్కొండ వేంకటరత్నం పంతులు నడిపే **"శ్రీ ఆంధ్రభాషా సంజీవని"** లో ఈమె యాత్రా కథనాన్ని 1874 ఫిబ్రవరి, మార్చి సంచికలో ప్రచురించారు.

1874 ఏప్రిల్ ఎథినీయం అండ్ డైలీ న్యూస్‌లో విపులమైన సమీక్షతో ప్రచురించారు. 1875 అక్టోబరులో **" ఇంగ్లాండు యాత్ర చరిత్ర"** ప్రచురించారు. ఇదే తెలుగులో మొదటి యాత్ర చరిత్రగా పోతం జానకమ్మ ఇంగ్లాండు వెళ్ళిన తొలి భారతీయ మహిళగా గుర్తిస్తారు. ఇంగ్లాండు ప్రయాణంలో అనేకమంది ఆంగ్ల మహిళల స్నేహాన్ని కూడా సంపాదించింది. ఆ కాలంలో విదేశీ పర్యటన చేసి, ఆ అనుభవాలను కథనంగా మలిచి పుస్తకంగా ప్రచురించడం అదీ ఒక మహిళ పర్యటన యాత్రాచరిత్రగా రావడం మొట్టమొదటి యాత్రా చరిత్ర స్త్రీదే కావడం ఒక విశేషంగా చెప్పుకోవచ్చు. స్త్రీ చైతన్యానికి పడిన తొలి మెట్టుగా చెప్పవచ్చు.

**బండారు అచ్చమాంబ (1874-1905)**

మొట్టమొదటి కథా రచయిత బండారు అచ్చమాంబ అని పరిశోధన వల్ల తేలింది. మొట్టమొదటిసారిగా చరిత్ర నుండి స్త్రీలకు సంబంధించిన చారిత్రక విషయాలను, చారిత్రక సంస్థలను గురించి ప్రత్యేకంగా రాసిన ఘనత బండారు అచ్చమాంబదే. 1898 జూలై **"తెలుగు జనానా"** పత్రికలో **"ప్రేమా పరీక్షణము"** 1898 సెప్టెంబరు **"తెలుగు జనానా"** పత్రికలో **'ఎరువుల సొమ్ము బరువుల చేటు'** మొదలైన కథలు కూడా అచ్చయ్యాయి. **"అబల సచ్చరిత్ర మాల"** లో రుద్రమ్మ, అహల్యాబాయి, తరిగొండ వేంగమాంబ చరిత్రలు ఉన్నాయి. ఇది 1901లో ప్రచురితమైంది.

బండారు అచ్చమాంబ రాసిన **"దంపతుల ప్రథమ కలహం"** కథ భార్యాభర్తల మధ్య ఉండవలసిన అన్యోన్యతను, పరస్పర అవగాహనను గురించి చెప్తుంది. అంతే కాదు ఆ కథలోనే ఒకచోట లలిత పాత్ర **"నేను పెండ్లాడిన భార్యను గాని, దాసిని గాను. వివాహమగుట వలన భర్తకు దాసినగుదునా యేమి?"** అని ప్రశ్నిస్తుంది. అప్పటికే స్త్రీలో ఆ చైతన్యం రావడం ఒక అభ్యుదయ

పథానికి నాందిగా చెప్పవచ్చు. ఈ కథ 1903 జూన్ **"హిందూ సుందరి"** లో ప్రచురితమైంది. అంతకు ముందుగానే 1898 **"తెలుగు జనానా"**లో (జూలై) ప్రేమా పరీక్షణము, ఎరువుల సొమ్ము బరువుల చేటు (సెప్టెంబరు) కథలు కూడా ప్రచురితమయ్యాయి. 1902 లో 'స్త్రీ విద్య' కూడా ప్రచురితమైంది.

**వేమూరి శారదాంబ (1881-1899)**

శారదాంబ తండ్రి దాసు శ్రీరాములు గారు. వీరి ప్రోత్సాహంతో చిన్ననాడే సంస్కృతాంధ్ర విద్యలను నేర్చుకుంది.

స్త్రీల పట్ల ఉన్న వివక్షను గుర్తించి స్త్రీల పట్ల ఉన్న వివక్ష పోవాలంటే, విద్యాభ్యాసం కచ్చితంగా అవసరమని నమ్మిన స్త్రీ. అత్తింటివారి వ్యతిరేకతను ఎదుర్కొంటూనే 'మాధవా' అనే మకుటంతో 101 పద్యాలను రచించింది. శారదాంబ చాలా కొద్ది కాలమే జీవించింది. కానీ ఆ కొద్ది కాలంలోనే స్త్రీ చైతన్యంతో రచనలు చేయడం ముఖ్యమైన విషయంగా చెప్పుకోవచ్చు.

1881లో జన్మించిన ఈమె తన 18వ ఏటనే అంటే 1899లో చనిపోయింది. 16వ ఏటనే **"నాగ్నజితీ పరిణయము"** అనే కావ్యం రాసింది. స్త్రీల విద్య అవసరాన్ని నొక్కి చెప్పే కావ్యాలను రాసింది.

**మునుపటి వారలెల్ల తమ ముద్దియలం చదివించ లేదొకో**
**వినయం పతివ్రతాత్యుసువివేకములం జరియించినట్టి యా**
**జనకజం జూడరే మరియుం జంద్రమతిం గనరే యింకెందరో**
**యనుపమ బుద్ధి కీర్తిలందిరి విద్యవల్ల మాధవా**

అప్పటి సమాజంలో స్త్రీలు నాట్యశాస్త్ర మభ్యసించరాదన్న అభిమతాన్ని మార్చుటకు మహాభారతంలోని ఉత్తరను ఉదాహరిస్తుంది.

**అమరలేక నిచ్చెలు బృహన్నల యొద్దను నాట్య శాస్త్రమున్**
**విరటుని కూతు దా గరచి విన్నుత కీర్తి వహింపలేదె**
**ఉత్తర కడు యోగ్యురాలని సదా పొగడంబడ లేదె**
**చూడనా పరమ పతివ్రతామణి శుభాంగు పరీక్షితుంగాంచె మాధవా**
- అంటూ ప్రశ్నించింది.

**కొటికలపూడి సీతమ్మ (1874-1936)**

కందుకూరి ఆశయముతో ఈమె **"స్త్రీలు విద్య నేర్వ జెడిపోదురను మాట కల్లయనుచు దోప నెల్లరకును"** అంటూ స్త్రీ విద్యను ప్రోత్సహించింది. 1913 లో జరిగిన ప్రథమాంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించింది. వితంతు పునర్వివాహాల గురించి ఉపన్యసించేది. స్త్రీలకు ఉన్నత విద్య అవసరాన్ని గురించి పుస్తకం రాసింది. **"కుమార సుగుణ బోధిని"** రచించింది. అమె కూడా కొటికలపూడి సీతమ్మను అనుసరించి వారి శిష్యురాలుగా భావించుకుంది. అప్పటికే కుమారీ నీతులు, స్త్రీ శతకాలు బోధిస్తున్న, రాస్తున్న రచయితలకు విరుగుడుగా స్త్రీలకే నీతులు చెప్పే విధానాన్ని వ్యతిరేకిస్తూ తాను పురుషులకు నీతులు చెప్పే పనికి పూనుకున్నాను అని చెప్తూ -

**"నీ సతియు నీకు మిత్రము**
**నీ సతియె నీకు తోడు నిజము సుమీ**
**రోసమున సతిని దూరిన**
**మోసము నీ సౌఖ్యమునకు ముందు కుమారా"** అంటూ పురుషులు ఎట్లా మెలగాలో చెప్పాల్సిన అవసరాన్ని కూడా ఆ కాలంలోనే గుర్తించింది ఆత్మకూరి అన్నపూర్ణమ్మ. "మగడు వేల్పన పాతమాటది" అన్న గురజాడ మాటలను గుర్తు చేస్తాయి ఈ వాక్యాలు.

**పుట్టపర్తి కనకమ్మ 1922** 'దు:ఖిత సీత" అంటూ సీత గురించి రాస్తూ -

**చాకలి వాని మాటకయి**
**జనకాత్మజ శీలము పృచ్ఛసేయరా**
**నీకొక యాత్మయున్న**
**గమనింపుమురా బదులేమి వచ్చున్.....**

అంటూ రాముణ్ణే ధైర్యంగా ప్రశ్నించిన స్త్రీగా కనిపిస్తుంది. సీత మనసు నుంచి అర్థం చేసుకొమ్మని పాఠకలోకానికి చెప్తుంది.

**దేశిరాజు భారతీదేవి** "కాంతా శతకం" రాస్తూ

**చదివిన పండితులగుదురు**
**విదితము గాకున్న వెర్రులె పురుషుల్**
**చదివిన చదవక యున్నన్**
**ముదితలు విద్వాంసురాండ్రు పుట్టువు చేతన్**

అంటూ స్త్రీలు ఎప్పుడైనా చదివినా చదవకపోయినా పండితులేనని ఒకింత ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తుంది.

**కనుపర్తి వరలక్ష్మమ్మ (1896-1978) :**

**"శారదాంబ లేఖలు"** వీరి రచనల్లో చాలా ముఖ్యమైనవి. ముఖ్యంగా స్త్రీల **"లేఖా సాహిత్యం"** శారద లేఖలతోనే ప్రారంభమైంది. తాను మూడో తరగతిలో ఉండగా తన పక్కింట్లో ఉండే ముసలమ్మలకు వచ్చిన ఉత్తరాలు చదివి వినిపిస్తూ ఉండేది. వాళ్ళు చెప్పే విషయాలు క్రమపద్ధతిలోనే ఉండేవి కావట. ఆ చుట్టు పక్కల వాళ్ళ భాషను ఒక క్రమంలో రూపొందించి ఉత్తరాలుగా రాసేదట ఆ అనుభవమే "శారద లేఖలు" కు ప్రేరణగా చెప్తుంది.

**"మూడు దశాబ్దాల ఆంధ్ర జీవిత రేఖలు ఈ లేఖలందు కనపడుచున్నవి"** అని లేఖలను చదివిన తల్లావఝ్ఝుల శివశంకర స్వామి అన్నారట. ఒక్కొక్క లేఖ ఒక్కొక్క మణిపూస.

ప్రతి లేఖలో మూఢ విశ్వాసాలు, బాల వితంతువుల బాధలు, వరకట్న దురాచారం, విదేశీ వస్తు బహిష్కరణ ఇట్లా ఏదో ఒక రగులుతున్న సమస్య ముఖ్యంగా స్త్రీల పై జరుగుతున్న అణచివేత సమస్యలన్నీ స్పృశించేవారు వరలక్ష్మమ్మ.

**"పండ్లు కండ్లు లేని ముదుసలులకు**

**పొట్టపొడిచినా అక్షరం ముక్కరాని నిరక్షర కుక్షులకు**

**గవ్వ గడింపలేని అప్రయోజకులకు**

కన్యాశుల్కం తీసుకుని కన్యల్ని సమకూర్చే నిర్భాగ్యపు దేశం ఇది... అంటూ బాల్య వివాహాల గురించి, అసలు మొత్తంగా వివాహ వ్యవస్థ గురించే ప్రశ్నిస్తుంది.

"వసుమతి" అని వీరు రాసిన సాంఘిక నవల తన 14వ ఏట తాను విన్న ఒక అభాగ్యురాలి కథ.

మొదటితరం రచయిత్రుల్లో శ్రీమతి వరలక్ష్మమ్మ గారు అగ్రగణ్యులు అంటారు. బెజవాడ గోపాలరెడ్డిగారు. "స్త్రీలు అభ్యసించాలి" అన్న కొటికలపూడి సీతమ్మ ఉపన్యాసానికి ప్రేరణ పొంది విద్యాభ్యాసం చేయాలనే ధృఢ సంకల్పాన్ని పొందారని అర్థమవుతుంది.

కందుకూరి సంస్కార భావాలకు స్పందించి ఆనాటి పరిస్థితులను బట్టి కథలు, వ్యాసాలు, లేఖలు రాసారు. చోరగుడి సీతమ్మగారు త్రిపుర సుందరీ సమాజాన్ని యువతీ విద్యాలయాన్ని నిర్వహించేవారట. ఆ కాలంలో బాలికగా ఉన్న వరలక్ష్మమ్మ వీరందరి వల్ల ఎంతో నేర్చుకున్నారు.

ఆమె తన డైరీలలో రాసుకున్న కొన్ని విషయాలు చదివితే ఆశ్చర్యం కలుగుతుంది. బాల్యంలో ఆమె మీద పడ్డ ప్రభావాల వల్లే ఆమె స్త్రీ చైతన్యంతో రచనలు చేసారని అర్థమవుతుంది.

బాల్యంలో ముఖ్యంగా స్త్రీలు చెప్పులు వేసుకోకుండా నడవాలని, అవసరమైనా కళ్లజోడు ధరించొద్దని నియమాలుండేవట. అవన్నీ గమనించింది కనుకే ఆమె రచనల్లో స్త్రీల గురించిన వికాసం కనిపిస్తుంది. ఆమె "సావిత్రి" మాస పత్రికను కచ్చితంగా చదివేదట.

ఆమె అత్తగారింటికి వెళ్ళేటప్పుడు ఆమె అన్న నరసింహం ఆమెకు "శబ్దార్థ చంద్రిక"ను బహూకరించారట. అంటే ఆ కాలంలో చెల్లెలు చదువుకోవాలనే ఆసక్తిని కనబరుస్తూ పెళ్ళి అయిన చెల్లెలికి చదువును ప్రోత్సహిస్తూ పుస్తకాన్ని బహూకరించడం ఒక అపురూపమైన విషయంగా, అపురూపమైన కానుకగా కూడా చెప్పవచ్చు.

తాత్కాలికోల్లాసం కథా ఉద్దేశమైతే ప్రణయ వ్యవహారాలే ముఖ్య వస్తువులైతే, అవే తప్ప పాఠకులకు రుచించక పోతే, ఆ కథలూ, కథకులూ ఆ కథాపాఠకులూ, భ్రష్టుమార్గం పట్టినట్లే అంటుంది 'కనుపర్తి వరలక్ష్మమ్మ' ఈ మాటలు అనడంలో ఆ కాలనికే ఎంత చైతన్యం ఉందో తెలుసుకోవచ్చు.

స్త్రీలు విద్యాభ్యాసం చెయ్యడం మాట అటుంచి వీధిలో కనిపించడం, విజ్ఞాన సముపార్జన చేసి కలాన్ని చేపట్టి రచనలు కావించి నారీ లోకాన్ని చైతన్యవంతం చెయ్యడానికి ఎంతటి శక్తి సామర్థ్యాలు కావాలో తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. అట్లాంటి వ్యక్తుల్లో ఎన్నదగినవారు కనపర్తి వరలక్ష్మమ్మగారు. కందుకూరి సంస్కార భావాలకు స్పందించి ఆనాటి సమకాలీన సమాజ పరిస్థితులను బట్టి కథలు, వ్యాసాలు, లేఖలు రాసిన సాహితీ మూర్తి కనపర్తి వరలక్ష్మమ్మ.

కాళ్ళకూరి నారాయణరావు గారి "వరవిక్రయము" ముఖ్యంగా ఇప్పటికీ కొనసాగుతున్న వరకట్న దురాచారాన్ని ఆనాడే వ్యతిరేకించింది. వీరు వర్ణాంతర వివాహం చేసుకోవడమే కాక చిన్నప్పట్నుంచీ తన సోదరి కష్టాలను కూడా చూసి తండ్రితో ఘర్షణ పడ్డారు. అందులోని కాళింది పాత్ర తండ్రిని ఇట్లా ప్రశ్నిస్తుంది.

మీకు గుణము లేదా

మాకు రూపము లేదా

ఇంత దైన్యమునకు హేతువేమి

కట్నమిచ్చి వరుని గడియించు

కొనుటకంటే చిన్నతన మింకేమున్నదమ్మా....

అంటూ అసలు కట్నం ఎందుకు ఇవ్వాలి అనే మూలమైన ప్రశ్నను లేవదీస్తారు రచయిత.

కట్నము అడుగువారికి పాపభయంబు లేక ఇచ్చువారికి సిగ్గును నెగ్గులేక నడుచుచున్నట్టి వరశుల్క నాటకమున! అకట మనము పాత్రలమగుట తగునె. అంటూ ఇంకా కమల పాత్రతో మరింత ముందడుగు వేయిస్తారు రచయిత.

కట్నమే కోరి వచ్చిన ఖరముతోడ దగుదునని కాపురము సేయు దానికంటే పెండ్లియే మానుకొని మగబిడ్డ వలెనే తల్లిదండ్రుల కడనుండ తప్పిదంబె అని ప్రశ్నిస్తుంది. ఇట్లాంటి చైతన్యం ఆ కాలపు రచనల్లో ఉండేది.

**బంకుపల్లి మల్లయ్యశాస్త్రి: (1876-1946)** శ్రీకాకుళం జిల్లా పర్లాకిమిడి ప్రాంతానికి చెందినవారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. తన ఇంట్లో తన కూతురు బాల్యంలోనే భర్తను కోల్పోవడం అన్న విషాదం వివాహ వ్యవస్థలో స్త్రీల స్థితిగతులను గురించి విస్తృత స్థాయిలో అర్థం చేసుకునేట్టు చేసింది. అందుకే తన కూతురు కృష్ణవేణిని ఖమ్మంకు చెందిన వేదులవారితో శాఖాంతర వివాహం జరిపించి కొంత అభ్యుదయ మార్గానికి నాంది పలికారు. "వివాహతత్వం" అనే గ్రంథాన్ని శాస్త్రయుక్తంగా రాసి, అన్ని పీఠాధి పతులను ఒప్పించి శాఖాంతర వివాహాన్ని జరిపించారు. అందుకే బంకుపల్లి మల్లయ్యశాస్త్రిని వీరేశలింగం ఆఫ్ ఉత్తరాంధ్ర అని కూడా అంటారు. పర్లాకిమిడిలో "రీడింగ్ రూం" అనే ఒక చిన్న సమాజాన్ని ఏర్పాటు చేసి వితంతు వివాహాల్లాంటి సంస్కరణలకు చైతన్యపు దారిని చూపించారు. కులమతాల కతీతంగా అన్ని కులాల వారితో సహపంక్తి భోజనంలో పాల్గొని సంస్కరణలకు నాంది పలికారు.

**శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891-1961)**

ఏ రచయితైనా కథకులైనా తన కళ్ళముందరి జీవితాన్ని, సమాజపు తీరుతెన్నులను చక్కగా ప్రతిబింబించగలుగుతారు. ఆ తోవలోనే స్త్రీ విద్యకు ప్రోత్సాహం, కులాంతర మతాంతర వివాహాల ప్రస్తావన, వితంతు పునర్వివాహాల వంటి అంశాలను కులంకషంగా తన కథల్లో ప్రస్తావించారు. ముఖ్యంగా వీరి రచనల్లో అగ్రహారపు బ్రాహ్మణ స్త్రీల వెతలు కనిపిస్తాయి.

స్త్రీలకు చదువు, వ్యాయామం ఎంత అవసరమో, ఆ అవసరాన్ని కథలలో ప్రస్తావిస్తారు కూడా. ముఖ్యంగా వీరి కథల్లో వితంతువులు, ఆదర్శ భావాల స్త్రీలు, గృహిణులు, పెళ్ళికాని యువతులు, కొడుకులపై ఆధారపడే తల్లులు, సవతి తల్లులు అందరి జీవితాలు చాలా స్పష్టంగా వివరిస్తారు ఈ కథల్లో **"అరికాళ్ల కింది మంటలు"** అన్న కథలో రుక్మిణి అక్కలందరికీ చాకిరీ చేసిచేసి విసుగొచ్చి తల్లి కూడా తనను అర్థం చేసుకోకపోవడంతో **"దొడ్లో గేదెతో సమానం నేను"** అని బాధ పడుతుంది. స్త్రీ ఆవేదనను స్త్రీ మనసు నుంచి ఆలోచించి రచించారు.

"స్త్రీ జీవితాలలోని ఆరాట పోరాటాల చరిత్ర కూడా ఈ నాటిది కాదని సాంప్రదాయ సాహిత్య అధ్యయనం వల్ల నాకు బాగా తెలిసి వచ్చింది" అంటారు -కాత్యాయని గారు.

ఈ రకంగా మొదటితరం రచన చేసిన కొద్ది మంది రచయితల్లోని, రచయిత్రుల్లోని స్త్రీ చైతన్య స్ఫూర్తిని ముఖ్యంగా ఆ తొలితరంలో సమాజంలో మార్పుకు దోహద పడిన, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడిన ముఖ్యంగా స్త్రీవిద్యా వ్యాప్తి, బాల్య వివాహాల నిర్మూలన వితంతు పునర్వివాహాలు వంటి సంస్కరణాలను తమ రచనల్లో అందించిన రచయితలను, రచయిత్రులను గురించి వారి సాహిత్యాన్ని గురించి పరిశోధన చాలా అవసరం. ఆ పరిశోధన ఎంత జరిగినా, ఇంకా మిగిలిపోయిన ఖాళీలు ఉండనే ఉన్నాయి. అందువల్లనే ఆ దిశగా ఈ వ్యాసం తోడ్పడుతుందని ఆశిస్తున్నాను.

మహిళా చైతన్యం అనే మాటను విస్తృతార్థంలో అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను. సమకాలీన సమాజంలో పుట్టిన స్త్రీల చైతన్యం, ఆ కాలంలో జీవించిన రచయితల రచనల్లో చైతన్యం వారి రచనలు కలిగించిన చైతన్యం మొత్తంగా తొలినాళ్ళలోని తెలుగు సాహిత్యంలోని స్త్రీ చైతన్యాన్ని అంచనా కట్టవలసిన అవసరాన్ని గుర్తిస్తూ, స్త్రీ చైతన్య పరిధిని అన్ని కోణాల్లోంచి గమనించాలని, గ్రహించాలని కోరుకుంటున్నాను.

ఇంకా నమోదుకాని మొదటితరం స్త్రీల చరిత్రల గురించి కాత్యాయని విద్మహే వంటి సాహిత్యకారులు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఇట్లాంటి పరిశోధనకు కొంత సమాచారాన్ని అందించడంతో పాటుగా భావితరం పరిశోధకులకు ఈ వ్యాసం ఎంతో కొంత ఉపయోగపడుతుందని ఆశిస్తూ, ఇంకా పూరించవలసిన ఖాళీలను వెతికే పనిని భావి పరిశోధకులు చేయాలని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు**

1. అప్పారావు, గురజాడ. కథానికలు. 1904. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

2. అప్పారావు, గురజాడ. కన్యాశుల్కం. 2011. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

3. కాత్యాయనీ విద్మహే, తెలుగునాట మహిళల ఉద్యమం విమర్శనాత్మక అంచనా. 2009. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

4. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. తొలికొత్త తెలుగు కథలు. 1985. అనంతపురం: శిల్పి పబ్లికేషన్స్.

5. ధర్మారావు, తాపీ. పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు. 2006. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

6. రాజ్యలక్ష్మి, ప్రోలాప్రగడ. కనుపర్తి వరలక్ష్మమ్మ మోనోగ్రాఫ్. 2000. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

7. వీరేశలింగం, కందుకూరి. స్వీయ చరిత్ర. 2010. హైదరాబాద్.

8. శిలాలోలిత. కవయిత్రుల కవితామార్గం. 2006. హైదరాబాద్: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్.

9. సుజాతరెడ్డి, ముదిగంటి. శ్రీనివాస్, సంగిశెట్టి (సం.పా). తొలి నాటి కథలు. 2005. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

10. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు. 1992. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

(ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**
**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**
**వెల : 300/-**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6

UGC CARE List Approved Journal
హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# కట్టెల మండే

**సాహిత్య మణి, ఫోన్ : 97041 18352**

ఎండా కాలం రాగానే
నల్లగుట్టకు నడుముకు
సీరె సింపు నళ్ళు గట్టుకొని...?
మా సొంటి ఎండి పోయిన
బతుకుల కట్టెలకై పోదుము
గా నడిసే తొవ్వ పొంటి
ఒక్కొక్క కట్టే ఏరుకుంటా
మండే జేదుము
గా కట్టెల మోపైన కమాన
మా ముఖం పొద్దుపొడుపు
సూర్యుని లెక్క మెరుస్తుండేది









మాపటి సిట్టెండకు
సెమట వట్టి తొడుక్కున్న అంగీలు
గంజి బట్టిన తెల్లబట్ట లెక్క
బిగిసుకపోయేటివి
నలిగిన మా బతుకులకు
నల్లరోడ్ గూడ కమిలేట్టు
సురుకులు బెట్టేది
గప్పుడు మోదుగు ఆకులే రచ్చ
కట్టెలకు సెక్కర్లు కొట్టి
అలసిపోయిన పెయ్యికి
ఒర్రె సెలిమేల నాలుగు దొసిల్ల నీళ్లు
తాగితే గా సల్లటి, కమ్మటి రుసికి
యాట్టంతా చిటికెలో మాయమౌ

సుట్టవట్ట బెట్టుకొని తోక
మోపులు పెట్టుకొని ఒకరిగొకరం
సాయం జేసుకొని
యుద్ధం గెలిచిన వీరుని లెక్క
ఇండ్ల దిక్కు జాడ వడుదుము
మాడ కాకేక్కి దగడు అచ్చినప్పుడు,
బరువైనప్పుడల్లా దారి పొన్న
సెట్టు వార జూసి
దానికి పొడువుగా మోపును ఆనిచ్చి
గొంత దమ్ము దీసుకుందుము

గా మోపు జూసినంక
రెండు తరాలను మోసిన
మా నానవ్వ మా నాయినే,
నా బంగారమే అని మెచ్చుకుంటూ...
మీ తాత లెక్కనే పని
నేర్సినవని సంబరవడేది
నేను దేచ్చిన కట్టెలను
ఇర్సుకుంట పొయ్యిలో పెడుతుంటే
బువ్వ కుతకుత మంటుంటే
నా భవిష్యత్తు ఎట్లుంటదో
అనే ఆలోచనలో గిర్రునా
మా అవ్వ కండ్లల్లకెల్లి
ఎసరు పొంగుతూ అచ్చేది

గిప్పుడు పొయ్యి ఊదుడు లేదు
ఆయిటికి ముందే తెచ్చుకునే
కట్టెల మండేలు లేవు
గీ సిలిండర్ పొయ్యి అచ్చినంక
కట్టెల మోపులు కరువయ్యాయి
ఈ సుఖం జూసేతందుకు
కన్నవారు కానరావట్లేదు.

# సవర ధ్వనిశాస్త్రం - ఒక పరిశీలన

**వేదాంతం మురళీధర్,** భాషా శాస్త్ర పరిశోధక విద్యార్థి, తెలుగు విశ్వవిద్యాలయం, ఫోన్ : 9704068780

**వ్యాస సంగ్రహం :**

సవర భాష ఆస్ట్రో ఆషియాటిక్ కుటుంబానికి చెందిన ముండా కుటుంబంలోని దక్షిణ ఉప కుటుంబానికి చెందినది. దీని వ్యవహర్తలు ఎక్కువా ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలో ఉన్నారు. 19వ శతాబ్దం ప్రారంభం నుండి దీనిపైన అనేక పరిశోధనలు జరిగినప్పటికీ అవి ఎక్కువగా ఒరిస్సా రాష్ట్ర పరిధిలో జరిగాయి. మాతృభాషలో విద్యాబోధన కార్యక్రమంలో పాఠ్యపుస్తకాల ప్రాజెక్ట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని సవరభాష పాఠ్య పుస్తకాల రూపకల్పనలో పాల్గొనడం జరిగింది. గిడుగు రామమూర్తిగారి సవర మాన్యువల్‌కి, ఈ శతాబ్దంలో జరిగిన సవర పరిశోధనల్లో సవర వర్ణాల్లో వ్యత్యాసం కనబడుతున్నది. ఈ విషయంపై ప్రస్తుత పత్రంలో వర్ణనాత్మక భాషాశాస్త్ర పద్ధతిలో వివరించడం జరిగింది. సవర భాషలో ఇరవై ఏడు వర్ణాలు ఉన్నాయి. అందులో తొమ్మిది అచ్చులు, పద్దెనిమిది హల్లులు. వర్ణనాత్మక భాషాశాస్త్ర పద్ధతిలో వీటి వ్యాప్తిని, భేదకత్వాన్ని వివరించడం జరిగింది.

**కీలక పదాలు :** సవర భాష, అచ్చులు, హల్లులు, వ్యాప్తి, వర్ణనాత్మక భాషాశాస్త్రం, ముండా కుటుంబం

## 1. ఉపోద్ఘాతం :

సవర భాష ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన సవర గిరిజనులకు చెందిన భాష. ఇది ఆస్ట్రో ఆషియాటిక్ కుటుంబానికి చెందిన ముండా కుటుంబంలోని దక్షిణ ఉప కుటుంబానికి చెందినది. రామాయణం, మహాభారతంలో సవరల ప్రస్తావన మనకు కనబడుతుంది. సాహిత్య దర్పణంలో వీరి భాష, వృత్తి ప్రస్తావన చేయబడింది. బాణుడి హర్షచరిత్రలో రాజ్యశ్రీ ఉదంతంలో హర్షవర్ధనుడు సవర నాయకుడి సహకారం పొందినట్లు ఉన్నది. ఎస్. భట్టాచార్య 1975లో ముండా భాషల వర్గీకరణ, వాటి వైవిధ్యం మరియు వ్యాప్తి పట్ల మన అవగాహనను మరింత సుసంపన్నం చేసింది. అతను వివిధ భాషలతో పాటు దిగువ ముండా మరియు ఎగువ ముండా శాఖలుగా భాషలను క్రమబద్ధంటా సమూహపరచడం ముండా భాషా కుటుంబం యొక్క సమగ్ర వీక్షణను అందించింది. జైడ్ యొక్క వర్గీకరణ ప్రారంభంలో భౌగోళిక పరిగణనల ఆధారంగా సవరను కోరాపుట్ ముండాలోని ఒక భాషగా వర్గీకరించింది. భాషా లక్షణాలను ప్రాథమిక అంశంగా అండర్సన్ చేసిన పునర్విభజన ప్రకారం సవర దక్షిణ ముండా వర్గానికి చెందినది అని నిరూపించబడింది పూర్వ పరిశోధన.

శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు రచించిన 1931లో "ఏ మాన్యువల్ ఆఫ్ సౌర లాంగ్వేజ్", 1933లో "సవర-ఇంగ్లీషు నిఘంటువు"లు సవర ధ్వనులను, వ్యాకరణాన్ని సమగ్రంగా అందించాయి. గియర్సన్ (1906) లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాలోని నాలుగవ భాగం ముండా మరియు ద్రావిడ భాషలు అనే సంపుటిలో సవర భాష గురించి తెలియజేశారు. పాఠశాల విద్యా శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 1 నుండి 5వ తరగతుల వారికి మాతృభాషలో విద్యాబోధన పథకంలో తయారు చేసిన పాఠ్యపుస్తకాలలో సవర భాషకు కూడా తయారుచేయడం జరిగింది. శ్రీ అల్లంశెట్టి చంద్రశేఖరరావు గారు సవర వ్యాకరణం మీద పిహెచ్.డి. గ్రంథాన్ని సమర్పించారు.

శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు రచించిన 1931లో "ఏ మాన్యువల్ ఆఫ్ సౌర లాంగ్వేజ్"లో 17 హల్లులు, 10 అచ్చులు పేర్కొన్నారు. కానీ 1933లో ప్రచురించిన సవర - ఇంగ్లీషు నిఘంటువులో 18 హల్లులు, 9 అచ్చులు పేర్కొన్నారు. అలాగే డేవిడ్ స్టాంప్ (1965) సవరలో 18 హల్లులు, 9 అచ్చులను పేర్కొన్నారు. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం కోసం సేకరించిన సవర సమాచారంలో 9 అచ్చులు, 18 హల్లులను గుర్తించడం జరిగింది. వీటి గురించి ఈ వ్రతంలో వివరించడం జరిగింది.

## 2. విషయ సేకరణ

సవర మాండలికాల తులనాత్మక పరిశోధన గ్రంథం కోసం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని సవర ప్రాంతాల్లో విషయ సేకరణ చేయడం జరిగింది. కేంద్రీయ భారతీయ భాషా సంస్థ (CIIL) వారు అంతరించిపోతున్న భాషల పరిరక్షణ కోసం రూపొందించిన ప్రశ్నావళిని ఉపయోగించడం జరిగింది. దాని ఆధారంగా సవరల ఆహార, శరీర, ఇంటి, వృత్తి, ప్రకృతి, జంతు, పక్షి సంబంధమైన పదజాలాన్ని విభాగాలవారీగా సేకరించాను. ముప్పై సంవత్సరాల పైబడిన స్త్రీ, పురుషుల నుంచి సమాచారాన్ని సేకరించాను. సవర మాతృభాషగా కలిగిన వారితో పాటు, తెలుగు తెలిసిన వారిని కూడా వ్యవహర్తలుగా ఎంపిక చేసుకున్నాను. సమాచారాన్ని డిజిటల్ వాయిస్ రికార్డర్‌లో నిక్షిప్తం చేస్తూ ఉచ్చారణ విధేయంగా అంతర్జాతీయ ధ్వని అక్షరమాల (IPA) రాసుకోవడం జరిగింది. సేకరించిన సమాచారాన్ని మళ్ళీ ఒకసారి క్షేత్రంలో సరిచూసుకోవడం జరిగింది. సవర భాషలోని వర్ణాలకు సమానమైన అన్ని వర్ణాలు తెలుగులో లేనందువల్ల సవర భాషా పదాలను IPA లో రాయడం జరిగింది.

### 3. సవర వర్ణాలు

సవర భాషలో ఇరవై ఏడు వర్ణాలు ఉన్నాయి. అందులో తొమ్మిది అచ్చులు, పద్దెనిమిది హల్లులు.

### 3.1 అచ్చులు

సవర భాషలో తొమ్మిది అచ్చులు ఉన్నాయి. ఇవి నాలుక ఎత్తును బట్టి సంవృత, అర్థ - సంవృత, అర్థ కేంద్ర, అర్థ-వివృత, వివృత అచ్చులుగాను, నాలుక స్థానాన్ని బట్టి పూర్వ, కేంద్ర, పశ్చిమ, అర్థ పూర్వ, అర్థ పశ్చిమ, కేంద్ర అచ్చులుగాను, పెదాల వ్యాప్తిని బట్టి ఓష్ఠ, నిరోష్ఠ్య అచ్చులుగాను వర్గీకరించవచ్చు. సవర అచ్చులలో హ్రస్వ, దీర్ఘ భేదం లేదు. ఈ భాషలో దీర్ఘం వర్ణస్థాయిలో లేనప్పటికీ పదాంతంలో వచ్చే అచ్చులు సాధారణంగా దీర్ఘత్వాన్ని పొందుతున్నాయి. ముండా భాషలలో ఉన్న అచ్చుల అనునాసికత్వం అనేది సవరలో ఉన్నప్పటికీ అది ధ్వని విధేయ దృగ్విషయంగా చెప్పవచ్చు. అనునాసిక హల్లు ముందు, తర్వాత, రెండింటి మధ్యలో వచ్చినప్పుడు అనునాసికత్వం కలుగుతున్నది. అనునాసికత భేదకత్వాన్ని కలిగించేది కాదు.

| | పూర్వ | | కేంద్ర | | పశ్చిమ |
|---|---|---|---|---|---|
| సంవృత | i | | | u | |
| | | ö | U | | |
| అర్థ - సంవృత | e | | | o | |
| | | | « | | |
| అర్థ - వివృత | | | | | |
| వివృత | | | | A | |

అచ్చుల ఉచ్చారణా లక్షణాలను అచ్చుల స్థానం (పూర్వ, కేంద్ర, పశ్చిమ), దీర్ఘత (హ్రస్వ, దీర్ఘ), సందర్భం (అనునాసికత, దిత్వాక్షరాలు), అక్షర నిర్మాణం (సంవృత, అర్థ-సంవృత, అర్థ కేంద్ర, అర్థ - వివృత, వివృత)తో పాటు పరస్పర సంబంధాలు (vowel harmony), పదాలలో వాటి ఉచ్చారణ ప్రభావితం చేస్తాయి.

### 3.1.1. అచ్చుల భేదయుగ్మాలు

/ i /vs / e / లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| / i /vs / e / | పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|---|
| | సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| | id | 'గీకు' | gid | 'గోకు' | bA:dzi | 'పిచ్చి' |
| | ed | 'మొండియగు' | ged | 'మెలిపెట్టు' | bA:dze | 'నిశ్శబ్దంగా ఉండు' |

/ i /vs / o / లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| / i /vs / o / | పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|---|
| | సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| | ide: | 'అచ్చువేయు' | gid | 'గోకు' | dzi?i: | 'పన్ను' |
| | ode: | 'ఒప్పుకోను' | god | 'పంజా' | dzo?o: | 'పండు' |

/ i /vs / u /లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| / i /vs / u / | పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|---|
| | సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| | id | గీకు | gid | 'గోకు' | øi: | 'కొను' |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ud | 'దొర్లించు' | gud | 'గిచ్చు' | øu: | 'వాసన' |

/ i /vs / « /లు పదాది, పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

/ i /vs / « / **పదాది** **పదమధ్య**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|
| irA: | 'అనుకూలమైన' | ridi:n | 'పొడి' |
| «rA: | 'కర్ర' | r«di:n | 'ఇత్తడి' |

/ i /vs / A /లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

/ i /vs / A / **పదాది** **పదమధ్య** **పదాంతం**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|---|---|
| idz | 'నలుసు' | tiN | 'పాతిపెట్టు' | øi: | కొను' |
| Adz | 'కలుపు' | tAN | 'మరణించు' | øA: | 'నడుచు' |

/ ö /vs / A /లు పదాది, పదమధ్య, భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

/ ö /vs / A / **పదాది** **పదమధ్య**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|
| ör | 'వెళ్ళు' | töl | 'దొర్లు' |
| Ar | 'రుద్దు' | tAl | 'ఉంచు' |

/ u /vs / U /లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

/ u /vs / U / **పదాది** **పదమధ్య** **పదాంతం**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|---|---|
| u?u: | 'వెంట్రుక' | uruN | 'తీసుకొనిపోవు' | u?u: | 'వెంట్రుక' |
| U?U: | 'అవును' | urUN | 'వెదురు' | U?U: | 'అవును' |

/ i /vs / ö /లు పదాది, పదమధ్య, భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

/ i /vs / ö / **పదాది** **పదమధ్య**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|
| id | 'గీకు' | til | 'పాతిపెట్టు' |
| öd | 'ఖండించు' | töl | 'దొర్లు' |

/ o /vs /  /లు పదాది, పదమధ్య, భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

/ o /vs /  / **పదాది** **పదమధ్య**

| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
|---|---|---|---|
| odi | 'ధరించు' | kob | 'కూడబెట్టు' |
| di | 'కదుల్చు' | k b | 'బలి ఇచ్చు' |

### 3.1.2 అచ్చుల వ్యాప్తి

సవర భాషపదంలో అచ్చులు వచ్చే ప్రదేశం ప్రకారం ఈ కింది పట్టికలో ఇవ్వడం జరిగింది. మిగతా భాషల్లో వచ్చినట్లు సవర భాషలో అన్ని అచ్చులు అన్ని స్థానాల్లో రావడం లేదు. తొమ్మిది అచ్చుల్లో మూడు అచ్చులు / ö, «,   / పదాంతంలో రావడం లేదు. మిగతావన్నీ అన్ని స్థానాల్లో వస్తున్నాయి.

| | పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|---|
| అచ్చు | సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| i | i?i | 'పేను' | edil | 'దుమ్ము' | eNgsi | 'ఉంగరం' |
| u | u?u | 'జుట్టు' | guldzi | 'ఏడు' | kullu | 'నక్క' |
| e | endZum | 'గొడ్డలి' | bentA | 'వేట' | könte | 'అరటి' |
| | di | 'కదుల్చు' | k  b | 'బలి ఇచ్చు' | – | – |
| o | onti | 'పక్షి' | AdoN | 'దూలం' | «lo: | 'నది' |
| A | A?A: | 'బాణం' | tArbA: | 'పువ్వు' | AbA | 'ఇప్ప చెట్టు' |
| ö | öbbA: | 'ముల్లు' | töme | 'అమ్ము' | – | – |
| U | U?U: | 'అవును' | bUjA: | 'పూజారి' | kArU: | 'కోతి' |
| « | «jo: | 'చేప' | g«din | 'స్నేహితుడు' | – | – |

### 3.2 హల్లులు

సవర భాషలో మొత్తం పద్దెనిమిది (18) హల్లుల ధ్వనులు ఉన్నాయి. అవి /p, b, t, d, k, g, ?, m, n, ∅, N, r, }, dZ, s, V, j మరియు l/. ఈ హల్లులు వాటి ఉచ్చారణ స్థలం ఆధారంగా వర్గీకరించబడ్డాయి. ఇందులో ఉభయోష్ఠ, కంఠ స్పర్శాలలో మాత్రమే శ్వాస, నాద భేదకత్వం కనబడుతుంది. దంత్య, దంతోష్ఠ్య, దంతమూలియ, తాలవ్యోత్తర, తావ్య, కంఠ, కంఠమూలీయ అనే ఏడు రకాల స్పర్శాలు ఉన్నాయి. కంఠ మూలీకృత స్పర్శం అనేది సవర భాషలో ఉన్న ప్రత్యేక వర్ణం. తాలవ్య నాద స్పృష్టోష్మం (dZ) ఉన్నప్పటికీ తాలవ్య శ్వాస స్పృష్టోష్మం సవరలో కనబడడం లేదు. దంతమూలియ శ్వాస ఊష్మంకి సమానమైన దంతమూలియ నాద ఊష్మం లేదు. నాద స్పర్శాలు b, d, g లు పదాంతంలో అవిముక్త స్పర్శాలు (unreleased stops) గా కనబడుతున్నాయి. సాధారణ సంభాషణలో సవరేతరులు దీనిని వెంటనే గుర్తించడం సులువు కాదు. అవిముక్త పదానికి ఏదైనా ప్రత్యయం చేరినపుడు మాత్రమే ఈ అవిముక్త ధ్వని మనం తెలుసుకోగలం. ఈ లక్షణం నాద స్పర్శాలకు పదాంతంలో సవర్ణంగా వస్తుంది. దంత్య శ్వాస స్పర్శానికి (t) నాద ప్రతిరూపం, తాలవ్యోత్తర నాద స్పర్శానికి (d) శ్వాస ప్రతిరూపం లోపించాయి. ఈ లోపానికి కారణం కేవలం స్వేచ్ఛా ప్రవృత్తిగానే కనబడుతుది. ఇతర ప్రత్యేక కారణాలు కనబడటం లేదు. ఇతర దక్షిణ–ముండాభాషల లాగానే సవరలో మహాప్రాణ ధ్వనులు లేవు. ఇతర భాషల నుండి ఆదానం చేసుకున్న పదాలలో మహాప్రాణత్వం లోపిస్తుంది. ఉచ్చారణలో ప్రయత్న వ్యత్యాసం వల్ల స్పర్శ, అనునాసిక, తాలవ్య, కంపిత, కంఠ్య, ఊష్మ, అంతస్థ, స్పృష్టొష్మ, పార్శ్వ హల్లులు సవరలో ఉన్నాయి. సవరలో ఉభయోష్ట (m), దంత్య (n), తాలవ్య (∅), కంఠ (N) అనే నాలుగు అనునాసికాలు ఉన్నాయి. r అనే కంపితం, l అనే పార్శ్వంతో పాటు రెండు అంతస్థాలు V, j లు కూడా ఉన్నాయి.

| | ఉభయోష్ఠ | | దంతోష్ఠ్య | | దంత్య | దంతమూలి | తాలవ్యోత్తర | మూర్ధన్య | | తాలవ్య | | కంఠ | | కంఠమూలీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | శ్వా | నా | శ్వా | నా | శ్వా | | నా | శ్వా | నా | శ్వా | నా | శ్వా | నా | |
| స్పర్శం | p | b | | | t | | d | | | | | k | g | ? |
| అనునాసికం | | m | | | n | | | | | ∅ | | | N | |
| కంపితం | | | | | | r | | | | | | | | |
| తాడితం | | | | | | | | r | | | | | | |
| స్పృష్టోష్మం | | | | | | | | | dZ | | | | | |
| ఊష్మం | | | | | | s | | | | | | | | |
| అంతస్థం | | | | V | | | | | j | | | | | |
| పార్శ్వం | | | | | | l | | | | | | | | |

**3.2.1 హల్లుల భేదయుగ్మాలు**

**3.2.1.1.** p, b లు పదాది, పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

| పదాది | | పదమధ్య | |
|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం |
| pub | 'చెరుగు' | kAppA:n | 'రెక్క' |
| bub | 'ముంచు' | kAbbA:n | 'కడ్డీ' |

3.2.1.2 /t/,/ d/ లు పదాది, పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

| పదాది | | పదమధ్య | |
|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం |
| be | '1 PL' | ob | 'appoint' |
| de | 'become' | odA | 'stream' |

3.2.1.3 /k/, /g/ లు పదాది, పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాంతంలో భేదకత్వం లేదు.

| పదాది | | పదమధ్య | |
|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం |
| g«nu:r | 'వాన' | «kur | 'తోలువూడు' |
| k«nu:r | 'వెదురు' | «gur | 'పండు' |

3.2.1.4 /t/, /?/ పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి. పదాది, పదాంతంలో భేదకత్వం లేదు.

| పదమధ్య | |
|---|---|
| సవర | అర్థం |
| bAtA:r | 'చేదు పోగొట్టుకొనుట' |
| bA?A:r | 'మారు' |

3.2.1.5 /m/, /n/ లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| mAmA | 'రమ్యమైన' | lAmAd | 'మెత్తని' | rAm | 'కాటు' |
| nAmA | 'ఇది' | lAnAd | 'ఒత్తిడి' | rAn | 'బిగువైన' |

3.2.1.6 /m/, /ø/ లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| mAmA | 'రమ్యమైన' | lAmAd | 'మెత్తని' | dAm | 'విశేషణ ప్రత్యయం' |
| øAmA | 'నడక' | lAøed | 'దృఢమైన' | dAø | 'నమలు' |

3.2.1.7 /m/, /N/ లు పదమధ్య పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం |
| nAmAN | 'దహనమగు' | Ad«m | 'దగ్గర' |
| nANA | 'విల్లు' | Ad«N | 'తేనెతుట్టె' |

3.2.1.8 /r/,/l/, r, l లు పదాది, పదమధ్య పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|
| సవర | అర్థం | సవర | అర్థం | సవర | అర్థం |
| rAn | 'తెలియజెప్పు' | tAlmA:d | 'విచారించుట' | purpur | 'పూజ' |
| lAn | 'సందర్శనం' | tArmA:d | 'మెరుపు' | pulpul | 'వెదజల్లు' |

3.2.1.9 /dz/, /r/ లు పదాది, పదమధ్య, పదాంత భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|
| **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
| dzA?A:d | 'పాము' | dzA:dzA: | 'అప్పు' | dudz | 'వంగు' |
| rA?A:d | 'అడ్డాకు' | dzA:rA: | 'వెంటనే' | dur | 'పారిపోవు' |

3.2.1.10 /r/, /}/ లు పదమధ్య భేదకత్వం కలిగి ఉన్నాయి.

| పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|
| | | **సవర** | **అర్థం** | | |
| | | mA:rA | 'నెమలి' | | |
| | | mA:}A | 'అటక' | | |

### 3.2.2. హల్లుల వ్యాప్తి

ఈ కింది పట్టికలో సవర హల్లుల వ్యాప్తిని స్థానం వారీగా ఇవ్వడం జరిగింది.

| | పదాది | | పదమధ్య | | పదాంతం | |
|---|---|---|---|---|---|---|
| **హల్లు** | **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** | **సవర** | **అర్థం** |
| ప | p«lu: | 'తెలుపు' | dApe: | 'పొట్ట' | – | – |
| బ | boNtel | 'దున్న' | röb«n | 'నిన్న' | Adub | 'పాలు' |
| త | tul«b | 'అడవి' | «tuN | 'సొరకాయ' | – | |
| ద | dA?A: | 'నీరు' | sindi | 'ఈతచెట్టు' | b«sed | 'ఉప్పు' |
| క | kAke | 'అక్క' | kAko | 'అన్న' | – | |
| గ | g«re | 'కాలేయం' | bA:gu | 'రెండు' | – | – |
| ? | – | | A?A:n | 'బాణం' | – | – |
| మ | mu?u:n | 'ముక్కు' | rAmeN | 'పిల్లి' | kAnsim | 'కోడి' |
| న | ne?e:b | 'చెట్టు' | könA | 'పులి' | UA:n | 'తండ్రి' |
| ఞ | øilim | 'జలగ' | diøbA | 'ఇప్ప చెట్టు' | moroø | 'నీటికుండ' |
| ఙ | No:rNo:r[ii] | 'మహాధ్వని' | øANA | 'విల్లు' | AlAN | 'నాలుక' |
| ర | redi:n | 'పొడి' | buru | 'పార' | g«nur | 'వర్షం' |
| జ | dzodA | 'నది' | g rdzA:N | 'గ్రామం' | k rodz | 'మినుములు' |
| స | si?i:n | 'చేయి' | «s N | 'పేడ' | | |
| య | jA:gi | 'మూడు' | «jo: | 'చేప' | g«nAj | 'దుంప' |
| వ | VA:je:le: | 'నులిమివేయు' | AvA:n | 'అత్త' | – | |
| ల | l«bo | 'నేల' | p«lu: | 'తెలుపు' | kömbul | 'ఎలుక' |

అన్ని నాద స్పర్శాలు పదాది, పదమధ్య స్థానాల్లోనే కనబడుతున్నాయి. పదాంతంలో రావడం లేదు. అన్ని శ్వాస స్పర్శాలు పదాది, పదమధ్య, పదాంతం స్థానాల్లోనే కనబడుతున్నాయి. పదాంతంలో ఇవి సవర్ణాలుగా వస్తున్నాయి. అన్ని నాసికాలు పదాది, పదమధ్య, పదాంతం స్థానాల్లో కన్పిస్తున్నాయి. కానీ కంఠ అనునాసికం మాత్రం కేవలం కొన్ని భావస్ఫోరక పదాలలో మాత్రమే పదాదిలో వస్తున్నది[iii]. కంఠ మూలీకృత స్పర్శం కేవలం పదమధ్యలోనే వస్తున్నది. శ్వాస స్పర్శాల లాగానే దంతమూలియ ఊష్మం, దంతోష్ఠ్యం అంతస్థాలు కూడా పదాదిలో రావడం లేదు.

### 4. ముగింపు

ఈ పత్రంలో సవర భాషలోని వర్ణాల గురించి వివరించడం జరిగింది. అచ్చులు, హల్లులు పదంలో ఏ స్థానంలో వస్తున్నాయో అనే విశ్లేషణ చేయడం జరిగింది. ఈ వర్ణ సమామ్నయ విశ్లేషణ సవర భాషా పరిరక్షణకు దోహదపడుతుంది. ఇది యువతరాలకు భాషను బోధించడానికి ఉపయోగపడే విద్యా సామాగ్రి, నిఘంటువులు మరియు భాషా వనరులను రూపొందించడానికి ఉపయోగపడుతుంది. ఇది వారి భాషాజ్ఞానాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం మరియు ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. దీనివల్ల భాష యొక్క చారిత్రక అభివృద్ధి, మాండలిక వైవిధ్యాలు మరియు ప్రత్యేక ధ్వని లక్షణాలను మరింత లోతుగా అన్వేషించ వీలవుతుంది. డిజిటల్ యుగంలో ఈ భాషను అందరికీ అందుబాటులోకి తేవడానికి వాయిస్ గుర్తింపు వ్యవస్థలు, టెక్స్ట్-టు-స్పీచ్ టెక్నాలజీలు లేదా డిజిటల్ లాంగ్వేజ్ రిసోర్సెస్ వంటి ఆధునిక సాంకేతికతలతో అనుసంధానించడానికి ఇది అవసరమవుతుంది.

i కె. నాగమ్మారెడ్డి : ధ్వని శాస్త్రం - కొన్ని దృక్పథాలు పేజీ. 163: తెలుగు భాష సిద్ధాంతం - అనువర్తనం.

ii రామమూర్తి సవర మాన్యూవల్ నుండి.

iii రామమూర్తి సవర మాన్యూవల్ నుండి.

**ఉపయుక్త గ్రంథావళి :**

**తెలుగు :**

1. మందలపు వి. రమణయ్య, కర్నాటి తోమాసయ్య, (2005), తెలుగు భాష సిద్ధాంతం - అనువర్తనం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాద్.

**ఆంగ్లం :**

1. Chandrasekharrao, A. (2010), *Savara Grammar : A Tagmemic Analysis.* Ponduru : Adarsa Kala Mandiram.
2. Ramamurti, G.V. (1931), *A Manual of the So:ra (or Savara) Language.* Madras : Government Press.
3. Ramamurti, G.V. (1938). *Sora - English Dictionary.* New Delhi: Mittal
4. Ramamurti, G.V. (*Telugu Savara Dictionary*). Director of Public Instruction.
5. Sankara Reddy, M (1993). *Savara Language Learning Book.* Goyidi, Srikakula : Janachetana.
6. Sankara Reddy, M. et. al. (1997). *Savara Life Educative Book.* Goyidi, Srikakula : Janachetana.
7. Tea Districts Labour Association (1927). *Language Handbook SAVARA.* Calcutta.
8. Vedantham Muralidhar & Dr. G. S. Gabriel. 2011 *Reduplication in Savara.* In *Osmania : Papers in Linguistics, Volume 37,* 2011 *ISSN 0970-0277.* Osmania University : Hyderabad.
9. Vedantham Muralidhar (2010). *An acoustic study of Savara Nasals.* In *Osmania Papers in Linguistics, Volume 36, 2010. ISSN 0970-0277.* Osmania University, Hyderabad.
10. Vedantham Muralidhar (2012). *Sorang Sompeng : A Lingustics Analysis.* In *Osmania Papers in Linguistics, Volume 38, 2012. ISSN 0970 -0277.* Osmania University, Hyderabad.
11. Vedantham Muralidhar: (2013). *Personal Pronouns in Savara.* In *Osmania Papers in Linguistics, Volume 39, 2013. ISSN 0970 -0277.* Osmania University : Hyderabad.
12. Vedantham Muralidhar (2015). Savara. In Ushadevi. A and ChandraSekhara Reddy D (eds>0 *Languages of Andhra Pradesh and Telangana Vol. 3 - Part I (In Telugu) 2015.* pp 349-374. ISBN : 978-93-85231-05-6. Emesco publication: Hyderabad.
13. Venkatrao, T (1981) *Savarala Jiivana Sarali.* Vijayawada: Visalandhra Publishing House.
14. Stampe, D.L. (1965), Recent Works in Munda Linguistics I. International *Journal of American Linguistics., 31(4), 332-341.*

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2024

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్**
**జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్"**

**సర్వ మఙ్గళ మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్**
**చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥**

**10. సర్వపాప ప్రణాశనమ్ :** పాపాలన్నింటినీ పూర్తిగా నాశనం చేస్తుంది. ఈ మాట రామచంద్రునికి చెప్పవలెనా? అక్కరలేదు. కానీ రామచంద్రుణ్ణి నిమిత్తంగా చేసికొని అగస్త్యుల వారు మానవ సమాజానికి చెబుతున్నారని మనం గమనించాలి. శంకర భగవత్పాదులు "అర్జునం నిమిత్తీకృత్య" – అర్జునుణ్ణి నిమిత్తంగా చేసికొని అన్న విషయాన్ని ఇక్కడ మనం స్మరించాలి. మరొక అర్థాన్ని కూడా సంభావించవచ్చు. సర్వుల పాపాలను ప్రణాశనం చేసేది ఆదిత్య హృదయం.

**11. చిన్తాశోక ప్రశమనమ్ :** ఆదిత్యహృదయం చింత వలన అయిన శోకాన్ని మొత్తంగా అణచివేస్తుంది. శ్రీరామచంద్రునకు మహాతపశ్శాలి, విద్యావేత్త, మహా సామ్రాజ్యాధినేత అయిన దశగ్రీవుణ్ణి చంపటం విషయంలో చింత పట్టుకొన్నది. అది శోకంగా మారింది. ఈ చింత, శోకం అనేవి పట్టుకొంటే ఒక పట్టాన వదలవు. వానిని వదిలించుకోవటానికి సద్గురు సమాశ్రయణం కావాలి. కొందరికి అదృష్ట వశాన అది లభిస్తుంది. రామచంద్రునకు అగస్త్యుడు, అర్జునునకు ఉద్ధవునకూ శ్రీ వాసుదేవుడూ అలా లభించి అనుగ్రహం చూపారు. చింతా శోకాలను రూపుమాపారు. అవి ఉన్నంతవరకు మానవుడు సంసారబంధం నుండి తప్పించుకోలేడు. జ్ఞానసిద్ధి తరువాత సంసారంలో ఉన్నా అది "పద్మపత్రమివాంభసా" అన్న తీరే. తామర రేకుపైని నీరు తామరను అంటుకోని విధంగా వారు శేషజీవితాన్ని ఆనందమయం చేసుకొంటారు. ఆదిత్యహృదయం ఉపాసన మానవునకు అటువంటి మహాభాగ్యాన్ని ప్రసాదించే జ్ఞానభాండాగారం.

(సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### ఆరాధన

దేహభావం ఉన్నంతవరకు కొద్దోగొప్పో సాధన తప్పదు. సాధకుడు కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గాలలో దేనినో ఒకదానిని, తన అభిరుచికి అనుగుణంగా అనుసరిస్తూ వుంటాడు. కర్మ, భక్తి, యోగ మార్గాల ముఖ్య ఉద్దేశ్యం మనోమాలిన్యాన్ని తొలగించి పరిశుద్ధ పరచడమే. అట్లు పరిశుద్ధ పరచబడిన మనస్సే జ్ఞానం. ఆత్మవిచారణలో జ్ఞాన మార్గానికున్న విశిష్టత గమనించాం. అందులో మనస్సు అనేదానికి ప్రత్యేక స్థానం లేదు. మిగిలిన సాధనలలో మనస్సు చాలా ప్రాముఖ్యత వహిస్తుంది. దానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. కాని ఆత్మవిచారణలో మనస్సు యొక్క మూల స్వరూపాన్నే ప్రశ్నిస్తాం, కనుక దానికి నిలువనీడ ఉండదు.

శరీరం జడం, ఆత్మ చైతన్యం. ఈ రెండింటి మధ్య "నేను" అంటూ వ్యవహారికంగా వెలువడేదే జీవభావం, లేక అహంకారం. ఈ 'నేను' అనే అహంకారం 'నేను' అనే ఆలోచనే అని కూడా గమనించాం. మనస్సు తన మూలంలో తిష్ఠ వేసుకొని ఇంక లేవకుండా ఉండడాన్నే మనోనాశం అన్నాం.

మనస్సు సాధనలో ఉంటూ కూడా బాహ్య విషయాల నుండి ఉద్దీపన చెందడం జరుగుతూ ఉంటుంది. కాని భగవాన్ సూచించే సాధనలో మనస్సును అంతర్ముఖం చేసి "నేను" పుట్టుక స్థానాన్ని చేరుకోవడమే విశిష్టత. "నేను" పుట్టుకస్థానమే ఉనికి లేక ఆత్మ లేక సద్వస్తువు లేక హృదయం అని కూడా పిలువబడుతుందని చెప్పుకున్నాం.

యోగవాశిష్ఠంలో హృదయ గుహయందున్న పరమేశ్వరుని వదిలి ఇతర దేవతలను ఆశ్రయించడం, చేతనున్న కౌస్తుభమణిని పారవైచి ఇతర చౌకబారు రత్నాలను కోరుకోవడం వంటిది అన్నారు. భగవంతుడు ఆత్మకు భిన్నం కాదని జ్ఞానిదృష్టి. నేను ఎవరు? అని మూలంలో మునగలేకపోతే నీ సర్వస్వం భగవంతునికి అర్పించుకో అని భగవాన్ అన్నారంటే, వారి ముఖ్యబోధ ఉద్దేశం జీవభావాన్ని పారద్రోలడమే, అహంకారాన్ని విచ్ఛిన్నం చేయడమే. కనుకనే భగవాన్, భక్తుడు కూడా తుదకు ఆత్మలో లీనం అవుతారు అని రమణగీత సూచించారు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6  హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు-4

డా. అట్టెం దత్తయ్య , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

'ఆశ' ప్రతిమనిషికి జీవగుణంగా వచ్చే లక్షణం. దీని గురించి ఆధ్యాత్మిక వేత్తలు ఒక విధంగా, వ్యక్తిత్వ వికాస ఉపన్యాసకులు మరో విధంగా వివరిస్తారు. **"ఆశ విషముకన్న దహనముకన్న దారుణమైనది"** అని చిలకమర్తి 'కర్పూరమంజరి'లో అంటే, **"జీవితానికీ పునాదే ఆశ. జీవించడం అంటేనే ఆశపడటం"** అని గోపీచంద్ 'ఆశాజ్యోతి'లో అంటాడు. ఇలా రెండు వ్యతిరేక కోణాలలో 'ఆశ'ను వాడుతారు. ఆశకు ఉన్న పరిమాణం చాలా పెద్దది. పేరాశ, దురాశ, అత్యాశ, అడియాశ, నిరాశ వంటి పదాలను చూసినపుడు ఆశను అంచన వేయడం కష్టమని అనిపిస్తుంది. అంతుచిక్కని ఆశను వదిలివేయుమని ఆధ్యాత్మిక గ్రంథాలు చెప్పి అలసిపోయాయి. వశిష్ఠ గీత **"యత్పృథివ్యాం వ్రీహి యవః హిరణ్యం పశవస్త్రియః / ఏకస్యాపి న పర్యాప్తం తస్మాత్తృష్ణాం పరిత్యజేత్"** ప్రపంచంలో ఉండే వడ్లు, యవలు, బంగారం, పశువులు, స్త్రీలు ఇవన్నీ ఒకనికైనను తృప్తి కలిగించజాలవు. కాబట్టి ఆశను వదలవలెను అంటుంది. ఇట్లాంటి మహత్తరమైన ఆశను గురించి ధర్మరాజు భీష్ముడిని ఒక ప్రశ్న అడిగాడు.

**ప్రశ్న: ఆశ వల్లనే ఏ దురాగతానికైనా సిద్ధపడుతున్నారు. ఈ ఆశ ఎలా తొలిగిపోతుందో వివరించండి.** (శాంతి.5.372)

దీనికి సమాధానంగా ఒకప్పుడు జనకుడు – మాండవ్యముని ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను భీష్ముడు తెలియజేశాడు. మాండవ్యముని జనకుడి దగ్గరకు వచ్చి ఆశ లేకుండా ఉండడం కోసం శిక్షణ ఇవ్వని అర్థించాడు.

జనకుడు ఆ మునితో 'సంపదలు దుఃఖనిలయాలు. కామసుఖం, దివ్వసుఖం కూడా ఆశలేమివల్ల వచ్చే సుఖానికి సరికావు. ధనం అనాయాసంగా లభించగానే గోవుతోపాటు దానికొమ్ములు పెరిగినట్లే ఆశ కూడా పెరిగుతుంది. ఆశ వల్ల మమకారం పెరుగుతుంది. వారు మా చుట్టాలు, ఆవి మా సంపదలు, అవి మా నెలవులు అనే మమకారం తొలగిపోతే ఆశ నశిస్తుంది. దొరికిన దానిని అనుభవిస్తూ, దొరకనిదానికి చింతపడి దుఃఖించకుండా పరిపూర్ణుడై ఎవరుంటారో వారి మనసులోకి ఆశ ప్రవేశించదు.

దుర్బుద్ధులైనవారు ఆశను విడువలేరు. శరీరం ముసలితనం పొందినా ఆశమాత్రం ముసలితనం పొందదు. అది ప్రాణాలు తీసే రోగం. ఆశను వదిలేసిన వారే అత్యధిక సుఖాన్ని పొందుతారు. సుఖదుఃఖాది ద్వంద్వాలకు వ్యాకులత చెందవద్దు. నిగ్రహంతో మనోబుద్ధ్యాదులతో కూడిన అంతఃకరణసంపదను కాపాడుకోవాలి. ఇట్లా చేసిన వారికి ఆశలేమి వల్ల నిత్యసుఖం కలుగుతుంది' అని బోధించాడు.



పైన జనకుడు తెలిపిన విషయాలలో ఆశ ఎలా పుడుతుంది. ఎలా పెరుగుతుంది. ఎలా వదులుకోవచ్చు. దానివల్ల వచ్చే నష్టాలు, దాన్ని వదులుకుంటే వచ్చె సుఖాలను గురించిన వివరాలున్నాయి. దీనిలో ఆశ పుట్టుక, వికాసం, స్వరూపం, స్వభావం అన్నిటిని తెలుసుకోవచ్చు.

'ఆశ ప్రాణాలు తీసే రోగం' అంటాడు. రోగం ఒకసారి వచ్చింది అంటే అది పెరుగుతూనే ఉంటుంది. దానిని పసిగట్టి తగినమందులు వాడకపోతే కృశింపచేసి చివరకు ప్రాణాలను తీస్తుంది. పరుగెత్తినంత దూరం భూమిని నీకే పట్టాచేసి ఇస్తాను అంటే ప్రాణం పోయేంత వరకు పరుగెత్తిన కథ చిన్నపుడు చదువుకున్నాం. అంటే ఆశ ప్రాణం తీస్తుంది.

'అనాయాసంగా ధనం వస్తే ఆశ పెరుగుతుంది' అనేది ధనంమీద ఆశ పెరగడానికి కారణాన్ని తెలియజేస్తుంది. చాలా కష్టపడితే వచ్చిన ధనాన్ని చూసి మరింత ధనం కావాలి అనుకోరు. అది కావాలంటే ఎంత కష్టపడాలో తెలిసింది కాబట్టి. కష్టపడకుండా ధనం పొందిన వారికి ఆ ధనం మీద ఆశ మరింతగా పెరుగుతుంది. కష్టం కలుగలేదు కాబట్టి. ఆవు పుట్టినపుడు కొమ్ములు పుట్టవు. పుట్టినవంటే ఆగకుండా పెరుగుతూనే ఉంటాయి. కొన్ని ఆవులకు ఆ కొమ్ములు తలకుమించిన భారమౌతాయి కూడా.

'మమకారం తొలగిపోతె ఆశ నశిస్తుంది.' అని ఆశకు విరుగుడు చెప్పాడు. మా అనేది ఏది లేదు అనుకున్నపుడు ఆశే లేదు. ఉన్నప్పటికి వాటిని అంటుకోకుండా ఉన్నపుడు ఆశ తొలగిపోతుంది. చుట్టాలు, సంపదలు, నెలవులు ఏవి ఎవరివెంట వచ్చేవి కావు. కాని అందరు వాటిని సుఖపెట్టడం కోసం, పెంచడం కోసం, కాపాడుకోవడం కోసం నిరంతరం ఆలోచిస్తారు. ఆశలో పడుతారు. ఈ మూడింటిమీద మమకారం వదులుకోవడమే ఆశను తొలగించుకోవడం. ఆశను వదులుకున్న వారు అనంత సుఖాన్ని పొందుతారు.

'కామం వల్ల కలిగే సుఖం, దేవలోకం వల్ల కలిగే సుఖం కంటే ఆశవదులుకోవడం వల్ల కలిగే సుఖం గొప్పది' అని జనకుడంటాడు. ఎంతటి సుఖాన్ని పొందుతాడో తెలుసుకోవడానికి రెండు ఉపమానాలను ఇచ్చాడు. బ్రతికున్నంత కాలం కామసుఖాన్ని మించిన సుఖం లేదనుకుంటారు. మరణించాక మాత్రం స్వర్గ సుఖం కావాలనుకుంటారు. కాని ఇక్కడ ఆశను వదులుకుంటే ఇహ, పరలోక సుఖాలను మించిన సుఖం పొందవచ్చు అంటాడు. అది అనుభవైక్యవేద్యం.

**"దొరకొన్న ననుభవించుచు**
**దొరకొనమికిఁ జింతనొంది దురపిల్లక ని**
**ర్భరుఁడై యునన్ననుఁదృష్ణకుఁ**
**జొరవచ్చునె యతని మనసు సువ్రతశీలా!"** (శాంతి.5.376)

అనే పద్యభావం ప్రకారం 'దొరికినదానిని అనుభవిస్తూ, దొరకనిదానికి చింతపడి దుఃఖించకుండా పరిపూర్ణుడై ఉన్నవారి మనస్సులోకి ఆశ ప్రవేశించదు' అని తెలుస్తుంది. ఆశను మనసులోకి రాకుండా చేసుకున్నవారు పూజ్యనీయులు. ఆశను ఎవరు వదులుకోరో కూడా ఈ భీష్మ సమాధానం తెలియ జేసింది. వదులుకొని వారు దుర్బుద్ధులు అంటారు. మనుషులు ముసలి వారైనా ఆశ మాత్రం వయసులోనే ఉంటుంది అంటారు. ఇందులో తేల్చిన అంశం ఏమిటంటే వ్యామోహ రహితులు, సుఖదుఃఖాది ద్వంద్వాతీతులు మాత్రమే ఆశను వదులుకోగలరు. ఆశను వదులుకున్న వారే నిత్యం ఇహపరలోక సుఖాలను మించిన సుఖాన్ని పొందుతారు అని.

❖ ❖ ❖ ❖ ❖

ధర్మరాజు అడిగిన ప్రశ్నలలో ఆశకు సంబంధించినది మరొకటి కనిపిస్తుంది.(శాంతి.3.150) దానికి సమాధానంగా భీష్ముడు ఒక కథ చెప్పాడు.

సుమిత్రుడు అనేరాజు ఒకనాడు వేటకు పోయాడు. ఒక జంతువును కొట్టాడు. అది బాణంతోపాటు పారిపోతుంది. రాజు దాని వెంటపడ్డాడు. అది దొరికినట్లే అనిపిస్తూ చాలా దూరం పోయింది. దానితోపాటు కారడవిలో కలిసిపోయాడు. ఆలసిపోయాడు. దగ్గరలో ఉన్న ఒక ముని పల్లెకు చేరుకున్నాడు.

అక్కడ ఋషభుడనే ముని ఆ రాజుతో 'నీవు ఒంటరిగా అరణ్యంలోకి ఎందుకు వచ్చావు? బాగా దిగులుగా కినిపిస్తున్నావు ఏమిటి?' అని అన్నాడు. అప్పుడు రాజు 'ఒక జంతువు నేను కొట్టిన బాణంతోపాటు పారిపోగా దానివెంట ఎంతో ఆశగా వచ్చాను. అది నన్ను చాలా తిప్పలు పెట్టింది. ఆశ ఇంత తప్పించుకోలేనిదా?' అని అడిగాడు. అపుడు ఋషి 'నేను పూర్వ ఒకపుడు తీర్థయాత్రలు చేస్తూ బదరికాశ్రమంలో తనుడనే పేరుగల ఒక తాపసిని కలిసాను. అతని బోధలు వింటూ అక్కడే ఉన్నాను. అంతలో వారి దగ్గరికి ఒక రాజు వచ్చాడు. ఆ రాజుకున్న ఒక్క కొడుకు సరదాకు అడవిలోకి వెళ్ళి తిరిగిరాలేదు. ఎంత వెదికిన దొరకడం లేదని ఆ మునిని అడిగాడు. ముని మౌనంగానే ఉన్నాడు. 'బాగా ఆశపడ్డప్పుడు ఆ ఆశ అడియాస అయితే మనసు ఇంత తట్టుకోలేనిదవుతుందా!' అని ఆ మునిని మళ్ళీ ప్రశ్నించాడు.

అప్పుడు ముని 'ఎవరైనా, ఎక్కడ్కెనా, ఏ విషయంగానైనా మనసును దిటవు పరచుకొని తగిన రీతిలో నడుచుకొంటే అతడికి లభ్యం కానిది ఉండదు' అంటాడు. అట్లాగే 'ఇస్తానని ఇవ్వనివారిమీద, కృతఘ్నులైన దుష్టులమీద, మనసు పడ్డ స్త్రీలపట్ల ఆశ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఇంకా ఇట్లాంటి ఎన్నో విషయాల కోసం పరుగులుపెట్టె ఆశను వదలుకొమ్ము. అప్పుడు సుఖపడుతావు' అని బోధించాడు.

ఇందులో ఆశ ఎంతగా పరిగెత్తిస్తుందో తెలుసుకోవచ్చు. అందినట్టే అనిపిస్తూ అందకుండా పోయే దానికోసమే వేటగాడిలా అడవుల వెంట పరుగులు పెడతారు. ఈ కథలో వేటగాడు అంటే అజ్ఞానం. ముని అంటే విజ్ఞానం. అడవులు అంటే కష్టాలు. విజ్ఞానం అందేవరకు అజ్ఞానులు ఆశాలోలురై పరుగులు పెడుతూ కష్టాల పాలవుతారు. అట్లాగే ఎవరి విషయంలో బాధకు గురిచేసే ఆశతో ఉంటారు అనే విషయాన్ని కూడా ఈ కథ తేల్చిచెప్పింది. మనది కాకుండా పోయినా దానిపై ఆశతో వెదికినపుడు అది దొరకకుంటే కూడా తట్టుకోలేని బాధకలుగుతుంది. ఇస్తానని ఇవ్వని వారి పట్ల ఎందుకు ఆశతో ఉండాల్సి వస్తుంది అంటే వారు ఇస్తాను అనడంతో దానికి తగిన ఆలోచనను పెంచుకుని ఉంటాడు. ఒకరికి మేలు చేసేటప్పుడు కూడా చాలా మందికి మనకు వారు ఎక్కడో ఉపయోగ పడుతారు అనే చిన్న ఆశాభావం ఉంటుంది. స్త్రీ పురుషుల విషయంలో కూడా.

❖ ❖ ❖ ❖ ❖

ధర్మరాజు అడుగుతున్న ప్రశ్నల పరంపరలోనే ఒకసారి 'ఏది సర్వోత్తమమైన ధర్మం' (శాంతి.4.3) తెలుసుకోవాలని ఉంది అన్నాడు. దానికి భీష్ముడు చక్కని సమాధానం చెప్పాడు. అందులో ప్రధాన భాగంగా ఆశను గురించి వివరించాడు. దీనిని పింగళ అనే ఒక వేశ్య కథ ఆధారంగా చెప్పాడు. పింగళ అనే వశ్య తన ప్రియుడి కొరకు ఎదురుచూస్తూ ఉంటుంది. అయినా అతడు రాలేదు. అప్పుడు ఆ వేశ్య ఇలా అనుకుంది. "నేను నా ప్రియుడి కోసం పిచ్చిదాన్ని అయ్యాను. అయితే నాకు పట్టిన ఈ పిచ్చి నా ప్రియుడికి కూడా పట్టే వీలుందా! లేదు. కాబట్టి ఈ భ్రమను వదులుకొని, శీరీరానికి ఉన్న అన్ని మార్గాలను బంధించుకుని నిద్రపోతాను. నా దగ్గరకు వచ్చినవాడే నా ప్రియుడు అనికొనింది. ఇతరులపై కోరికమాని, తృప్తితో మనస్సును ఏ దిగులూ లేకుండా ఉంటే సుఖాలు నన్ను చేరుకొంటాయి. ఆలోచించి చూస్తే ఆశే ఇంద్రియలోలుని చేసి మనిషిని క్రుంగదీస్తుంది. మనిషి ఓటమి పాలు కావడానికి, వినాశనానికి ఆశ ఒకటే కారణం. కాబట్టి నేను ఆశను వదులుకొని

ఇంద్రియాలను జయించి, వినాశానికి దూరంగా సుఖంగా జీవిస్తాను. నిరాశయే సుఖప్రదమైనది అని పలికి మనః ప్రవృత్తితో పింగళ శాంతంగా నిద్రించింది.

ఇక్కడ పింగళ వృత్తి రీత్యా వేశ్య. అయినప్పటికీ ఒకడి మీద మనసుపడి వాడి కోసం ఎదురు చూస్తుంది. ఆమెకు ఉన్న ప్రేమ ఎదుటి వాడికి లేదని గమనించింది. ఇది ప్రకృతి జన్యమయితే ఇరువైపుల ఉండాలి. అట్లా లేదు కదా అయితే ఆశపడ్డవారే భ్రమలో ఉన్నట్లు తెలుసుకుంది. తెలియజేసింది. ఆ భ్రమకు కూడా కారణం ఇంద్రియాలే అని తెలియపరుస్తుంది. ఇంద్రియ నిగ్రహం ఉన్నవారు ఎటువంటి ఆశ వలలో చిక్కుకోకుండా ఉంటారనే విషయాన్ని కూడా ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. అంతే కాకుండా అన్ని విషయాలలో ఆశ పరులౌతారు. అన్ని రకాల వారు కూడా ఆశాపరులుగా ఉంటారు అనే విషయాన్ని తెలియజేస్తూ, ఆశను అధిగమించాలి అంటే ఇంద్రియ నిగ్రహం అనేది కూడా చాలా అవసరం అని పై విషయాలు తెలియజేస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు**

1. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము' (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.
2. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. 'శ్రీమహాభారతము' (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.
3. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. 'మహాభారత విమర్శనము' (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.
4. అప్పలస్వామి, పురిపండా. 'వ్యావహారికాంధ్ర మహాభారతం' (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.
5. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 'భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు' 1986. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
6. వెంకటరత్నం, గుంజి. 'మహాభారత విజ్ఞాన సర్వస్వం' 2021. హైదరాబాద్: ఎమెస్కో.

## దయజూడు రాముడా!!

ఆచార్య మసన చెన్నప్ప, ఫోన్ : 988 565 4381

కీర్తికెక్కిన ఓ రామా! కేలుమోడ్తు
రమ్యముగ మము బ్రోవంగ రాగదయ్య!

పూర్వ జన్మమునందు పుణ్యంబు జేసిన
దానికి సుఖమంచు దలచినావు
పాపంబు జేయ తత్ఫలితంబు జేకూరు
నంచు జనులకు బోధించినావు
ఇంద్రియ నిగ్రహమెవ్వరికైనను
క్షేమంకరమని వచించినావు
ధర్మమ్ము దప్పిన దానవేంద్రుని ద్రుంచి
నేలపై ధర్మమ్ము నిలిపినావు
గురువులకు సంతసమ్మును గూర్చినావు
దివ్యసుఖములు ప్రజల కందించినావు
న్యాయమార్గము తప్పక నడచినావు
ఎంత ఘనుడవు! పొగడ నేనెంతవాడ?

కల్మషమ్ములు లేని కార్యమ్ములను జేసి
యెంతయు నుపదేశమిచ్చినావు
శరణని వచ్చిన అరి వతంసులనైన
ప్రేమ మీరగ ఆదరించినావు
తండ్రి యాజ్ఞను లెస్స తలదాల్చి యడవుల
కేగుటకై నిశ్చయించినావు
పత్ని సీతమ్మను బాధించకెప్పుడు
అనురాగమూర్తివై అలరినావు
సాధుజనుల బ్రోవంగ సాగినావు
వేదజనుల సాకంగ వెడలినావు
భద్రగిరి నివాసమ్ముగా బరగినావు
రామ! నీ భక్తులను జూడ రాగదయ్య!



లంకేశునోడించి, లంకను ప్రేమతో
అతని తమ్మునికిచ్చి అలరినావు
కైకమ్మ వచనమ్ము కాదనజాలక
కొడుకు రాజ్యంబేల గోరినావు
గుహుడు పిలిచినంత కోరికతో వెళ్లి
అతనింట ఆతిథ్యమందినావు
హనుమనిం జేరంగ అప్తుని కైవడి
భావించి ప్రభువులై బరగినావు
రాజువై నీవు, అందరి రాజువగుచు
ధర్మపాలనమందు నాదర్శమగుచు
ధర్మమె మూర్తిగా గలిగి తద్దయు వేడుక గూర్చినావు స
ద్ధర్మమె జాతి జీవన విధనమటంచును దెల్పినావు సత్
కర్మలటన్న నెట్టివొ జగంబునకెంతయు జూపినావు ఓ
ధర్మ పరాయణా! నను ప్రధానముగ దయజూడు రాముడా!

ISSN 2457-0796

UGC CARE List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 (44) హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# తెలుగులో గజల్ ప్రక్రియ – సామాజిక మాధ్యమాల పాత్ర

**డా. కె.డి.డి. మృణాళిని, ఫోన్ : 9652241261**

సాహితీప్రక్రియల్లో గానయోగ్యమైన వాటిలో గజల్ **"ఒక కమనీయ కవితాలహరి, గులాబీల గుచ్ఛం"**. ఇది ఒక అరబీ పదం. ఎడారిలో పూలు పూయవని అందరికీ తెలుసు, కానీ గజల్ అనే వాడిపోని పువ్వు పూసింది మాత్రం అరేబియా ఎడారిలోనే! శతాబ్దాలుగా ఉర్దూ – పారసీ కవుల గుండె కింది తడిని జీరగొంతుతో వినిపిస్తూ ప్రజల హృదయాలను పరవశింపజేస్తున్న గజల్ ప్రపంచ కవితా వినీలాకాశంలో ఒక వెన్నెల పుష్పం. ఎందరో భాషా ప్రేమికుల్ని కూడా తన కవిత్వ ఇంద్రజాలంతో రసలోకంలో ఓలలాడిస్తోన్న "గజల్" అరబ్బీ, పారసీ భాషల్లోని సంప్రదాయాల సమ్మిళితమై 11వ శతాబ్దం నాటికి ఇప్పుడున్న రూపాన్ని సంతరించుకుంది. అరబీలో ఆవిర్భవించి, రూపుదిద్దుకుని పార్సీలో పరిపూర్ణతను పొందింది. గజల్ ఒక ప్రక్రియ అనడంకన్నా ఒక సంస్కృతి అనడం అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం ఉన్న గజల్ రూపానికి ఆద్యుడు కవి సాదీ. అరేబియా ఎడారిలో పనిచేసే కార్మికులు రాత్రివేళల్లో తమ నాయకుడిని స్తుతిస్తూ **"కసీదా"**ను పాడేవారు. ఆ కసీదాను పాడబోయే ముందు రెండు వాక్యాలలో ప్రేమను, అనురాగాన్ని సూచిస్తూ పాడే అలవాటు ఉండేది. ఆ రెండు వాక్యాలే కాలక్రమేణా గజల్ ప్రక్రియకు నాంది పలికాయి. కాలక్రమంలో గజల్ కసీదా నుండి విడివడి ఒక ప్రత్యేకమైన కవితా ప్రక్రియ అయ్యింది. **"గజల్"** అనే పదానికి అరబ్బీభాషలో **"రాగాలాపన"** అనే అర్థం ఉన్నా **"ప్రియురాలితో సల్లాపం" (మాషూ కాసే గుఫ్త్ గూ)** అనే భావాన్ని వ్యక్తపరుస్తుంది.

20వ శతాబ్దంలో తెలుగుభాషలోకి ప్రవేశించి అనేక పరిశోధనలు, ప్రయోగాలతో ఎంతోమంది పాఠకుల, శ్రోతల మదిని దోచుకున్న గజల్ వివిధ సాహిత్యప్రక్రియల్లో గానయోగ్యమైన ప్రక్రియగా విలసిల్లి నేడు ప్రపంచవ్యాప్తం అయింది. ఇది తెలుగు సాహిత్యంలోకి 1963లో అడుగు పెట్టింది. అంత పెద్ద వృక్షాన్ని కడుపులో దాచుకున్న మర్రి విత్తనంలాగా గజల్ ఆకాశమంత భావాన్ని తనలో ఇముడ్చుకుంది. బ్రతికినన్నినాళ్ళు ప్రేమ క్షీరసాగరంలోనే మునిగి తేలి, ప్రేమపూరిత కవిత్వాన్నే రాసిన **"గజ్జాల్"** అనే కవి పేరుతోనే **'గజల్'** అనే పేరు వచ్చిందని దాశరథి కృష్ణమాచార్య పేర్కొన్నారు. **'శృంగార రసాత్మక సిసలైన భావ కవిత గజల్'** అని దాశరథి నిర్వచించినా, తెలుగుకవులు మాత్రం దానికి శృంగార రసానికి బదులు సామాజిక దృక్పథాన్ని అద్ది తెలుగు కవిత్వం ఎప్పుడూ ప్రజల వైపే నిలుచుంటుందని చెప్పకనే చెప్పారు. ప్రాథమికంగా గజల్ 'షేర్' ల కూర్పు. ఒక షేర్ అనేది 2 పాదాలను కలిగి ఉంటుంది. ఒక గజల్ 5,7,9 ఇలా ఎన్ని షేర్‌లైనా ఉండవచ్చు. కనీసం 5 షేర్‌లైనా ఉంటేనే అది గజల్ అవుతుంది. ఒక గజల్‌లోని అన్ని పాదాలు ఒకే తూగులో ఉండాలి. ఒక పాదం పెద్దదిగా, ఒక పాదం చిన్నదిగా ఉండకూడదు. గజల్ చివరి షేర్ లో కవి పేరు లేదా అతని కలం పేరు ఉండవచ్చు. ఇలా ఉండడాన్ని **'తఖల్లుస్'** అంటారు. గజల్‌కు అతి ముఖ్యమైనవి **'కాఫీయా', 'రదీఫ్'**లు. కాఫీయా అంటే అర్థం **"అంత్యానుప్రాస"**, రదీఫ్ అంటే **"పునరావృతమయ్యే పదం"**. ఒక గజల్‌కి రదీఫ్ లేకుండా ఉండవచ్చు, కానీ కాఫీయా లేనిది గజల్ కాదు. గజల్‌కు శీర్షికలు ఉండవు. కావ్యరచన అనువాదంగా మొదలైనట్టుగానే గజల్ రచన కూడా తెలుగులో అనువాదంతోనే మొదలైంది.

**"వలపునై నీ హృదయ సీమలో నిలువవలెనని ఉన్నది**
**పిలుపునై నీ అధర వీథుల పలుకవలెనని ఉన్నది"**

1965లో వచ్చిన తొలి తెలుగు గజల్‌లోని మక్తా ఇది. ఏప్రిల్ 14, 1965 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక లో **"ఉగాది గజల్"** అనే శీర్షికతో అచ్చయింది. ఇందులో 'ఉన్నది' అనేది 'రదీఫ్' అయితే, 'నిలువవలె', 'పలుకవలె' పదాలలోని 'ఎ' అనే అచ్చు 'కాఫియా'.

తొలి తెలుగు గజల్ కవి దాశరథి స్వీయ గజళ్ళను రాయడానికి ముందు **"ఖుదాయే గజల్"** అయిన **'గాలిబ్'** గజళ్ళను తెలుగులోకి అనువదించారు. 1961లో అవి **"గాలిబ్ గీతాలు"** పేరిట ఒక సంకలనంగా వెలువడ్డాయి. ఇవే కాక **"మీర్ తకీ మీర్"** గజళ్ళలోని కొన్ని షేర్లను తెలుగులోకి అనువదించారు.

**"రమ్మంటే చాలు కానీ రాజ్యాలు విడిచి రానా**
**నీ చిన్ని నవ్వు కోసం స్వర్గాలు గడిచి రానా!"** అనే పేరుతో మొదలయ్యే 5 షేర్‌ల గజల్ 1984లో **"జ్వాలా లేఖిని"** అనే సంపుటిలోనిది.

తొలి తెలుగు గజల్ వాగ్గేయకారులు పి.బి. శ్రీనివాస్. వారు స్వయంగా రాసి, స్వరపరిచి పాడిన గజల్ –?

**"కల్పనలు సన్నాయి ఊదే వేళ చింతలు దేనికి?**
**కవితలనె అర్పించు కానుక లోక కల్యాణానికి"** ఇది 1978లో ఆకాశవాణి కడప కేంద్రం నుండి ప్రసారం అయింది.

1967లో దాశరథి రాసిన **"అధరాల వీధిలోన మధుశాల లున్నదాన"** అనే గజల్ ఈమని శంకరశాస్త్రి సంగీతంలో పి.బి. శ్రీనివాస్ పాడారు. ఈ గజల్‌ను కొలంబియా రికార్డ్స్ వారు విడుదల

చేశారు. తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం ప్రపంచంలోనే 8 భాషలలో గజళ్ళను రాసిన ఏకైక వ్యక్తి పి.బి. శ్రీనివాస్. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషలలో గజళ్ళను రాశారు. తమిళం, కన్నడ, మలయాళం భాషలలో వారే తొలి గజల్ రాసినట్లు తెలుస్తోంది.

1997లో విడుదలైన **'ప్రణవం'** అనే తమ అష్టభాషా కవితాసంకలనంలో వివిధ భాషల గజళ్ళను పొందుపరిచారు. పి.బి.శ్రీనివాస్ తెలుగు గజల్‌కు **"వల్లరి"** అనే పేరు పెట్టారు. వారు ఆ పేరుతోనే తమ తెలుగుగజల్ లను ప్రచురించారు. తొలి తెలుగు గజల్ రికార్డ్ వల్లరి పేరుతోనే విడుదలైంది.

తెలుగులో గజల్‌ను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన కవి సి.నా.రె. వీరి వల్ల తెలుగు సాహిత్యంలో గజళ్ళకు ఊపు వచ్చింది.

**"పరుల కోసం పాటుపడని నరుల బ్రతుకు దేనికని!**
**మూగ నేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని!**

........................................................................

**శిశు హృదయానికి కల్లలు లేవు రస రాజ్యానికి ఎల్లలు లేవు**
**లోపలి నలుపు 'సినారె' కు తెలుసు పై పై తొడుగు దేనికని!**

ఇందులో 'దేనికని' అనే పదం రదీఫ్, బ్రతుకు, పరుగు పదాల్లోని 'ఉ' అనే అచ్చు కాఫియా. 'సినారె' అనేది 'తఖల్లుస్'.

1979లో వచ్చిన ఎన్టీరామారావు చిత్రం "అక్బర్ సలీం అనార్కలి" అనే తెలుగు చిత్రంలో సినారె రాసిన గజల్ – **"తానే మేలిముసుగు తీసి ఒక జవ్వని పువ్వులా గా నవ్వుతుంటే ఏం చేయను"** అనే గజల్ సంగీత సాహిత్య పరంగా ఒక చక్కటి గజల్.

1983లో **"చిరునవ్వు పలికించే స్వర కల్పనలెన్నో, హృదయాలను ఒలికించే మృదు చిత్రణలెన్నో"** అనే షేర్‌తో మొదలయ్యే సినారె గజల్‌ను ఎం.చిత్తరంజన్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి స్వీయ సంగీత సారథ్యంలో పాడి ప్రసారం చేశారు.

**"ఎదురుగా క్షీర సముద్రాలున్నా, హృదయానికి దాహం**
**కరిగే తొలకరి మేఘాలున్నా గగనానికి దాహం"** – సినారె

తొలి తెలుగు గాయని పి.సుశీల 1986లో విడుదలైన **"సంసారం ఓ సంగీతం"** అనే చలనచిత్రంలో పుహళేంది సంగీతంలో **"ఇందరు మనుషులు దేవతలైతే, ఎందుకు వేరే కోవెలలు"** అన్న సినారె గజల్‌ను ఆమె పాడారు. గాయని శొంఠి పద్మజ 1989లో సినారె గజల్‌ను హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం కోసం పాడారు.

**"కొంతకాలమిటులే యేకాంతమ్మున మేలుకొందు**
**కనురెప్పల కత్రువులను కావలిగా నిల్పుకొందు"** అనే మొదలయ్యే రచన రెండవ తెలుగు గజల్. ఇది 1965 డిసెంబర్‌లో విడుదలైన "అక్షరాల గవాక్షాలు" సంపుటిలో "జాగృతుడు" శీర్షికతో అయింది.




పి.బి.శ్రీనివాస్, ఏ.సి. వెంకటాచలం, మహమ్మద్ రఫీ, ఎం. చిత్తరంజన్, సినారె ప్రభృతులు తర్వాత గజల్ గానాన్ని చేపట్టింది కేశిరాజు శ్రీనివాస్. గజల్ శ్రీనివాస్‌గా మనమందరము ఎరిగిన వీరు తమ గానంతో తెలుగుగజల్‌ను ప్రచారం చేసారు. ఇతర భాషలతో ఉన్న గజల్ గానానికి భిన్నంగా గజల్ శ్రీనివాస్ మన తెలుగు హరికథ గాన విధానాన్ని తోడు తీసుకుని జానపద ధోరణిలో సాగే గానంతో తెలుగు గజల్ జనరంజకం చేశారు.

1972లో వల్లపురెడ్డి బుచ్చారెడ్డి వంటి కొందరు ఉర్దూ కవుల గజల్‌ల షేర్‌లను తెలుగులోకి అనువదించారు. అవి **"ముక్త గీతికలు"**, **"మధు గీత"** పేర్లతో వెలువడ్డాయి. 2013లో రామచందర్ దీకొండ కొన్ని గాలిబ్ గజల్ పేర్లను తెలుగులోకి అనువదించి **"గాలిబ్ కవితా కౌముది"** పేరిట ప్రకటించారు. పి.బి.శ్రీనివాస్ హిందుస్థానీ, రోచిష్మాన్ ఆంగ్లంలో కూడా గజళ్ళను రాశారు. దక్షిణాఫ్రికాలోని పోయెట్రీ మూమెంట్ వారు రోచిష్మాన్ రాసిన ఇంగ్లీష్ గజల్‌ను 2016లో ఒక సంకలనంలో ప్రచురించి దానికి భారతీయ వనిత భరతనాట్యం చేస్తున్నట్టు బొమ్మ వేశారు.

2012 డిసెంబర్లో 28న తిరుపతిలో ప్రపంచ మహాసభల సందర్భంగా **"తొలి తెలుగు గజల్ ముషాయిరా"** జరిగింది. తెలుగు గజల్ పై వచ్చిన తొలి పరిశోధన **"తెలుగులో గజల్ ప్రక్రియ– సమగ్ర పరిశీలన"** 2001 లో పిహెచ్.డి అవార్డు పొందింది. ఆచార్య తంగెడ కిషన్ రావు గారి పర్యవేక్షణలో ఉస్మానియా తెలుగు శాఖలో డా.పత్తిపాక మోహన్ ఈ పరిశోధన చేసారు.

ఇలా ఐదున్నర దశాబ్దాల క్రితం తెలుగులోకి అడుగుపెట్టిన ఈ కవితా ప్రక్రియలో ప్రస్తుతం వందలమంది కవులు తమ రచనా

కళని ప్రదర్శిస్తున్నారు. ఆ కళ కేవలం కాగితానికో, గాత్రానికో పరిమితం కాకుండా ఆధునికతను సంతరించుకుంది. అందరికీ అందుబాటులో ఉండేందుకు, అందరి మనస్సును కూర్చున్నచోట నుండే తనవైపు ఆకర్షించేందుకు సామాజిక వేదికను అలంకరించింది.

సామాజిక వేదికలకు ఆధారభూతమైన సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా అభివృద్ధి చెందింది అంటే అరచేతుల్లో ప్రపంచంగా మారిపోయింది. ప్రపంచంలోని ఏ మూలన ఏం జరిగినా కొన్ని క్షణాల్లోనే ప్రపంచమంతా తెలిసిపోయేలా చేసే సత్వర సమాచార ప్రసార సాధనాలే సామాజిక మాధ్యమాలు. విద్య, వినోదం, రాజకీయం, వైద్యం, సంస్కృతి, సాహిత్యం ఇలా ప్రతిదీ మనం మాధ్యమాల ద్వారా తెలుసుకుంటున్నాం. ఆర్కుట్, ఫేస్ బుక్, బ్లాగులు, యూట్యూబ్, గూగుల్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వంటివి కొన్ని సామాజిక మాధ్యమాలకు ఉదాహరణలు. ఆధునిక సమాచార, సాంకేతిక విప్లవాల ప్రభావంతో సామాజిక మాధ్యమాలలో ఊహించని మార్పు సంభవించింది. సాధారణంగా సామాజిక మాధ్యమాలలో మునిగి యువత తమ అమూల్యమైన సమయాన్ని వృథాగా గడుపుతున్నారు. ఇది కొంత మేరకు నిజం. అయితే ఇవే మాధ్యమాలు జనజాగృతికి, అవగాహనా వ్యాప్తికి, నిరసనకారుల సమీకరణకు, ఉద్యమాల నిర్వహణకు, అన్యాయాలను ఎదుర్కొని ప్రశ్నించడానికి ఆయుధాలుగా ఉపయోగపడతాయి. అటువంటి సామాజిక మాధ్యమాలు సమాజానికి ప్రతిబింబం అయిన సాహితీ విహంగ వీక్షణానికి వినూత్నరీతిలో ప్రధాన ఆకరాలు అవుతున్నాయి అనేది నిర్వివాదాంశం. సామాజిక మాధ్యమాలు సాహిత్యాభివృద్ధిలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఒకప్పుడు సాహిత్యం అనేది ప్రజలకు చేరడానికి ఎంతో సమయం పట్టేది. కానీ నేడు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి వలన సాహిత్యం ప్రజలందరికీ కొన్ని క్షణాల్లోనే చేరిపోతుంది. కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచం స్తంభించి పోయింది. ఆ 12 నెలల కాలంలో సామాజిక మాధ్యమాలు సాహిత్య వ్యాప్తికి ఎంతో దోహదపడ్డాయి. కరోనా కారణంగా ప్రజలు పడుతున్న బాధలను కష్టాలను కవితల రూపంలో, పాటల రూపంలో ప్రజల యొక్క పరిస్థితులను ప్రతిబింబించేలా రచనలు చేసారు. వార్తాపత్రికల ద్వారా, వాట్సాప్ గ్రూప్ ద్వారా, టెలివిజన్, రేడియో, యూట్యూబ్ మాధ్యమాల ద్వారా పాఠకుల మరియు శ్రోతల హృదయాలను కదిలేలా రచనలు చేశారు. ఎంతోమంది యువత మాధ్యమాల ద్వారా సాహిత్యం పట్ల స్ఫూర్తిని పొందారు. నూతన కవులు, రచయితలు ప్రపంచానికి పరిచయం అయ్యేలా చేసాయి మాధ్యమాలు.

అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో ఇప్పటికే కాగితం వాడకాన్ని చాలావరకు తగ్గిస్తున్నారు. ఇకముందు పుస్తక ముద్రణ ఉండబోదేమో అనే సందేహమూ కలగక మానదు. ఒకవేళ ఉన్నా చాలా తక్కువగా వాటి ప్రభావం ఉంటుంది. అలాంటి సందర్భాలలో సాహిత్య వ్యాప్తికి అభివృద్ధికి సామాజిక మాధ్యమాల వారధులుగా నిలుస్తాయి. సామాజిక మాధ్యమాలు లేని సమయంలో ఎంతోమంది కవులు వారి రచనలు ప్రపంచానికి పరిచయం కాకుండానే కనుమరుగయ్యారు అనేది వాస్తవం. కానీ నేడు అలాంటి పరిస్థితులు లేవు. నేటి సామాజిక మాధ్యమాలలో ఒక్క శక్తివంతమైన వాక్యం రాసినా అతనిని సాహిత్య లోకానికి పరిచయం చేస్తుంది. అప్పటివరకు అపరిచిత వ్యక్తిగా ఉన్న అతను ప్రజలందరికీ సుపరిచితుడుగా మారిపోతాడు. ఇదే సామాజిక మాధ్యమాలకు ఉన్న శక్తి.

మరుగున పడే పరిస్థితి సాహిత్యానికి రాకుండా మాధ్యమాలు కీలకపాత్ర పోషించాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఒక కవి చేసిన రచన ద్వారా అతని ఉద్దేశ్యం ప్రజలకు చేరాలి. అది సామాజిక మాధ్యమాల ద్వారా చురుకుగా అందుతుంది. పాఠకులు ఆ కవి ఉద్దేశ్యాన్ని తిరస్కరించడం లేదా ఆమోదించడం జరుగుతుంది. ప్రజల యొక్క స్పందనను కవి కూడా తెలుసుకునే అవకాశం మాధ్యమాల ద్వారా సులభంగా జరుగుతుంది. అదే కవి తన రచనలను కేవలం పుస్తక ముద్రణకే పరిమితం చేస్తే, ఆ కవి ప్రజల స్పందనను తెలుసుకోలేడు. మాధ్యమాలలో ప్రసారమయ్యే సమాచారం ఎప్పటికైనా, ఎంతకాలమైనా నిలిచి ఉంటుంది. ఒకప్పటి కవులు చేసిన రచనలు మనకు, మన ముందు తరాలకు అందుబాటులో ఉండేలా దోహదం చేసేవి ఈ సామాజిక మాధ్యమాలు మాత్రమే.

సామాజిక మాధ్యమాల వేదికనెక్కిన గజల్ తన గొంతును గట్టిగానే వినిపించింది. జనం జీవితంలోకి అంతర్జాలం ప్రవేశించాక, సాహిత్యం అంతర్జాలంలోను చోటుచేసుకున్నాక తెలుగు గజల్ కూడా అంతర్జాలంలోకి వచ్చింది. 2002లో “వెబ్ ప్రపంచం.కాం” అనే అంతర్జాల పత్రికలో రాసిన గజల్ అంతర్జాలంలో వచ్చిన ‘తొలి తెలుగు గజల్’ గా నమోదయింది. **“నవ్వుతూ నువ్వు ఉండిపోతే నాకు తోడయ్యి ఓ ప్రియా! ఉండిపోదా సౌఖ్యమతా నాకు ప్రేమయి ఓ ప్రియా!”** అంటూ చిరునవ్వుతో అంతర్జాలన్ని పలకరించింది.

**ఫేస్ బుక్ :** ఫేస్ బుక్ ను 2004లో ప్రారంభించారు. ఇది ప్రతి ఒక్క సామాన్యుడికి తెలిసిన సామాజిక మాధ్యమం ఇందులో వ్యక్తిగత విషయాలు మిత్రులతో పంచుకోవచ్చు. ఫోటోలు, వీడియోలు, సమాచారాన్ని ఇతరులతో పంచుకోవచ్చు. మన ఆలోచనలను, సలహాలను, అభిప్రాయాలను ఇతరులకు తెలియజేయవచ్చు. ఒక గ్రూపుగా ఏర్పడి చర్చలు సమావేశాలు నిర్వహించవచ్చు. దాదాపు 460 కోట్లమంది దీనిని ఉపయోగిస్తున్నారు. “కువైట్ యన్ ఆర్ ఐ” అనే ఫేస్‌బుక్ పేజీని మన విదేశీ భారతీయులు కలసి ఏర్పాటుచేశారు. ఎల్లలు దాటినా మన మాతృభాషకి ప్రాధాన్యం ఇస్తూ తెలుగులో గజళ్ళను రాయడం అనేది తెలుగువారందరం గర్వించాల్సిన విషయం.

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 (47) హైదరాబాద్ ఏప్రిల్ : 2024

ఫేస్‌బుక్ మాధ్యమంలో **"గజల్ లోగిలి"** పేరుతో ఒక బృందం తెలుగు గజళ్ళ కోసం మొదలైంది. ఇదే మాధ్యమంలో **"గజల్ సాహిత్యవేదిక"** పేరిట ఒక పేజీని / గ్రూపుని ఏర్పరిచి, దాదాపు 240 మంది సభ్యులు ఒక బృందంగా ఏర్పడినారు. వారిలో ఉన్న కవిని మేల్కొలిపి అనేక గజళ్ళను రచించారు. ఇప్పటివరకు ఈ పేజిలో 230 గజళ్ళు పోస్ట్ చేయబడ్డాయి. అందులో ఒకటి

**"అక్షరాలలో ముత్యాలు.....మెరియునట్టి భాష తెలుగు**
**పదాలలో తేనియలు..... కురియునట్టి భాష తెలుగు**
**...........................................................**
**పద్యము అవధానము..... ఏ భాషా సాహిత్యమున లేవు**
**ఓ దేవా ఈ రెండు వరాలను......పొందినట్టి భాష తెలుగు."**
–బూర దేవానందం

అంతేకాకుండా వీరు **"గజల్ ముషాయిరా"** అనే కార్యక్రమం పేరిట జూమ్ మీటింగులు ఏర్పాటు చేశారు. తెలుగులోని గజళ్ళను, తెలుగు గజల్ కవులను, గాయకులను సాహితీప్రియులకు పరిచయం చేయడానికి గజల్ సాహిత్య గౌరవాన్ని పెంచడానికి వీరు "హైదరాబాద్ బుక్ ఫేయిర్" లో తెలుగు గజల్ సాహిత్యానికి తొలిసారిగా ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం. ఇరివింటి శర్మ ఇందులో ప్రధానపాత్ర వహించారు. గడ్డం శ్యామల తదితరులు ముందు నిలిచారు.

తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో **"నెల నెలా తెలుగు వెలుగు"** కార్యక్రమం పేరిట **"తెలుగు సాహిత్యంలో గజళ్ళ స్థానం"** అనే శీర్షికతో ప్రతి నెల ఆఖరి ఆదివారం అంతర్జాతీయ దృశ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి సాహిత్య వేదిక సభ్యులు పాలుపంచుకోవడం అభినందించదగిన విషయం.

"పచ్చదనాన్ని ప్రాణవాయువును బహుమతిగా నీకిస్తే నేస్తం
ఎరుగని పచ్చని బ్రతుకుల్లో నిప్పులు పోసావు నేస్తం
...........................................................
**కూలిన ఈ దేహం నుండి గూడును కట్టే కలపను ఇచ్చామే**
**నీ ఆఖరి మజిలీ దాకను నేవస్తే దహనం చేశావు నేస్తం**
**తరువులమైనను గాని 'మూర్తీ' పరువుగా మేము జగతిని బ్రతికామే**
**ఊరికి ఉపకారులమే మేము ఉసురులు ఎలా తీశావు నేస్తం!**
– పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి

కొమర్రాజు ఫౌండేషన్ అనే సాహిత్య సామాజిక సాంస్కృతిక సంస్థ గడ్డం శ్యామల ఆధ్వర్యంలో **"డాక్టర్ సినారె గజల్ అవార్డుల"** ప్రదానోత్సవాన్ని గూగుల్ మీటింగ్ వేదికగా నిర్వహించి అవార్డులను ప్రదానం చేసారు.

**"కన్నులు కలుపుతూ మనసు తడిపితే ఎలా ఎలా**
**నదిగా పొంగుతూ మదినే కుదిరితే ఎలా ఎలా**
**చూపుల గాలం విసిరిన వైనం ఓహో**
**ఊపిరి దారం నిన్నే ఊపితే ఎలా ఎలా"**–కందిబండ విజయలక్ష్మి




మరో ఫేస్ బుక్ బృందం **"తెలుగు గజల్ ఘుమ ఘుమలు"** పేరిట దాదాపు 238 మంది ఒక టీమ్‌గా ఏర్పడి గజల్ పోటీలను నిర్వహిస్తున్నారు. దీన్ని గత ఐదు సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. అందులో ఒక కవి పాప గురించి రాసిన గజల్ –

**"ఆడపిల్ల పుడితే చాలు మరో అమ్మ పుట్టినట్టే!**
**అవనిపైన ఈ సృష్టికి మరో జన్మ వచ్చినట్టే!**
**.............................................**
**బుట్ట గౌను పాపాయికి అలక నువ్వు తీరిస్తే**
**ఒక్కసారి నవ్వేనంటే పూలకొమ్మ ఊగినట్టే!–**
సుబ్రహ్మణ్యశర్మ

**యూట్యూబు :** పసికందులు అన్నం తినాలన్నా, ఏడుపు మాన్పించాలన్నా తల్లిదండ్రులు ఆయుధంగా ఉపయోగించే మాధ్యమం యూట్యూబ్. ఇందులో చిన్నపిల్లల గేయాల నుండి ఎన్నో రకాల వీడియోలు ఇందులో ఉంటాయి. సామాజిక అంశాలు, రాజకీయ అంశాలు, విద్యాపరమైన అంశాలు ఇలా ప్రతి ఒక్క విషయం పై ఇతరులకు మనం తెలియజేయవచ్చు. దీనివల్ల సంపాదన కూడా పొందవచ్చు. ఈ రోజుల్లో యూట్యూబ్ లేకుండా ఏ ఒక్క సెల్ ఫోన్ కూడా ఉండటం లేదు. కొన్ని కోట్లమంది దీన్ని వినియోగిస్తున్నారు. యూట్యూబ్‌లో ప్రముఖ కవులు రాసిన గజళ్ళు అందుబాటులో ఉన్నాయి. సినారె రాసిన వివిధ చిత్రాలలోని గజళ్ళు కూడా ఉన్నాయి.

**బ్లాగులు : "తెలుగు గజల్.వర్డ్ ప్రెస్.కాం"** అనే బ్లాగ్‌ను గూగుల్ ద్వారా కొందరు గజల్ ప్రేమికులు ఏర్పాటు చేశారు. ఈ బ్లాగులను వారు గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. తెలుగులో గజళ్ళ కవిత్వాన్ని ప్రోత్సహించడానికి, గజల్ కవితా ప్రక్రియ గురించి అవగాహన పెంచడానికి, తెలుగులో గజల్ కవితలపై చర్చా వేదికగా ఈ బ్లాగ్ ఏర్పడింది. తెలుగు గజల్ రచయితల గజళ్ళను అందుబాటులో ఉంచడానికి ఏర్పడిన బ్లాగ్. వివిధ కవులు వారి యొక్క గజల్ ఈ బ్లాగులో పోస్ట్ చేయడం ద్వారా లేదా వారు రాసిన గజల్ ఆడియో లేదా వీడియో రూపంలో అందరితో పంచుకోవడం జరుగుతుంది. సందర్భాన్ని బట్టి అంశాన్ని ఎంపిక చేసి ఆ అంశంపై గజళ్ళ పోటీని నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. ఇటువంటి ఆరోగ్యకరమైన పోటీ ఎంతోమంది కవుల మధ్య జరుగుతూ వారిలోని కవి హృదయాన్ని, సృజనాత్మకతను మేల్కొల్పడం చాలా ఆనందించదగిన విషయం. ఈ బ్లాగులో పోస్ట్ అయిన వాటినుండి రెండు గజళ్ళు

**"చదువుల కోసం పరుగులు తీసే బాల్యం చూడు..!**
**పంటల కోసం రైతులు చేసే సేద్యం చూడు..!**
**ఏమని చెప్పుదు వేమన ఎవరో తెలియని వారికి...**
**తియ్యగ చరిత్ర పుటలను మూల్గే పద్యం చూడు..!**
-మాధవరావు కొరుప్రోలు

**"నమ్మకమన్నది లేకుంటే మన బ్రతుకు వృథా**
**నమ్మే ఒకమనసుంటే మన బతుకే ఒక కళ**
**...............................................**
**నిరాశతో అడిగేస్తే ఎప్పటికీ అపజయమే**
**జయమనే విశ్వాసంతో సాగడమే ఒక కళ"** -భారతి కాట్రగడ్డ

**మాలిక :** తెలుగు బ్లాగుల సంకలిని మరియు తెలుగు బ్లాగర్ల వేదిక" అనే బ్లాగ్‌లో తెలుగు గజల్ ప్రచురించబడింది.

**"అభిలాషను అందుకునే కవితేమో దొరకలేదు**
**ఎద బాసను పంచుకునే చెలిమేమో మనకు లేదు**
**...............................................**
**వాలుతున్న "సంధ్య"లలో మందారం పడమర లో**
**విరాజిల్లే నీవులేక దివికేమో శోభ లేదు"** – సంధ్య సి.హెచ్.

**"అంతర్లోచన.వర్డ్ ప్రెస్.కామ్"** అనే బ్లాగ్లో **"తెలుగులో గజల్ సాహిత్యం"** అనే శీర్షికతో గజల్ యొక్క చరిత్ర, దాని నియమాలు, గజల్ కవుల గురించి ఈ బ్లాగులో వివరించడం జరిగింది.

**వాట్సాప్ : "తెలుగు గజళ్ళు-రుబాయిలు", "గజల్ సాహిత్య వేదిక"** అనే వాట్సాప్ గ్రూప్ లు కూడా తెలుగులో గజళ్ళ అభివృద్ధికి దోహదపడుతున్నాయి.

**ట్విట్టర్ :** ప్రముఖ కవి గజల్ శ్రీనివాస్ ట్విట్టర్‌లో తన ఖాతా ద్వారా ఎన్నో గజళ్ళను ట్వీట్ చేశారు. సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా గజల్‌లను రాస్తూ అందరిని గజళ్ళ వైపు ఆకర్షింప జేస్తున్నారు. గజల్‌లు అంటే ఏమిటో తెలియని ఎంతోమందికి ఇలాంటి బ్లాగులు, పేజీలు, వాట్సాప్ గ్రూపులు, జూమ్ మీటింగ్‌లు నూతన కవులను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఎంతో దోహదపడుతున్నాయి. తెలుగు సాహిత్యాన్ని ఉన్నతంగా నిలబెట్టడంలో తనదైన పాత్రను పోషిస్తున్న గజల్ దాశరథి, సినారె లాంటి వారి చేతిలో కవితాత్మకతను సంతరించుకుని సత్యాన్ని సగర్వంగా సమాజానికి పంచేలా చేసింది. మనసులోని అంతర్మథనాన్ని కవిత్వీకరించి ప్రకటించాలనుకునే కవులకు గజల్ ఒక భావప్రకటనా మార్గం లాంటిది.

గజల్ సాహితీప్రక్రియా వ్యాప్తికి సామాజిక మాధ్యమాలు క్రియాశీలక పాత్రను పోషిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ఇది ఒక శుభ పరిణామం కూడా! ఇప్పటికీ వందలాది మంది గజల్ కవులు ఇందులో ప్రతిరోజు రాస్తున్నారు. కొత్తతరం గజల్ వైపు ఆకర్షితులై రాయడం నిజంగా శుభ పరిణామమని, అయితే ఉర్దూ గజల్ లక్షణాలు పాటించినపుడు అది పండుతుందని పత్తిపాకమోహన్ అభిప్రాయం. అన్ని మాధ్యమాల్లో, పత్రికల్లో గజల్ ఆ దిశగా రావాలని కోరుకుందాం.

**సంప్రదింపు గ్రంథాలు :**


1. తెలుగులో గజల్ ప్రక్రియ-సమగ్రపరిశీలన,డా. పత్తిపాక మోహన్, అముద్రిత పిహెచ్. డి. సిద్ధాంత వ్యాసం,2001,తెలుగుశాఖ,ఉస్మానియా విశ్వవిద్యాలయం.
2. తెలుగు గజల్ (మోనోగ్రాఫ్)... డా. పెన్నా శివరామకృష్ణ, తెలుగు అకాడెమీ, 2017, ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ.
3. తెలుగు సినీ గీతాలలో సాహితీ మూల్యాలు (అముద్రితసిద్ధాంత వ్యాసం), డాక్టర్ టి గౌరీ శంకర్, 1984 ఉస్మానియా విశ్వవిద్యాలయం.
4. తెలుగు కవిత లయాత్మకత, డాక్టర్ సి నారాయణ రెడ్డి, యువభారతి, 1995. ఆంధ్రసారస్వతపరిషత్ హైదరాబాద్
5. https://www.facebook.com/telugu.ghazal?mibextid=ZbWKwL
6. https://telugughazal.wordpress.com/




ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 హైదరాబాద్ ఏప్రిల్ : 2024


# శ్రీ వేంకటాధ్వరి 'విశ్వగుణాదర్శ చంపూ' – వర్ణనలు

సాగి తేజశ్రీ, ఫోన్ : 80082 80140




**"విశ్వగుణాదర్శ చంపూ"** అనే చంపూకావ్యం సంస్కృత సాహిత్యంలో వెలువడిన విలక్షణమైన కావ్యం. నాణానికి రెండు వైపులున్నట్లే ప్రతీ విషయాన్ని రెండు రకాలుగా చూడవచ్చని తెలియచెప్పే కావ్యమిది. ఈ కావ్యాన్ని సంస్కృతకవి శ్రీ వేంకటాధ్వరి రచించారు. ఈయన గురించి ఎక్కువగా ఎక్కడా తెలియరావడంలేదు. కానీ ఈ చంపూ కావ్యం పరిచయ శ్లోకాల్లో స్వయంగా తనగురించి కొంత చెప్పుకున్నారు కావ్యకర్త.

**"కాంచీ మండల మండనస్య మఖిన: కర్నాటభూభృద్గురో**
**స్తాతార్యస్య దిగంతకాంత యశసే యం భాగినేయం విదు:**
**అస్తోకాధ్వర కర్తురప్పయ గురోరస్యై విద్వన్మణో: ।**
**పుత్ర: శ్రీ రఘునాథ దీక్షిత కవి: పూర్ణో గుణైరేధతా ॥**
**తత్సుత స్తర్క వేదాంత తంత్ర వ్యాకృతి చింతక:**
**వ్యక్తం విశ్వగుణాదర్శం విద్యతే వేంకటాధ్వరీ॥**

శ్రీ వేంకటాధ్వర కాంచీపురం సమీపంలోని అరసానిపాలైలో జన్మించారు. ఈయన శ్రీవైష్ణవ కుటుంబంలో పుట్టి, రామానుజ సంప్రదాయానికి చెందిన గొప్ప దార్శనిక పండితుడు. వేంకటాధ్వరి ఈ శ్లోకాలలో తన పూర్వీకుల గురించి చెప్పుకున్నారు. కర్ణాట భూమిని పాలిస్తున్న కృష్ణరాయ యొక్క గురువు తాతాచార్యుల మేనల్లుడు, విద్వన్మణి అయిన అప్పయదీక్షితులు. అప్పయదీక్షితుల కుమారుడ మహాపండితుడైన రఘునాథ దీక్షితులు. ఇతని కుమారుడు తర్కం, వేదాంతం, తంత్రం మీమాంస, వ్యాకరణాల్లో పూర్తి జ్ఞానం ఉన్న శ్రీ వేంకటాధ్వరి. వీరి తల్లి సీతాంబ. వేంకటాధ్వరి నీలకంఠ దీక్షితుల సమకాలికుడుగా చెప్తారు. కాబట్టి ఈయన కాలం క్రీ.శ. 17వ శతాబ్దిగా పండితులు నిర్ణయించారు.



శ్రీ వేంకటాధ్వరి మొత్తం 14 కృతులను రచించినట్లు తెలుస్తుంది. వాటిలో శ్రీ రాఘవ యాదవీయం, లక్ష్మీ సహస్రం, విశ్వగుణాదర్శ చంపూ అనేవి లభిస్తున్నాయి. ఇంకా హస్తగిరి చంపూ, యాదవ పాండవీయం, సుభాషిత కౌస్తుభ అనే గ్రంథాలను కూడా రచించినట్లు తెలుస్తుంది. వీరు రచించిన శ్రీ రాఘవ యాదవీయం విలోమ కావ్యం. దీన్ని 30 శ్లోకాల్లో రచించారు. ఇందులోని శ్లోకాలను ముందునుండి చదివితే రామాయణ కథ, వెనకనుండి చదివితే శ్రీకృష్ణుని పారిజాతాపహరణ కథ అవగతమౌతుంది. అనులోమ విలోమ పద్ధతిలో రాయబడిన ఈ కావ్యం వీరి పాండిత్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.




రాఘవ యాదవీయం రచించిన తర్వాత వీరి చూపు మందగించి అంధుడయ్యాడని, తర్వాత లక్ష్మీదేవిని స్తుతిస్తూ లక్ష్మీ సహస్రం చెప్పిన తర్వాత తిరిగి చూపు వచ్చిందని చెప్తారు. ఇట్లా ఎన్నో అద్భుత రచనలు చేశారు వేంకటాధ్వరి.

వీరు రచించిన 'విశ్వగుణాదర్శ చంపూ' అనేది చంపూకావ్యం. చంపూకావ్యమంటే గద్యం మరియు పద్యం యొక్క మిశ్రమం. "చంపయతి యోజయతి ఇతి చంపూ' అనే వ్యుత్పత్తి అర్థం ఉంది. 'గద్యపద్యమయీ కావ్యం చంపూరిత్యభిధీయతే' అనేది చంపూకావ్య లక్షణం. విశ్వగుణాదర్శ చంపూ కావ్యంలో విషయానికి అంత ప్రాధాన్యత ఉండదు. బాహ్య సౌందర్యానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. స్వతంత్ర కల్పనలు అధికంగా ఉన్నాయి.

ఈ కావ్యంలో కృశాను, విశ్వావసు అనే ఇద్దరు గంధర్వులు విశ్వం యొక్క గుణాలను వివరిస్తుంటారు. అందుకే ఈ కావ్యానికి 'విశ్వగుణాదర్శ చంపూ' అనే పేరు పెట్టారు. ఇందులో గంధర్వులిద్దరూ కలిసి విమానంలో తిరుగుతూ అనేక దేశాలు, నదులు, నగరాలు, పవిత్ర స్థలాలు, మార్గాలు, ప్రజల ఆవాసాలు, వారి ప్రవర్తన, జీవన విధానం, మానసిక స్థితిగతులను వివరిస్తూ ప్రతి విషయాన్ని రెండు కోణాల్లో చూపించారు. ఈ కావ్యం ఎక్కువభాగం పద్యరూపంలో ఉంది. ఇందులో ఒక్కో ప్రదేశం ఒక్కో వర్ణన, ఒక్కో విభాగంగా విభజించబడింది.

ఈ చంపూకావ్యంలో 30 ప్రదేశాలు, ప్రజల గురించి వర్ణన చేయబడింది. మొదటగా సూర్య వర్ణనంతో మొదలుపెట్టి వరుసగా భూలోక వర్ణనం, బదరికాశ్రమం, అయోధ్యా నగరం, గంగానదీ, కాశీ, సముద్రం, జగన్నాథక్షేత్రం, గుర్జర దేశం, యమునా నదీ, మహారాష్ట్ర, ఆంధ్రదేశం, కర్ణాటక, వేంకటగిరి, వన వర్ణనం, ఘటికాచలం, వీక్షారణ్యం, శ్రీరామానుజ వర్ణనం, చెన్నపట్టణం (మద్రాస్), కాంచీ వర్ణనం, శ్రీమద్వేదాంత దేశికాచార్య వర్ణనం, కామాసికా నగర నృసింహ వర్ణనం, శ్రీ త్రివిక్రమ వర్ణనం, శ్రీ కామాక్షీదేవి, శ్రీమత్ కామేశ్వర వర్ణనం, క్షీరనదీ వర్ణనం, బాహానదీ, తుండీర మండం, చించీపురీ (తంజావూరు), పినాకినీ గరుడ శ్రీ దేవనాయక వర్ణనం చేయబడినవి.

ఈ కావ్యంలో ప్రదేశాలను వర్ణించే కృశాను, విశ్వావసు అనే గంధర్వులలో కృశాను అన్ని విషయాల్లో, ప్రదేశాల్లో, ప్రజల్లో తప్పులు వెతకడం, వాటిని హేళన చేయడం, దీనిలో ఏం గొప్ప ఉంది అని తక్కువ చేసి మాట్లాడేవాడు. కానీ విశ్వావసు కృశానుకు పూర్తిగా వ్యతిరేకం. అతను అన్నింటిలోను మంచిని చూస్తూ అనుకూలంగా మాట్లాడేవాడు. కృశాను చెప్పేవాటికి వ్యతిరేకంగా సమాధానమిచ్చేవాడు. కొన్ని విషయాలో అతనితో అంగీకరించినా చాలావరకు నిజాలు చెప్పి వివరించేవాడు ఉదాహరణకు-

## భూలోక వర్ణనం

గంధర్వులిద్దరూ (కృశాను, విశ్వావసు) సంచరిస్తూ భూలోకానికి వస్తారు. అప్పుడు విశ్వావసు **"మిత్రమా! అన్ని పురుషార్థాలకు అనుష్ఠాన సాధనమైన భూలోకాన్ని చూడు. ఇక్కడ నివసించే పురుషులు నిర్వహించే యజ్ఞాల వల్ల ఉత్పన్నమైన మధుర అమృతం దేవతలచే స్వీకరించబడుతుంది. వేదాల్లో చెప్పబడిన కళ్యాణ పురుషులు, దివ్యాశ్రమాలు, నదులతో కూడుకున్న భూదేవికి నేను నమస్కరిస్తున్నాను"** అంటాడు. వెంటనే కృశాను **"స్వర్గానికి వచ్చి కూడా భూలోకానికి నమస్కరించకు. ఎందుకంటే భూలోకంలో అందరూ జనన మరణ, మానసిక బాధలు, వ్యాథులు ఇంకా దుష్కర్మలతో లినంగా ఉంటారు. నీచ, అహంకారం కలిగి ఉన్న రాజులు పాలించే ధరిత్రిని స్వర్గంలో నివసించే ఏ బుద్ధిగల పురుషుడు కావాలని కోరుకుంటాడు? బాల్యం నుండి యవ్వనం, వృద్ధాప్యం, వృద్ధాప్యంలో మరనించి యమదూతల పాశానికి గురై అనేక రకాల పీడలు అనుభవిస్తారు. ఇన్ని కష్టాలతో కూడుకున్న జీవితం ఎవరికి సుఖంగా ఉంటుంది. ఏదైనా గ్రామంలో ఎద్దుకి నాగలి నాగడం నుండి విముక్తి ఉంటుందా?"** అన్నాడు.

అప్పుడు విశ్వావసు "ఇది కూడా సరైనదే. అయినా మిత్రమా భూమిపై మానవ జన్మ దోషం అనకు. భూమిపై రావణ సంహారం చేసి కళ్యాణం చేకూర్చిన రాముడు మనుజుడే. దేవతాయుద్ధాలలో ఇంద్రునికి సహాయం చేసిన రాముని తండ్రి కూడా మానవుడే. నరరూపంలో ఇంద్రుని గర్వాన్ని అణచిన శ్రీకృష్ణుని గూర్చి వినలేదా? మనుషులు లేకుండా ఏ దేవుడూ లేదా దానవుడు ఉన్నతిని పొందారు? మాంధాత, సగరుడు, పురు, పురూరవుడు, శిబి, జనకుడు, నహుషుడు, యయాతి నలుడు, అర్జునుడు ఇలా చెప్తూ పోతే ఎంతోమంది ఉన్నారని అంటాడు. దానికి కృశాను ఇలా గుణవంతులు, పరాక్రమవంతులు కొంతమంది వేరే యుగాల్లో ఉన్నారు కానీ కలియుగంలో అటువంటి లక్షణాలు ఉన్నవారు ఒక్కరు కూడా లేరు. కామంతో, కలుషిత హృదయంతో, కోపంతో, విచక్షణ లేకుండా అహంకారంతో ఉంటారు. ఇక పూర్వజన్మ పాపాల వల్ల రాజులుగా మారినవారి ముఖాలు చూడడం కూడా దోషమే" అని అన్నాడు. విశ్వావసు దానికి సమాధానంగా "దీనికి కూడా నీవు మనుష్యులకు దోషం అంటగట్టడం సరికాదు. ఎందుకంటే అన్ని యుగాల్లోనూ మంచివారు ఉంటారు. పాపాలు కూడి ఉన్న రాజులు కూడా ఉంటారు. వారే కమల నయనుడి స్వేచ్ఛా విహారం కోసం మందిరాలు నిర్మించాడ. వేదమార్గాలను రక్షించడానికి పుట్టినవారిలో కలియుగంలో కూడా చాలామంది ఉన్నారు. ఒకవేళ నీకు నా మాటలపై నమ్మకం లేకపోతే మనం స్వయంగా ఆ పుణ్యక్షేత్రాలకు వెళ్ళి దర్శించుకొని వద్దామంటాడు. వెంటనే వారిరువురు భూలోక పర్యటనను మొదలుపెడతారు.

## బదరికాశ్రమ వర్ణనం

విమానంలో వెళ్తూ విశ్వావసు, కృశానుడికి తన వేలితో ప్రదేశాలను చూపిస్తూ "ఇది బదరీకాశ్రమం. ఇక్కడ తమ అజ్ఞానాన్ని దూరం చేసుకోవాలని చాలామంది నారాయణుడి కొరకు తపస్సు చేస్తారు. ఇక్కడ నివాసముండే ప్రజలు ప్రకాశవవంతమైన బుద్ధిని కలిగి, దుష్టహర్తా, శిష్టకర్తా అయిన నారాయణుడిని పగలు రాత్రి పూజిస్తారు" అని చెప్తుంటే మధ్యలోనే కృశాను "మిత్రమా ఈ గుణాల వివరణ, వాటి సమర్థన నాకు నచ్చలేదు. ఎందుకంటే స్నానం చేయడానికి భయపడే మనుషులు నిర్మలమైన కర్మలు ఎలా చేయగలుగుతారు"

అని అంటాడు. దానికి విశ్వావసు 'నీవు చెప్పిన మాటలతో నేను ఏకీభవిస్తున్నా. చాలా మంచు ఉండడం వల్ల శాంతియుతులు, జ్ఞానులు మాత్రమే ఇక్కడికి ఎక్కువగా వస్తారు. ఇక్కడ స్నానం చేయడం వల్ల రోగగ్రస్థులు కూడా నారాయణుని అనుగ్రహం వల్ల తమ రోగాలనుండి విముక్తి పొందుతారు.

## గంగానది వర్ణనం

ఆవిధంగా వారు తిరుగుతూ గంగానది దగ్గరకు వెళ్తారు. నదిని చూపిస్తూ విశ్వావసు "సంసారంలో ఉండే దు:ఖాలను నాశనం చేసేది, విష్ణు చరణాలను అలంకరించేది, విపత్తులను నివారించేది స్వచ్ఛమైన అలలు కలిగినది, విశాలమైన సముద్రానికి తోడు కలది, సర్వ పాపాలను తొలగింపచేసే ఈ గంగానదిని చూడు" అని అంటాడు. కృశాను "గంగానది జలం నిర్లక్ష్యం చేయదగినవి అంటారు. నీవు ఎందుకు వాటిని చూడమంటున్నావు? హిరణ్యకశిపుని ప్రాణాలను హరించిన విష్ణువు చరణాల నుండి వచ్చిన గంగ బ్రహ్మదేవుని యొక్క శిరస్సును ఖండించిన శివుని తలపై ఉన్న చంద్రుని సహవాసి అయి సముద్రంలో కలిసి పోతుంది. దీన్ని నీవు కీర్తి అంటున్నావా? అని అన్నాడు.

విశ్వావసు ''శాంతించు!'' ఆవిధమైన మాటలు పాపం కలిగిస్తాయి! విష్ణుచరణాలనుండి వచ్చే గంగ శివుని స్పర్శించి పవిత్రమై, సగరుని వారసులకు మోక్షప్రాప్తిని అందించింది. దీనికంటే పవిత్రమైంది వేరొకటి లేదు. అటువంటి గంగను నీవు నిందిస్తావా? సరస్వతీ నదిచే ఆలింగనం చేయబడిన, సూర్యపుత్రి అయిన యమునకు తోడుగా ప్రవహించే గంగ సత్త్వ రజస్తమో గుణాలను కలిగిన ప్రకృతి వలె కనిపిస్తుంది. అన్ని దోషాలను దూరంచేసే సామర్థ్యం కలిగిన గంగానది విశాలమైన ప్రపంచాన్ని శాంతపరుస్తుంది' అని చెప్పి నమస్కరిస్తాడు.

## సముద్ర వర్ణనం

అట్లా విమానంలో ప్రయాణం చేస్తుండగా దూరం నుండి చేతులు జోడిస్తూ విశ్వావసు "లోక వినాశనం వలన, ఇంద్రుని వజ్రాయుధం వల్ల భయభీతుడైన మైనాకుని ప్రాణాలను రక్షించినవాడు, స్థిరమైన కీర్తి కలవాడు, నృత్యం చేస్తున్నట్టుగా ఉండే అలలు కలిగినవాడు, పూజ్యనీయుడైన మహాసముద్రునికి నా నమస్కారాలు" అని అన్నాడు. అది చూసి నవ్వుతూ కృశాను "అజ్ఞానులైనవారు కూడా తాగడానికి అనర్హుడైనవాడు, నీళ్ళలో నివసించే జీవులకు ఆశ్రయుడైన సముద్రునికి కూడా నాచేత నమస్కారం చేయించాలనుకుంటున్నావా? ఎందుకిలా చేస్తున్నావు? నాకైతే కఠోరమైన గర్జన చేసే సముద్రుడ్ని చూస్తే కోపం వస్తుంది. మహాజలరాశిని కలిగి ఉన్నవాడు, జఠరాగ్ని వలె తనలో బడబానలాన్ని దాచుకునేవాడు, ఎప్పుడూ గర్జిస్తూ




అహంకారం కలిగిన సముద్రుడిని చూస్తే క్రోధం కలుగుతుంది. రత్నాలవంటి సంపద కలిగి ఉన్నా, అత్యంత లోభి అవ్వడం వల్ల బుద్ధిమంతుల ఆదరణ పొందలేకపోయాడు. ఈ సముద్రంలో రత్నాలు, బంగారం కోకొల్లలుగా దొరుకుతాయి. నావలతో నిండి ఉన్నా వాటి వల్ల ఉపాధిని పొందలేము. నా దృష్టిలో దీని నిర్మాణమే వ్యర్థం. దీని ఒడ్డున ఉన్న వృక్షాల వల్ల ఎట్లాంటి ఉపయోగం లేదు. కనీసం ఈ నీరు స్నానానికి కూడా పనికి రావు" అని అన్నాడు.

దానికి విశ్వావసు "శ్రమ లేకుండా వచ్చిన సంపత్తిని తగిన విధంగా ఉపయోగించకపోతే, లక్ష్మీ (సీత) కావాలనే కోరికతో ఉంటే వారు గడ్డిపోచతో పోల్చబడి శ్రీరామునిచే బంధింపబడతాడు. ఈ విషయానికి సముద్రుడే సాక్ష్యం. అన్ని గుణాలు కలిగిన నదీపతిని నిందించకు మిత్రమా! ఈ సముద్రం ఇంద్రునికి ఉచ్చైశ్రవాన్ని అందించింది. చంద్రుడు పుట్టింది కూడా ఇక్కడే. ఈ సముద్రం దేవతలకు కల్పవృక్షం, కామధేనువు, లక్ష్మీదేవి లను అందించింది. ఇంతకంటే ఉదార స్వభావుడు ఎక్కడ ఉంటాడు' అని అడుగుతూ విమానాన్ని మరోవైపు మళ్ళించాడు.

## కాశీనగర వర్ణనం

"స్వర్గలోకాన్ని తాకుతున్నట్లుగా ఉన్న ఎత్తయిన భవనాలు, గుర్రాలు, ఏనుగులతో నిండిన కాశీనగరం మహాదేవుని శిరస్సుపై ఉన్న చంద్ర కిరణాలతో శూన్యంనుండి వెలుగులోకి ప్రయాణిస్తు న్నట్లుగా ఉంది" అని విశ్వావసు అంటుండగా కృషాను మధ్యలోనే "మిత్రమా ఇది కూడా ప్రశస్తనీయమైన స్థలమేనా? ఈ కాశీలో ఒక రకరకాల రసాలతో భోజనం తినేవారు, గుర్రాలు, ఏనుగులపై స్వారీ చేసేవారు, ముత్యాల మాలలను ధరించేవారు, పెద్ద భవనాలలో

యవ్వన స్త్రీలు ఉండగా మరో పక్క అస్థిపంజిరాల్లా కనిపించే మనుషులు ఎద్దుల బండ్లపై తిరుగుతూ, విషాన్ని ఆహారంగా తీసుకుంటూ, స్మశానంలో నివసిస్తూ రాక్షసులతో నాట్యం చేస్తున్నవారు కూడా ఉన్నారు. ఓ కాశీ ఎప్పుడూ రోగాలతో (గంగా ప్రవాహం) ఉండే నీలో రోగం లేని (విష్ణు శంకరులతో కూడిన) భూమి కూడా ఉంది. ఇక్కడ నివసించేవారి శరీరం మరో జన్మలో కూడా రోగరగస్థంగానే ఉంటుంది" అని అంటుండగా విశ్వావసు "ఓ మందబుద్ధిగలవాడా గుణాన్ని కూడా దోషంగా ఎందుకు మారుస్తావు? ఇక్కడ నివసించే విలావసంతులకు, యోగులకు అందరికీ శివుని ఆశీర్వాదం ఉంటుంది. కాశీలో తమ అపవిత్ర శరీరాలను వదిలినవారు స్వచ్ఛమైన శరీరాన్ని కచ్చితంగా పొందుతారు. ఇది ఇక్కడ నివసించేవారి ప్రాముఖ్యత. ప్రతిరోజు ఉదయం గంగాజలంలో భక్తితో స్నానం నచేసి సంధ్యావందనం వంటి నిత్యకర్మలు ముగించుకుని శంకరునికి పూజలు చేసే నిర్మలమైన మనస్సు కలిగిన బ్రాహ్మణులకు నా నమస్కారాలు" అన్నాడు.

అప్పుడు కృశాను "కలి ప్రభావం చేత శాస్త్రీయ ఆచారాలకు దూరమైన గంగానదీతీరంలో నివసించే బ్రాహ్మణులను కూడా పూజిస్తావా?, కాశీవాసుల అనైతికతను చూడు. ఇక్కడి బ్రాహ్మణులు ఆయుధాల వల్ల జీవనోపాధిని పొందుతారు. శాస్త్రాలను వదిలేసారు. శూద్రులు తెచ్చిన నీటితో స్నానం, ఆచమనం చేస్తారు, దేవతలను కూడా అభిషేకిస్తారు. వండిన భోజనాన్ని వ్యర్థం చేయడానికి భయపడరు. అనేక రకాల నీచపు అలవాట్లతో ఉన్నారు. ఈ మూర్ఖులు గంగాస్నానం తర్వాత కూడా రజకులు ముట్టిన వస్త్రాలను ధరిస్తారు. ఎవరూ వేదాధ్యయనం చేయరు అంటూ... పలురకాలుగా కాశీలో నివసించే బ్రాహ్మణులను తూలనాడాడు.. అది విని భరించలేక విశ్వావసు "కృశాను! బ్రాహ్మణుల నింద విని నాకు కష్టంగా ఉంది, హృదయం కంపిస్తుంది. నువ్వేదైతే అన్నావో అది కలిదోషమే కాని బ్రాహ్మణదోషం కాదు. కలియుగంలో సత్యయుగ ప్రవర్తన ఏవిధంగా కుదురుతుంది? కలి నిజంగా ఓటమి లేనివాడు. ప్రపంచంలో ఉన్న ప్రాణులందరిలో ఏ ఒక్క వ్యక్తి వేదమార్గంలో నడిచినా, వేదాలతో నమ్మకంతో ఉన్నా ప్రశంసనీయమే కదా. ఎడారిలో చిన్న నీటి చెలిమె ఉన్నా అది ఆనందించదగ్గదే కదా. ఈ కాశీలో నివసించేవారు ఎన్ని అధర్మ కార్యాలను చేసినా ప్రపంచంలో వీరికి మించిన ధర్మవంతులు లేరు. ప్రాత:కాలంలో చల్లని నీటిలో స్నానం చేసి దేవతలకు యథావిధిగా పూజిస్తారు. గోమయంతో అలికిన స్థానంలోనే వంట వండుతారు, భుజిస్తారు. ఇంతటి శ్రేష్ఠమైన భోజన నియమం మరెక్కడైనా చూసావా?" అని అడుగుతూ తమ ప్రయాణాన్ని కొనసాగించారు.

ఈవిధంగా కావ్యమంతా కూడా కృశాను, విశ్వావసు అనే గంధర్వులు విశ్వమంతా తిరుగుతూ విశ్వం యొక్క గుణాలను వర్ణిస్తారు ఇందులోని ప్రదేశాలను కవి శ్రీ వేంకటాధ్వరి చాలా అద్భుతంగా వివరించారు. భూలోకంలో ఉన్న దాదాపు అన్ని ప్రదేశాల వివరాలు తెలియజేయడం జరిగింది. ఇవన్నీ ఒక వ్యక్తి సందర్శించడం అసాధ్యం. కానీ కవి ఆ ప్రదేశాలను అన్నిటినీ ప్రత్యక్షంగా చూసినట్టే వర్ణించారు. ఆ ప్రదేశాలను, అక్కడి అనుభూతులను, పరిస్థితులను అనుభవించిన విధంగా చాలా హృద్యంగా కావ్యరూపంలో వెలువరించారు.

ఇలా అన్ని ప్రదేశాలను గూర్చి వర్ణిస్తూ చంపూకావ్యం రచించడం చాలా అరుదు. ఇది ఒక యాత్రా చరిత్ర. ఇలాంటి రచన సంస్కృతంలో ఎవరూ చేసి ఉండలేదేమో. కవి కల్పించి రచించినప్పటికీ వాటిలో చాలా వరకు సత్యం గోచరిస్తుంది. వీరి రచనా శైలి పండితులకు మాత్రమే అర్థమయ్యేవిధంగా ఉంది. సామాన్యులకు అంత సులభంగా అర్థం కాదు కానీ ఈ కావ్యాన్ని చదవడం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. అన్ని ప్రదేశాల్లో ఉండే మంచి, చెడు అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ఈ చంపూకావ్యం శ్రీ వేంకటాధ్వరి కల్పనాశక్తికి, రచనాశక్తికి, పాండిత్యానికి నిదర్శనం.



**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

# సిరచెల్మ జాతర

చంద్రకాంత్ మునేశ్వర్, చరిత్ర అధ్యాపకులు, కామారెడ్డి. ఫోన్ : 998 953 8243

ఏ దేశ చరిత్రకైనా ప్రాంతీయ చరిత్రలే వెన్నుముక లాంటివి ప్రాంతీయ చరిత్రలు సాధారణంగా దేశసంస్కృతికి ప్రతి రూపాలుగా చెప్పవచ్చు వైవిధ్య భరితమైన భారతదేశ చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలంటే ప్రాంతీయ చరిత్రలను సమగ్రంగా పరిశోధించవలసిన అవసరం ఎంతైనా ఉందని అనేకమంది చరిత్రకారులు గుర్తించడమైనది. భారతీయ సంస్కృతి సంప్రదాయంలో దేవిదేవతలు, పుణ్యస్త్రీలను, మహిమగల పురుషులను, ప్రకృతి శక్తులను పూజించి పర్యావరణంను కాపాడి భవిష్యత్తు తరాలకు సందేశం ఇచ్చె పండగలు అనేకం జరుపుకుంటున్నాము. అదేవిధంగా గ్రామీణ సంస్కృతిలో మానవ జీవన విధానంలో అనేక పండగలు జరుపుకోవడం, జీవనవిధానంలో అంతర్భాగమైన జాతరలు గ్రామదేవతలను పూజించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ప్రస్తుతం తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడా మండలం సిరిచెల్మ గ్రామములో జరుపుకనే జాతర. గ్రామంలో కొలువైన మల్లన్న జాతర గురించి పరిశోధనాత్మకంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**పరిశోధన ఉద్దేశం మరియు లక్ష్యాలు :** ప్రాచీన కాలం నుండి నేటివరకు మానవ జీవన విధానంలో ప్రకృతి, దాని అనుబంధం అయిన మతానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ ప్రకృతి ఆరాధన మతంతో అంతర్భాగమైన పండగలు, మానసిక ఉల్లాసం కొరకు జరుపుకోను జాతరలు ఆనవాయితీగా వస్తున్నది. జాతర ఆవిర్భావానికి ప్రేరేపించిన కారణాలను భారతదేశ చారిత్రక నేపథ్యం నుండి సమీక్షించడం. పై లక్ష్యాలే కాకుండా ఆధునిక కాలంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ రోజులలో కూడా జాతరలు గ్రామీణ ప్రాంత ప్రజల జీవనవిధానంపై ఎంతో ప్రభావాన్ని కలిగి ఉండడానికి గల కారణాలను క్షేత్ర పర్యటన ద్వారా వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా వివరాలను సేకరించి వివరించడం నా పరిశోధన ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం పరిశోధనలకు ఉపయోగపడే ఆధారాలను ప్రాథమిక మాధ్యమిక ఆధారాలు రెండు రకాలుగా విభజించవచ్చును. ప్రాథమిక ఆధారాలు మౌఖికంగా సేకరించడం మరియు గుడి నిర్మాణం ఆలయ వాస్తు శైలి నిర్మాణ క్రమం శిలలు, స్తంబాలు, ఆలయ పరిసరాలలో ఉన్న శిలాకృతులను పరిశీలన చేయడం ద్వారా గ్రామస్థుల నుండి సమాచారం సేకరించిన మౌఖిక ఆధారాలు. స్థానిక స్థల పురాణాలు, స్థానిక చరిత్ర, ఇతిహాస పురాణాలను ఆధారంగా చేసుకుని కొంతమేరకు పరిశోధనకు అనువుగా ఉన్న విషయాలను స్వీకరించి పొందుపరిచే ప్రయత్నం చేశాను. అదేవిధంగా సమకాలిన సాహిత్య ఆధారాలు ప్రస్తుత



పరిశోధనకు ఎంతో ఉపయుక్తం. నా పరిశోధనకు ఆధారంగా గ్రంథాలు, క్షేత్ర పర్యటన ద్వారా మరియు వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా సేకరించిన మౌఖిక సమాచారం.

చాళుక్యుల కాలంలో తవ్వబడిన చెరువు మధ్యన నిర్మితమై భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇది పురాతనమైన ఆలయం. ఇలాంటి పురాతన దేవాలయం ఆదిలాబాద్ జిల్లాలో సిరిచెల్మ గ్రామంలో ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సిరిచెల్మ అనే చిన్న గ్రామంలో శివుడు లోకకళ్యాణం కోసం సాధారణ కార్మికుడి వలే మట్టితట్టలను మోసాడు. పార్వతీ సమేతంగా ఇక్కడ స్వయంభువుగా వెలిసాడు. విశాలమైన ప్రాంతంలో చుట్టూ నీటితో నిండి ఉండి నీటి మధ్యలో దేవాలయం ఉండటం అద్భుతమని చరిత్ర పరిశోధకులు బి. ఎన్. శాస్త్రి, దుర్గం రవీందర్ పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఈ దేవాలయమునకు గొప్ప చరిత్ర కలిగి ఉంది.

శివరాత్రి రోజున ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి శివరాత్రి మొదలు కాముని పూర్ణిమ వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయి. ప్రస్తుతం ఈ క్షేత్రం ప్రముఖ పుణ్యక్షేత్రంగా స్థానికంగా వెలుగొందుతున్నది. శివరాత్రి రోజున ఆ నీలకంఠుడు పార్వతీ సమేతంగా ఇక్కడకు వచ్చి పూజలందుకొంటాడని ప్రతీతి. చాలా కాలం క్రితం ప్రస్తుత సిరిచల్మ అనే గ్రామం ఉన్న ప్రాంతంలో పిట్టయ్య, నుమ్మవ్వ అనే దంపతులు ఉండేవారు. వారి గ్రామానికి ఒక పిల్లవాడు పశువుల కాపరిగా వస్తాడు. పిల్లలు లేని ఆ దంపతులు ఆ బాలుడు అనాథ అని తెలుసుకొని అతనికి మల్లన్న అని పేరుపెట్టి పెంచుతారు. ఆ మల్లన్న వయస్సులో చిన్నవాడైనా సాయంలో మిన్న. కష్టాల్లో ఉన్నవారికి ఎప్పుడూ సాయం చేస్తూ అందరితో మంచి



బాలుడు అనిపించుకొంటూ ఉండేవాడు. ఒకసారి ఆ గ్రామంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. ప్రజలకు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో మల్లన్న ఒక రోజు లోపల చెరువును తవ్వడమే కాకుండా వర్షం వచ్చేలా చేస్తానని గ్రామ ప్రజలతో చెబుతాడు. అంతేకాకుండా చెరువును తవ్వడం ప్రారంభిస్తాడు. అయితే ఒక రోజు లోపల చెరువును తవ్వడం సాధ్యం కాదని చెబుతూ ఎవరూ మల్లన్నకు సాయం చేయడానికి ముందుకు రారు. అయినా వెనుదిరగకుండా మల్లన్న చెరువు తవ్వడంలో నిమగ్నమవుతాడు. రాత్రి చీకటి పడినా ఈ బాలుడు చెరువు తవ్వడం మాత్రం మానలేదు. ఇక మరుసటి రోజు ఉదయం గ్రామస్తులు ఆ చెరువు దగ్గరకు వచ్చి చూస్తారు. చెరువు తవ్వడం పూర్తి అయినది కాని బాలుడు మాత్రం కనిపించడు.

అదే సమయంలో చెరువు మధ్య భాగంలో ఒక లింగం దర్శనమిస్తుంది. ఆ శివలింగం పై భాగంలో కొంత లోనికి వెళ్లినట్లు సొట్ట కనిపిస్తుంది. దీంతో ఆ బాలుడు ఎవరో కాదు శివుడే అని నమ్ముతారు. అంతేకాకుండా ఆ శివుడు తాను వెళుతూ తన ప్రతిరూపమైన శివలింగాన్ని ఇక్కడ వదిలి వెళ్ళాడని భావిస్తారు. అంతేకాకుండా రాత్రి మొత్తం ఆ బాలుడు మట్టితట్టలను మోయడం వల్ల ఇలా (గుంట) సొట్ట ఏర్పడి ఉండవచ్చునని అనుకొంటారు. అదే రోజు రాత్రి పిట్టయ్య దంపతుల కలలో మల్లన్న కనిపించి తనకు అక్కడ ఓ దేవాలయం నిర్మించాల్సిందిగా సూచిస్తాడు. అదే మల్లికార్జున దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ పుణ్యక్షేత్రంలో రెండు నందులు ఉంటాయి. ఒకటి గర్భగుడిలో ఉంటే మరొకటి దేవాలయానికి 25 అడుగుల దూరంలో ఉంటుంది. సూర్యకిరణాలు ఈ నంది విగ్రహం పై మొదట పడి అటు పై గర్భగుడిలోని శివలింగంపై ప్రకాశిస్తాయి. ఆ సుందరదృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడాల్సిందే కాని మాటల్లో వర్ణించడానికి వీలుకాదు.

ఇక ప్రతి శివరాత్రి రోజున అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆ సమయంలో పార్వతీ సమేతంగా శివుడు ఇక్కడకు వస్తాడని చెబుతారు. అందువల్లే స్థానికులే కాకుండా చుట్టు పక్కల ఉన్న రాష్ట్రాల నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తారు. ఈ దేవాలయంలో భారతీయ శిల్పసంపద చాళుక్యుల శిల్ప కళకు అద్దం పట్టే అద్భుత శిల్పసంపదను చూడవచ్చు. ఇక్కడ హిందూ ధర్మానికి చెందిన శిల్పాలతో పాటు జైన, బౌద్ధ, శిల్పాలను కూడా మనం చూడవచ్చు. ఈ దేవాలయానికి సమీపంలో అనేక జలపాతాలు ఉన్నాయి. తెలంగాణాలోనే కాకుండా దక్షిణ భారతదేశంలోనే అందమైన జలపాతంగా పేరుగాంచిన కుంతల జలపాతం ఈ దేవాలయానికి 38 కిలోమీటర్ల దూరంలో అదేవిధంగా గాయత్రి జలపాతం కూడా సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది అందమైన ప్రకృతి ఈ గ్రామ సొంతం గ్రామ పరిసరాలు కొండ కొనలు లోయలు ప్రకృతి అందాలు ఇక్కడ చూడముచ్చటగా కనులకు నయనానందాన్ని ఇస్తుంది. ఈ గ్రామానికి చేరుకోవడానికి బస్సు సౌకర్యం ఉంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు అనేక బస్సులు ఉన్నాయి. ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడకు సుమారు 32 కిలోమీటర్ల దూరం. ఇక్కడి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో సిరిచెల్మ గ్రామం ఉంటుంది. ఇక నిర్మల్ నుంచి సిరిచెల్మకు సుమారు 52 కిలోమీటర్ల దూరం లో ఉంది.

**సిరిచెల్మ దేవాలయ ప్రత్యేకతలు**

ఇది పురాతన ఆలయం. శివాలయం చెరువు మధ్యలో నిర్మించారు నాటి నిర్మాణం. నిర్మాణ కౌశల్యాన్ని పరిశీలిచ్చినట్లు అయితే ఇది చాళుక్య రాజులు నాటి స్థానిక పాలకులు నిర్మించినట్లు నాటి నిర్మాణ వాస్తుశైలిని, శిలలను, రాజలాంఛనమును, ద్వారం పైన చెక్కిన జైన శిల్పాలను ఆదారంగా చేసుకొని చెప్పవచ్చును. ఇది మొదట జైన ఆలయం అయివుంటుందని బి. ఎన్. శాస్త్రి గారు తెలిపారు పాలకులు మారినప్పుడు పాలకుల మత ఆచారాలు మారినట్లే ఈ ఆలయంకూడా ఆలయంలో ఉన్న దేవుడు కూడ మారడం సహజంగా జరిగి ఉంటుందని అనేక మంది చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ ఆలయం మొదటగా జైన ఆలయం తరువాత శైవ ఆలయంగా మారినట్లు ఇక్కడి పరిసరాలలో ఉన్న విగ్రహాల ద్వారా విశదం అవుతున్నది. ఏది ఏమైనా శివలింగానికి ఎదురుగా రెండు నందులు దర్శనం ఇస్తాయి. ఇక్కడ రెండు నంది విగ్రహాలు ఒకటి గర్భగుడిలో ఉంటే, ఆలయం వెలుపల 25 అడుగుల దూరంలో మరో నంది ఉంటుంది. సూర్యుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి ప్రయాణిస్తున్న సమయంలో బయట నంది మీద పడిన సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలో ఉన్న శివునిపై ప్రతిబింబిస్తాయంటారు.

శ్రీకాళహస్తి ఆలయంలో ఉన్నట్టే ఇక్కడ కూడా ఏడుతలల నాగుపాము దర్శనమిస్తుంది. శనిప్రభావంతో ఇబ్బందులు పడుతున్న వారు, రాహుకేతు దోషాలు ఉన్నవారు, ఇక్కడ పూజలు చేస్తే మంచిదని చెబుతారు. సప్తఋషుల తలపై నాగశేషుడితో ఉన్న శివుడి ప్రతిమ అలనాటి కళా ప్రతిభకు నిదర్శనం. ఆలయంలో ఉన్న మొద్దు

గన్నేరు చెట్టు పురాణకాలం నాటిదని చెబుతారు. సాధారణంగా శివాలయాల్లో అగ్నిగుండాలు నిర్వహించరు. ఇక్కడ మాత్రం భక్తులు నడిచే అగ్నిగుండం గుండ నడిచే క్రతువు ఘనంగా జరుగుతుంది.

గుడి ఎదురుగా వీరాంజనేయ స్వామి విగ్రహం శని దేవున్ని తన కాలి క్రింద తొక్కబడినట్లుగా ఉంటుంది. ఇది ఇక్కడి ప్రత్యేకత. సిరిచల్మ ఆలయం త్రికుటాలయం. మూల దేవాలయానికి దక్షిణం వైపు బాలాజీ గుడి ఉంటుంది. బాలాజీ చేతుకు అల్లు ఉంటుంది. బాలాజీ చేతిలో నాణెం అతుక్కుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. మూలగుడికి ఉత్తరం వైపు అష్టదిక్పాలకులు బ్రహ్మ విగ్రహం ఉంటుంది. ఇది నల్లటి రాతితో కట్టబడ్డ అపురూప శిల్పాలు కొలువైన కట్టడం. నాటి కళాచాతుర్యానికి వాస్తు శిల్పకళకు కాణాచి అయినటువంటి ఈ దేవాలయం చాళుక్యుల కాలం నాటిదిగా ఇక్కడి శిల్పకళను బట్టి వాస్తు శైలిని బట్టి పరిశోధకులు నిర్ధారించారు. గుడి ప్రాంగణంలో జైన, బౌద్ధ మతాలకు చెందిన విగ్రహాలు అద్భుత శిల్పసంపదతో కూడుకున్నటువంటి స్తంభాలు నాగబంధంతో కూడిన నాగులు లతల ద్వారా పాలకులు నవగ్రహ విగ్రహాలు, ప్రవేశ ద్వారం పై ఉన్నటువంటి శిల్పసంపద అయినా వాస్తు శిల్ప సంపదగా, దొడ్డు గన్నేరు చెట్టు కింద ఉన్నటువంటి శిల్పాలు బౌద్ధ జైన మతాలకు సంబంధించినటువంటివిగా పరిశోధకులు, చరిత్రకారులు భావిస్తున్నారు. చరిత్రకారులు, పరిశోధకుల ప్రకారంగా ఈ గుడి మొదటగా జైన ఆలయంగా ఉండి కాలక్రమంలో వీరశైవ మత ప్రచారంలో భాగంగా శైవాలయంగా మార్చబడిందని చరిత్రకారులు ఇక్కడ శిల్ప సంపద శాసనాల వల్ల అవగతం అవుతున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రవేశ ద్వారాలకు ఇరుపక్కల జైన సాంప్రదాయం ద్వారా పాలకులు, గుడి వెనకాల ఉన్న స్త్రీ దేవత జైన స్త్రీ దేవతగా శాసనాల ద్వారా శిల్ప శైలి ద్వారా అవగతం అవుతుంది. గుడికి ఉత్తరంగా ఉన్న బౌద్ధ విగ్రహాలు అనేకం మొద్దు గన్నేరు చెట్టు క్రింద కనిపిస్తాయి. ఏది ఏమైనప్పటికీ ఈ సిరిచల్మ దేవాలయం అద్భుత శిల్ప సంపదకు తార్కాణం. వీటిని రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి అరుదైన శిల్ప సంపద కలిగినటువంటి ఆలయం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉండటం ఆదిలాబాద్ జిల్లా వాసుల పూర్వజన్మ సుకృతం. ఆలయ వారసత్వ సంపదను సంరక్షించుకోవలసిన బాధ్యత ఆదిలాబాద్ ప్రజలది, అదేవిధంగా ప్రభుత్వానిది.

**రిఫరెన్స్ :**

1) %Nageshwara Rao, K. Raju, Ch. : the role of pilgrimage Tourism in Adilabad Disctrict A Study of Gnana Saraswathi Temple, Kakatiya University, Warangal.

2) Nageshwara Rao, K. Raju, Ch. : Pilgrimage Tourism in Adilabad Disctrict of Andhra Pradesh, South Indian History Congress, Thirtieth Annual Session Proceedings 6th - 8th February 2010 Kanur.




3) Parthasarathy, R. : Places of Interest in Andhra Pradesh (A Monograph ) Published by the Government of Andhra Pradesh, Printed by the Nagambika Press, Kothagudem, VOL-I (1984).

4) Vijay Kumar, D. : Pracheena Devalayala Charitra, Adilabad -Karimnagar Zillalu (T). Vipanchi Offsets Printers, Asifabad, Adilabad. (2006)

5) Andhra Pradesh District Gazetteers, Adilabad (1976) Painted by The Government of Telangana at the Government Central Press, Telangana Hyderabad.

6) Kamalakara Sharma : alokanam Telugu Zillala Sahitya Charitra Samshkrithi Samaharam, Prapancha Telugu Mahasabhalu, Musi Patrika Hyderabad (2019).

7) Shivanagi Reddy, E. : Andhra Pradesh Tourism, Vanarulu - Avakaashalu (1998).

8) Narayana Udari. : Adilabad Zilla Sahitya Charitra, Savera Graphics Hyderabad (2019).

9) Bhadraiah Madipalli : Mana Adilabad Suhrudbhava Yatra - Anubhavalu - Anubhutulu, Kala Printers Gandhi Nagar, Hyderabad (2008).

10) Ravindar Durgam. :Adilabad Darshini, Varalaxmi Printers Hyderabad (1987)

11) Shatri B. N. : Adilabad Zilla Sarvaswam, Veeranjaneya Printing Press, Sucundaraba (1990)



# శ్రీరంగస్వామి 'కావ్యావలోకనం'

డా. గుమ్మా సాంబశివరావు, ఫోన్ : 9849265025

విహారిగా సాహిత్యలోకంలో ప్రసిద్ధులైన శ్రీజె.ఎస్.మూర్తి కవిగా, కథా రచయితగా, నవలా రచయితగా, విమర్శకునిగా ఎంతో ప్రసిద్ధులు. వారి కలం నుంచి శ్రీపద చిత్ర రామాయణమనే బృహత్ పద్య గ్రంథం వెలువడే వరకూ వారిలో అంత పద్యనిర్మాణ ప్రతిభ ఉన్నదనే విషయం సాహిత్య లోకానికి తెలియదు. ఆ గ్రంథం వచ్చిన తర్వాత దాన్ని గూర్చి ప్రత్యేక సదస్సులు జరిగాయి. డా. వేమూరి సత్యవతి బాలకాండను గూర్చి పరిశోధన చేసి డాక్టర్ పట్టాపచ్చు కున్నారు. ఇంకా మాకినీడి సూర్యభాస్కర్, గుమ్మాసాంబశివరావులు ప్రత్యేక గ్రంథాలు రచించారు. ప్రస్తుతం డా. టి. శ్రీరంగస్వామి విహారి శ్రీపదచిత్ర రామాయణాన్ని గూర్చి 'కావ్యావలోకనం' గ్రంథాన్ని వెలువరించటం సంతోషించదగిన అంశం.

డా. టి. శ్రీరంగస్వామి మంచి సాహిత్య కార్యకర్త. బహుగ్రంథ రచయిత. సౌమ్యస్వరూపి. ఎక్కడ ప్రతిభ ఉన్నా గుర్తించే ఉదార గుణ సంపన్నులు. విశ్వనాథ సాహిత్యమంటే 'ఇంత' అని చెప్పటానికి వీలులేని అభిమానం గల సహృదయులు. అలాంటి స్వామి విహారి శ్రీపదచిత్ర రామాయణంలోని 'కిష్కింధకాండ'ను గూర్చి 2015 ఏప్రిల్‌లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన సాహిత్య సదస్సులో ఒక పరిశోధన పత్రాన్ని సమర్పించి, అంతటితో ఆగలేక విహారి రామాయణంలోని అన్ని కాండల్ని అనుశీలనం చేస్తూ 'కావ్యావలోకనం' గ్రంథాన్ని వెలువరించటం అభినందనీయం.

శ్రీరంగస్వామి తమ గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించారు. బాలకాండము, అయోధ్యకాండము, అరణ్యకాండము, విహారి 'ఇష్టి' కిష్కింధ, 'సుందర' మారుతీయం, 'యుద్ధకాండము అనే శీర్షికలతో శ్రీపచరిత్ర రామాయణమనే పర్వతాన్ని 'కావ్యావలోకనము' అనే అద్దంలో చూపించే ప్రయత్నం చేశారు. శ్రీరంగస్వామి కాలస్వభావాన్ని గుర్తించిన రచయిత. వారు ఎన్నో సదస్సులు నిర్వహించారు. పుస్తకాలు ప్రచురించారు. ఇప్పటితరానికి పెద్దగ్రంథాలు చదివే తీరిక, ఓపిక లేవని అనుభవపూర్వకంగా గ్రహించినవారు కాబట్టి విహారి రామాయణ రచనామహత్త్వాన్ని సంక్షిప్తసుందరంగా సహృదయపాఠక లోకానికి పరిచయం చేశారు. మూల గ్రంథం మొత్తాన్ని చదివిన అనుభూతిని కలిగించారు.

గ్రంథరచయిత శ్రీరంగస్వామిగారు ముందుమాటగా "చిత్రవర్ణాల పదసోయగం" అనే శీర్షికలో తమ అభిప్రాయాల్ని స్పష్టంగా చెప్పారు. "విశ్వనాథ వారు అన్నట్లుగా ఈ పద చిత్రరామాయణంలో విహారి 'జీవుని వేదన' కూడా ఉంది. ఆ జీవుని వేదననే నాతో ఏప్రిల్ 2022 నుండి జులై 2022 వరకు ఈ కావ్యాన్ని అనుశీలనం చేయించింది" అని తెలియజేశారు.

శ్రీరంగస్వామి కవి హృదయాన్ని బాగా అర్థంచేసుకోవటం వల్ల కవి కవితాహృదయాన్ని విశేషంగా పసిగట్టటం వల్ల, శ్రీపద చిత్రరామాయణం కావ్య వైశిష్ట్యాన్ని గ్రహించటం వల్ల 'కావ్యావలోకనము' గ్రంథ్థాన్ని రచించగలిగారని చెప్పవచ్చు. విహారి పద్యాలు వ్యాఖ్యానం అవసరం లేని సరళసుందరమైన పదాల పోహళింపుతో, స్పష్టమైన భావాలతో ఉంటాయి కాబట్టి స్వామి సందర్భోచితంగా ఆయా పద్యాలను ఉట్టంకించారు. అవసరమైన సందర్భంలో చిన్న చిన్న వివరణలు అందించారు. ప్రతికాంలోను విహారి రచించిన విశిష్ట పద్యాలను పేర్కొనటమే కాకుండా, ఆయా కాండల్లో విహారి ప్రయోగించిన విలక్షణఛందస్సుల పట్టికను కూడా ఇవ్వటం బాగుంది. అంతటితో ఆగకుండా ఆయా కాండల్లో ప్రసక్తమైన తెలుగు నానుడుల్ని, సామెతల్ని ఏర్చి కూర్చటం స్వామి పరిశీలనాశక్తికి, భాషానురక్తికి తార్కాణం.

స్వామి ఆయాకాండల్ని వివరించిన తీరును విపులీకరిస్తే ప్రతిశీర్షిక అంటే ప్రతి కాండమును గూర్చిన పరిశీలన ఒక్కొక్కటి ఒక్కొక లఘుసిద్ధాంత వ్యాసం అవుతుందని చెప్పటంలో అతిశయోక్తి లేదు. రామాయణ కథ అందరికీ తెలిసిందే కావటం, రామాయణ పద్యకావ్యాలు ఎన్నోరావటం కారణంగా స్వామి విహారి రామాయణంలోని పద్యరచనా ప్రతిభానుప్రకటించటానికి మచ్చుకు కొన్ని పద్యాల్ని మాత్రమే ప్రస్తావించారు.

విశ్వనాథ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' కావ్యంతర్వాత ఇన్ని విలక్షణమైన ఛందస్సుల్ని ప్రయోగించిన మరొక కవి లేదని చెప్పటానికే స్వామి విహారి రచించిన వైవిధ్య భరితమైన ఛందస్సుల్ని గూర్చి చెప్పారని భావించవచ్చు. కవి జాతీయాల్ని, నానుడుల్ని ప్రయోగించాలంటే కేవలం బహు గ్రంథ పరిచయం చాలదు. ఆ కవికి విశేషమైన లోకజ్ఞత కూడా ఉండాలి. విహారి లోకజ్ఞుడైన కవి అని నిరూపించటానికే స్వామి అనేక జాతీయాలను, నానుడుల్ని పట్టికగా ఇచ్చారు. దీన్నిబట్టి వారి నిశిత పరిశీలనాశక్తి స్పష్ట మవుతుంది.

విహారి రచించిన శ్రీపదచిత్ర రామాయణమనే జలధిని శోధించి అందులోని పద్య రత్నాల్ని పాఠకులకు అందించిన శ్రీరంగస్వామి అభినందనీయులు. వీరి రచన మరికొంత మందికి ప్రేరణ అవుతుందని భావిస్తున్నాను. స్వామి కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆశిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 6 (57) హైదరాబాద్ ఏప్రిల్ : 2024

# సామాజిక పరిణామమే జీవనయానం

**యం. సంతు,** పరిశోధక విద్యార్థి, కాశీహిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 709 519 3082




బి.ఎస్. రాములుగా ప్రసిద్ధిపొందిన బేతి శ్రీరాములుగారు తన బాల్యంనుండి పొందిన, చూసిన జీవిత అనుభవాలనే రకరకాల కథాంశాలుగా పాఠకుల మనసులను చూరగొనేలా తెలుగు కథా సాహిత్యంతో తెలంగాణ సామాజిక నేపథ్యాన్ని రంగరించి అక్షరరూపాన్నిచ్చారు. సందర్భానుసారంగా పెల్లుబిన సామాజిక ప్రజా ఉద్యమ జీవితాలను వైవిధ్యభరితంగా చిత్రించిన కథకుడు బేతి శ్రీరాములు. 1982లో వచ్చిన “బతుకు పోరు” నవల ద్వారా తన రచనల పరంపరలకు శ్రీకారంచుట్టారు . తద్వారా వీరి పేరు బి.ఎస్. రాములుగా పాఠకలోకంలో ప్రచారం ప్రారంభమైంది. ఈయన తాను రాసిన నవలల్లో సామాజికుల కడగండ్లను, వారి జీవన విధానాల బాగోగులను, దోపిడీదారుల దుర్మార్గాలను, వృత్తినైపుణ్యాది అంశాలను, ఆర్థిక పరిణామాలను లోతుగా బి.ఎస్. రాములు ఆవిష్కరించారు. బీడీ కార్మిక కుటుంబాల నుండి ఎంతో శ్రమపడి ఎదిగిన విద్యావంతులు వారి జీవితాలు, పరిణామాలు జీవన యానం నవలలో బతుకుపోరాటంగా కనబడతాయి. దీనికి మొదటి భాగంగా ఉన్న బతుకుపోరు లోని కుటుంబాలు తర్వాత క్రమంలో అభివృద్ధి ఫలాలు అందుకుంటూ కష్టించి ఎదిగిన క్రమమే జీవనయానం నవల కథలోని ఇతివృత్తం. జీవనయానం నవలలో విభిన్న సామాజిక వర్గాల యువతీ యువకుల జీవితాలను వ్యాఖ్యానిస్తూ వారి ఆలోచన, స్వభావాలను విశ్లేషిస్తూ మరొక క్రొత్త కలల ప్రపంచాన్ని రచయిత ఆవిష్కరించారు. దీనికి సమాంతరంగా 1980 కాలపు పిల్లల, తల్లిదండ్రుల– దృక్పథాలను విస్తృతంగా వివరించే ప్రయత్నం చేశారు. అలా జీవనయానం నవల ఆనాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, పరిణామాలు మనిషిని ఎంతగా ప్రభావితం చేసిందో, ఆ వివరాల నేపథ్యంలో కథాంశ నవలయే ఈ జీవన యానం. ఈ నవల కొందరి జీవన గమనాన్ని ఆపలేదు. రేపటి ప్రపంచ భౌతిక, తాత్విక ప్రమాణాదులను నిర్దేశిస్తూ నడుస్తుంది జీవనయానం.

ఈ నవల రచనా కాలం 1998 అయితే, నవలలోని కథ మాత్రం 1985–90 మధ్యకాలంతో ప్రారంభమవుతుంది. ప్రజల సామాజిక జీవితంలోని అన్ని కోణాలు వీరి రచనలో ప్రతిబింబిస్తుంటాయి. బి.ఎస్. రాములు తన చుట్టూ ఉన్న, సమకాలీన సమస్యలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడంలో సిద్ధహస్తులు. సమకాలీన సమాజంలోని యువతీ యువకుల ఆలోచనలు, సామాజిక పరిణామాలను నవలావస్తువుగా తీసుకొని అక్షరబద్ధం చేశారు. ఎవరి జీవితం వ్యక్తిగతమైన సమస్య కాదన్న సత్యాన్ని కొత్తకోణంలో లోకానికి చాటారు. కాబట్టి సమిష్టిగతమైన ప్రజాజీవన సమస్యల్ని పరిష్కరించే దిశగా, వారి జీవనదశను ఉద్ధరించడానికి రచించే సాహిత్యం కూడా తప్పనిసరిగా సామాజిక శక్తిగా తోడ్పడాలనేది రచయిత సంకల్పం. అలా సాగిన నవలా అక్షరూపతపమే జీవనయానం. తెలంగాణ ప్రాంతానికి చెందిన నలుగురు విద్యావంతులైన యువతీ యువకుల జీవితాల్లో, వారి కుటుంబాల్లో చోటు చేసుకున్న అనుకోని రీతుల్లో జరిగిన వివిధ సంఘటనల పరిణామాల సమాహారంతోపాటు, మరికొన్ని ఇతర పాత్రల జీవనగమనాలకు ప్రాధాన్యం చూపుతూ ముందుకు కదులుతుంది ఈ నవల. జీవనయానం నవల మధ్యతరగతి మనుషులు, వారి జీవితాల కేంద్రంగా పరిభ్రమిస్తున్నట్టుగా కనిపిస్తూనే సమకాలీన, ప్రాపంచిక పరిణామాల చుట్టూ విస్తృతంగా చర్చలను లేవనెత్తుతుంది. ఇదివరకు తెలంగాణ నవల్లో ఉద్యమ చిత్రాణ ఎక్కువగా ఉంటూ, ప్రజా జీవిత ప్రస్తావన నామమాత్రంగానే ఉండేదని విమర్శకుల అభిప్రాయం. ఈ నవలలు మాత్రం పాత్రల అవసరాలు, ఆలోచనలు, జీవన స్థితిగతుల మధ్య సామాజిక ఉద్యమాల వాదనలకు సంబంధించిన అంశాలు చర్చావస్తువులయ్యాయి. తెలంగాణ ఉద్యమ సంబంధి రచనలని వీటిని గౌరవించడం యుక్తియక్తం. కానీ వైయుక్తిక జీవితం, సామాజికం రెంటినీ సమతూకంగా వేటికవే ప్రాధాన్యం సంతరించుకునేలా నైపుణ్యంతో బి.ఎస్. రాములు నవలను మలచారు. జీవనయానంలో సామాజికాంశల ధోరణుల వరిచయాదులను చూడగలము. జీవనయానంలోని రెండు ముఖ్యపాత్రలు అరవింద్, రాధ. నవ యౌవనప్రాయంతో ప్రేమపూరిత భావాలను నింపుకున్న రెండు పాత్రల మధ్య చిగురుస్తున్న ప్రేమను తెలుపుతూ నవల ప్రారంభమవుతుంది. జీవనయానం నవల ప్రారంభంలో ‘‘ప్రఖ్యాత ఫ్రెంచి సామాజిక అర్థశాస్త్రవేత్త ప్రసంగం వినాలని విక్రాంత్ పట్టుపట్టి ఎంతో మేలు చేశాడు. అమర్త్యసేన్ సంక్షేమ అర్థశాస్త్రం కన్నా క్యాపిటల్ – సోషల్ ఎకానమీ (పెట్టుబడి–సామాజిక అర్థశాస్త్రం) ఇంత సమగ్రంగా ఉంద అనిపిస్తుంది. ఇది సోషలిస్ట

దృక్పథానికి దగ్గరగా ఉందనిపిస్తుంది". (జీవనయానం-పుట.5) అంది ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న రాధ అనే అమ్మాయి, తన తోటి విద్యార్థి అరవింద్‌ని చూస్తూ! అలా ప్రారంభమైనంది వారి ప్రేమ. మరునాడు సినిమా చూస్తూ రాధ కళ్ళతో, హృదయాలు కలుపుకున్న ఉత్తేజం, చేతుల్లో వేళ్ళు బిగించి, కాళ్లతో కాళ్ళు తాకించి, అనుభవించిన స్పర్శా సుఖం వంటి అంశాలను యౌవనప్రాయంలో ఉండే వారి ఆలోచన తీరులను రచయిత చిత్రించారు. అలా అరవింద్ అతని మరదలు సావిత్రి, మిత్రురాలు లత, ఆ ఊరి వడ్డీవ్యాపారి నారాయణ సేటు కూతురు నిర్మల అరవిందుని ఇష్టపడినా, తాను మాత్రం వారిని ఏ మాత్రం పట్టించుకోకుండా, రాధ అనే అమ్మాయి ఇష్టపడేవాడు.ఇద్దరి సామాజిక వర్గాలూ సమంకావడం కూడా అరవింద్ మనసుని ప్రేరేపించాయి. కానీ రాధ, అరవింద్ పట్ల ప్రేమ ఉన్నప్పటికీ కూడా తన తల్లిదండ్రులు చూసినటువంటి అమెరికా అబ్బాయిని పెళ్లి చేసుకొని ఆదేశానికి వెళ్ళిపోవడం వంటి సంఘటనలు అరవింద్ మనసును సుంత గాయపరిచాయి. ఈ నవలలో అరవింద్ తల్లిదండ్రులు కొడుకు చదువుకు పెట్టిన డబ్బులు తిరిగి వాని పెళ్లితో సంపాదించాలనే తపనతో సొంత మరదలయిన సావిత్రిని కాదన్నారు. వడ్డీవ్యాపారి నారాయణ సేటు కూతురు నిర్మలతో కుమారుడి వివాహం జరిగితే అప్పులన్నీ తీరుతాయనే ఆలోచించారు. ఈ తరహా ఆలోచనలు మధ్యతరగతి కుటుంబాల్లో ఛిద్రమవుతున్న ఆర్థిక సంబంధాలను రచయిత పాఠకుల గుండెలు పిండేటట్లు చిత్రణ చేశారు. కానీ ఈ ప్రయత్నమంతా అరవింద్ తల్లిదండ్రుల ఆలోచనకే పరిమితం.

నేడు ప్రేమ, పెళ్లి, కుటుంబ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలన్నీ రాజకీయా ప్రాపకాయరూపాలే. వ్యక్తిగత విషయాలు కూడా రాజకీయకోణం, లేదా సామాజిక కోణంలో భాగమవు తున్నాయి. వీటితోపాటు "ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్స్ సెంటర్స్ అన్ని సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనామిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్లి, కుటుంబం మొదలైన రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చలాయించడం పితృస్వామిక సమాజ విలువల వల్ల సాధ్యపడుతున్నది. అలా నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడి దారిదోపిడి వర్గాల పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య, పెళ్లిళ్లవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు, కాస్త పెద్ద హోదాతో పెళ్లి చేస్తారు. అటువైపు నుండి హోదాను ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు. మనిషి ఇష్టాయిష్టాలను మనిషి కాకుండా వ్యవస్థలు, హోదాలు, స్థలకాలాలు, భావాలు, అర్హతలు నిర్ణయిస్తుంటాయి". అన్నా సోషలిస్టు మాటల్ని రచయిత తన పాత్రలోని సన్నివేశాలకు తగ్గట్టుగా చిత్రించటం జరిగింది. (జీవనయానం-పుట.30) అలాగే ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ చెట్లతో, అందమైన భవనాలతో నిటారుగా ఆర్ట్స్ కాలేజ్ భవనం, ల్యాండ్ స్కేప్ గార్డెన్, ఒకపక్క డి హాస్టల్ మొదలైన సుందర దృశ్యాలను జీవన యానం నవలలో చిత్రించారు. అలా వారిద్దరి మధ్య ప్రేమను, సాధారణ ప్రేమ కథా పరంపరలనే దారిలోంచి ఒక్కసారిగా రచయిత అనేక మలుపులు తిప్పాడు. యువతీ యువకుల తల్లిదండ్రులు, వీరి ప్రేమ, వైవాహిక సంబంధాలను గురించి ఏ విధంగా ఆలోచిస్తారు? పిల్లల భవిష్యత్తు గురించిన, తమ తమ నిర్ణయాలను తల్లిదండ్రులు, ఎలా మార్చుకుంటారనే విషయాలపై, వాస్తవిక దృక్పథంతో కూడిన సందర్భాలను, సన్నివేశాలను రాములుగారు జీవనయానంలో పాఠకులకు కనువిప్పు కలిగేలా చిత్రించారు. బి.ఎస్.రాములు గారి విస్తృతమైన లోకానుశీలనం, కార్మికుల సామాజిక జీవనయాన పరిస్థితుల ఆలోచనలు, రచయిత దృష్టికోణంలో మానవ స్వభావాల విశ్లేషణ, పలు సాహిత్య ఉద్యమ భావజాల వాదాల అధ్యయనాల పునాదులకు జీవనయానం నవల ప్రతీక. ఈ నవలలో రకరకాల పాత్రలు అడుగడుగునా పలకరిస్తాయి. ఆయా పాత్రల ఆలోచన ద్వారా మనుషుల్లో నిబిడీకృతమైన సాధారణ సహజ స్వభావాలు, లోక రీతివంటి గుణాలు, వేగంగా పరుగు పెడుతున్నట్లుంది. ఈ కార్మిక దీనుల మానసిక మనోవేదనలు, పాఠకులకు తమగోడులను విప్పి చెప్పే ప్రయత్నం చేశాడు. తమ పిల్లల బాగోగులకోసం కన్నులు కాయలు కాసేలా ఎదురుచూపులు చూసే ముదుసలి తల్లిదండ్రుల ఆర్తిని తీర్చాలనేది రచయిత సందేశం. జీవనయానం నవలలో ఆయా సామాజిక వర్గాల కుటుంబాలు అనుసరించే భిన్న సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, తదితర సాంస్కృతిక విశేషాలు, శ్రమైకజీవన సౌందర్యాదులు సందర్భోచితంగా అటనట కనిపిస్తుంటుంది. అలాగే సమకాలీన సామాజికాంశాలను చర్చించటంతో పాటు స్థానిక, జాతీయ విషయాలే కాకుండా, అంతర్జాతీయ సంఘటనల సన్నివేశాలు కూడా నవలలో కథాగతికి అనుగుణంగా రచయిత మలచారు. జీవనయానం అచ్చమైన తెలంగాణప్రాంత ప్రజల నవల జీవన ప్రవంతి అనే చెప్పడం సబబు. ఆయా పాత్రల సంభాషణలో అడుగడుగునా తెలంగాణ తెలుగు యాస కనబడుతుంటుంది. మనకు తెలిసిన మనుషులతో, ఆ ప్రాంతంలో పుట్టి పెరిగిన పరిచిత వ్యక్తులతో మాట్లాడుతున్నట్లుగా తాదాత్మ్యం చెందుతారు. తెలంగాణ సమాజంలో మధ్యతరగతికి చెందిన యువతీ యువకుల ఆలోచనా ధోరణి, సైద్ధాంతిక దృక్పథం, భావోద్వేగపు అలజడులు, వారి తపించే మనోవేదనలను పట్టుకునే ప్రయత్నం చేసింది నవల. తెలంగాణలో సమకాలీన సమస్యల అవగాహనకు కాల గమనానికి ప్రతిఫలనమే జీవన యానం.

❖ ❖ ❖ ❖ ❖

# జీవన సత్యాలను ఆవిష్కరించిన 'పాల కంకుల కల'

**స్తంభంకాడి గంగాధర్**, కరీంనగర్. ఫోన్ : 7386200610

సగటు మనిషి ఆవేదనలు, ఆక్రందనలు సమాజం నిండా చిక్కగా పరచుకున్నప్పుడు సహృదయుడైన కవి వాటిని తన అంతర్నేత్రంతో దర్శిస్తాడు. దాన్ని కవితా వస్తువుగా మలుచుకుంటాడు. ఆ వస్తువును ఉదాత్తమైన భావనగా మార్చి తన హృదయం నుండి చైతన్యాన్విత కవిత్వాన్ని వ్యక్తీకరిస్తాడు.

వఝల శివ కుమార్ సమాజాన్ని నిశితంగా పరిశీలించిన కవి. సగటు మనిషి ఎదుర్కొంటున్న అనేకానేక సంఘర్షణలు, రుగ్మతలు ఆయన అంతర్నేత్రానికి గోచరమయ్యాయి. అది ఆయన హృదయం. ఆయనలో తాత్వికత కూడ ఉంది. బ్రతుకు సమరంలో అలసి పోతున్న శ్రమజీవుల చెమట చుక్కల తాత్వికత అది! దేశానికి అన్నం పెట్టే హాలికుడు ఆత్మహత్య చేసుకోవడానికి ఉసిగొలిపే కార్పోరేట్ వ్యవస్థను ప్రశ్నించే తాత్వికత అది! పురుషుని బాహువుల కింద నలిగిపోయే స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించే తాత్వికత అది!

కరీంనగర్ కు చెందిన 'సాహితీ గౌతమి' ప్రతిష్టాత్మకంగా అందించే రాష్ట్రస్థాయి సినారె పురస్కారానికి 2001వ సంవత్సరంలో ఎంపికైన కవిత్వ సంపుటి "పాల కంకుల కల". వఝల శివకుమార్ గారు1994-1999 మధ్యకాలంలో రచించిన మొత్తం 42 కవితలతో కూడిన సంపుటి ఇది. 90వ దశకం నాటి సామాజిక చిత్రణ, ప్రజల ముఖ్యంగా కర్షకుల జీవన సంఘర్షణలు... అభ్యుదయ కవిత్వంగా మారి ఆయన హృదయం నుండి జీవిత సత్యాలుగా వెలువడ్డాయి.

"సారవంతమైన జ్ఞాపకం నించి / బీడు పడుతున్న అనుభవం లోకి జారుతూ...." అంటూ పాలకంకుల కలను కలగా కాకుండా జీవిత సత్యంగా శివకుమార్ ఆవిష్కరించారు. ఏ కల అయినా పరిపక్వం చెందితేనే జీవితానికి సంతోషదాయకం. అయితే లేత దశలోనే స్వప్నం ఛిద్రమైతే అదొక విషాదం. లేలేత స్వప్నాన్నే కవి 'పాలకంకుల కల'గా ప్రతీకాత్మకం చేసారు. రైతు కల కంటాడు. విత్తనం నాటిన నాటి నుండి పంట చేతికి వచ్చేదాకా ప్రతి క్షణం కల కంటాడు. కానీ అతని కల పక్వం చెందక మునుపే పాలకంకుల దశలోనే ఛిద్రమైపోతున్నది. నిజానికి కృషీవలుని జ్ఞాపకాలు సారవంతమైనవి. గతం వైభవోపేతమైనది. పుష్కలంగా పంటలు పండించి దేశానికి అన్నం పెట్టాడు. కానీ వర్తమానం ఆ విధంగా లేదు. ప్రపంచీకరణ రైతు జీవితాన్ని నాశనం చేసింది. విత్తనం నాటిన దశ నుండి ధాన్యం అమ్మే దశ వరకూ దోపిడీకి గురై, మోసం చేయబడుతున్నాడు. రైతు యొక్క సారవంతమైన జ్ఞాపకాలను ఈ సమాజం, బహుళజాతి కంపెనీలు, విత్తన కంపెనీలు ఛిద్రం చేసాయి. రైతు దీన్ని తట్టుకోలేక భూములను, వ్యవసాయాన్నీ, పంటనూ వదిలేసి "బీడువారుతున్న అనుభవంలోకి జారిపోయాడు." అంటే రైతు యొక్క వర్తమానం బీడువారిపోయింది.

"ఛిద్రమవుతున్న స్వప్నావశేషాలు / నిస్తేజ నిశోదయాలకి /వేలాడ దీసుకుంటున్న దిష్టిపూసలు" (పాలకంకుల కల) వ్యవసాయదారుని స్వప్నం ఛిద్రమైన తర్వాత అతని నాగలి మూలవడ్డది, మోటబావి పాడువడ్డది, ఎడ్ల డొక్కలు ఎండిపోయి కళేబరాలకు తరలించబడ్డాయి. అతని కలలన్నీ ఛిద్రమైన అవశేషాలుగా మారిపోయాయి. అయితే ఇప్పుడు అందరూ రైతు గురించి మాట్లాడేవారే, రైతు పట్ల సానుభూతి ప్రకటించేవారే! అందుకే ఇప్పుడా రైతు దిష్టిపూసలాగా మిగిలి పోయాడు.

"ఎక్కడికక్కడ తెగిపడుతున్న/ఒకే దేహంలోని /అపరిచిత శకలాలు." ఈ సమాజం ఒక దేహం లాంటిది. ఆ దేహంలో భాగంగా ఉండాల్సిన రైతు మాత్రం ఎవరికీ పట్టకుండా పోయాడు. వివక్షను ఎదుర్కొంటున్నాడు. ఈ సమాజంలో రైతు ఒక అంగమే అన్న సంగతిన ఈ కఠిన వ్యవస్థకు పట్టడం లేదు. ఈ వ్యవస్థ రైతునొక అపరిచిత శకలంగా మార్చేసింది.

ఈ కవితా సంపుటి మొత్తానికి పాల కంకుల కల ఆత్మవలె దర్శనమిస్తుంది. శివ కుమార్ ఈ కవిత రచించి రెండు దశాబ్దాలు గడిచినా నాటి నుంచి నేటికీ రైతు స్థితి మారలేదు. ఈ సంపుటిలో రైతు కవితలే అధికంగా ఉన్నాయి. రైతుల కష్టాలను, కన్నీళ్లను కవి అక్షరీకరించారు.

"పిడికెడు విశ్వాసం" కవితలో ఆత్మహత్య చేసుకున్న రైతు గురించి అతని కొడుకు పడే ఆవేదన చదివితే హృదయం చెమ్మగిల్లుతుంది. తండ్రి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో కొడుకుకు అర్థం కాదు.

"బాపూ! / నా అడుగులింకా నడకవ్వకముందే / దారి ఎగుడుదిగుడూ తెలియకముందే/ ఈ గజిబిజి దార్లో నన్నొదిలేసి ఎలా వెళ్లావ్" అని రైతు కొడుకు దుఃఖంతో ప్రశ్నిస్తాడు.

"పురుగు చెట్టుకే కాదు/ మొత్తం మార్కెట్టుకు పట్టుకుంది" మగ్గాలు విరిగినై, మిల్లులు మూతబడ్డయి, నకిలీ విత్తనాలు పత్తి చేనును పాడు చేసాయి. ఆర్థికంగా నిండా మునిగిపోయి, ఈ వ్యవస్థతో పోరాడే శక్తి లేని రైతు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. అయితే పురుగు పట్టింది కేవలం పత్తి చెట్టుకు మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థకే పట్టుకుందని, దాన్ని సరిచేయకుండా తన తండ్రి అసమర్థ మరణాన్ని పొందాడని కొడుకు భావించడం రైతును మోసం చేసేవారికి సూటి ప్రశ్నలాంటిది.

"బాపూ! ఇంక నువ్వు/ అసమర్థ మరణాలకి చివరి చరణానివి /

నేను ఆశావహమైన బతుక్కి తొలికిరణాన్ని...” అనే ఆకాంక్షను ప్రకటించడం ద్వారా రైతుల ఆత్మహత్యలు ఆగాలని, సమస్యలకు చావు పరిష్కారం కాదని కవి ప్రకటించాడు.

పురుషుడు తనకు నచ్చినట్టు జీవిస్తాడు. ఇష్టం వచ్చినట్టు తిరుగుతాడు. విలాసాలు అనుభవిస్తాడు. స్త్రీని మాత్రం ఒక యంత్రంలాగా చూస్తాడు. ఆమెను తన సుఖాలకు వాడుకుంటాడు. ఆమెతో కలిసి ఉంటూనే మనసులో మరో మహిళను ఊహించు కుంటూ దాంపత్య జీవిత విలువలకున్న వలువల్ని నిస్సిగ్గుగా విప్పేస్తాడు.

“బుసకొట్టే కోరికల దాహంగా తప్ప వేరుగా తాకిందెన్నడని” (నీ నీడలో) స్త్రీని కామపరమైన వస్తువుగా భావించి మోజు తీర్చుకోవడమే తప్ప పురుషుడు ఆమె హృదయంలోకి తొంగి చూడడు. ఆమె పట్ల కామభావనే తప్ప ప్రేమ భావన లేదు.

వరకట్నపు హత్యల్నీ ఈ కవి ప్రస్తావించాడు. “ఎవరిని పలకరిస్తాం / పలకడానికేం మిగిలిందక్కడ / పగడాల పెదవులనించీ పాదాల దాకా ...” (మూడుముళ్ళ చితిమీద) అనే కవితా పాదాలలో పురుషుని ఆధిపత్యం కింద నలిగి కాలి బూడిదయ్యే నవవధువుల ఆర్తనాదాలను శివకుమార్ తన ఆవేదనగా మలుచుకున్నాడు.

కార్పొరేట్ వైద్యంలోని డొల్లతనాన్ని కవి ప్రశ్నిస్తున్నారు. యంత్రాలు, కంప్యూటర్లు, ఆకర్షణీయమైన గాజు అద్దాల తలుపులు తప్ప రోగుల మానసిక స్థితికి కార్పొరేట్ వైద్యశాలల్లో స్థానం లేదని, వైద్యం ఖరీదైన వ్యాపారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. “వైద్యం కంప్యూటర్ల ఆధీనంలో / వ్యక్తిత్వాన్ని కోల్పోవడం మొదలయ్యాక/ రోగి, రోగి మానసిక స్థితి అప్రస్తుతాంశాలౌతాయి....” (కార్పొ'రేటు' చికిత్స) కవిలోని మానవీయ కోణానికి తార్కాణమీ కవిత!

రోడ్ల పక్కన డేరాలు వేసుకొని నిప్పుల కొలిమిలో పనిముట్లను కాలుస్తూ, వాటిపై సమ్మెట పోటు వేసే శ్రామికులను చూస్తుంటాం. కానీ వాళ్ళ కష్టాలను, వాళ్ళ జీవితాల్లోని అపసవ్య స్థితిగతులను పట్టించుకునేదెవరు!? శివకుమార్ సామాజిక పరిశీలనలో ఈ శ్రమజీవుల చెమట చుక్కలు అక్షరాలయ్యాయి.

“గాజులచేతులయితేనేం/ గాల్లోకి సమ్మెటెత్తి కొట్టాల్సిందే/ నిప్పుల మీద కాలి ఎరుపెక్కిన కొడవలికొన పదునెక్కాల్సిందే/ తుప్పొదిలించుకొన్న నాగటి కర్రు...” (కొలిమి) సమాజంలో తన తోటి మానవులు కష్టాల కడలిలో చిక్కుకొని జీవన పోరాటం చేస్తున్నప్పుడు సమాజంలో తానూ ఒక భాగంగా ఉన్న వ్యక్తి స్పందించకుండా ఉండలేడు. శివకుమార్ స్పందించారు. పనిముట్లు ఆత్మల్ని శుద్ధి చేసుకున్నట్టు ఆయన కవిత్వంతో శ్రామికుల కష్టాలను శుద్ధి చేసే ప్రయత్నం చేసారు.

ఒక్కొక్కసారి కవిత్వంలో కవి యొక్క వైయక్తిక అనుభూతులు అనుభవాలను ఆధారం చేసుకుని ప్రకటితమవుతాయి. శివకుమార్ సింగరేణి ప్రాంతంలోని ఎన్టీపీసీ కేంద్రీయ విద్యాలయంలో పని చేసారు కాబట్టి సింగరేణి కార్మికుల గురించి రాయకుండా ఆయన కవిత్వం ఉండదని చెప్పవచ్చు. “వెలుగులు ఏతానికెత్తుతూ...”, “నల్లకలువలు” అటువంటి కవితలే!

“వాళ్లు కడుపును తవ్వుకుంటూ పోతున్నారు / వల్లకాడెదురు పడింది / ఆకలి జాడ తప్పింది.”, “ఫ్యాక్టరీల కాలనీలు వైట్ కాలర్ సర్దుకున్నాయి/ మా రెక్కలే అన్నాయి ఊళ్ళు / మా ఊపిరులే అన్నాయి బీళ్ళు” (నల్లకలువలు) జీవిత సత్యాన్ని ఇంతకన్నా తాత్వికంగా కవి కాక ఇంకెవరు చెప్పగలరు!? కవిలోని మానవీయత, ఆవేశస్ఫూర్తి అక్షరాలుగా మారి పాఠకుని హృదయంలోకి చొచ్చుకుని పోతాయి. సింగరేణి కార్మికుల జీవితాలతో ముడిపడిన భిన్న సామాజిక అంశాలను కవి ప్రస్తావించడంలోను ఆ మానవీయత, ఆ ఆవేశస్ఫూర్తి ప్రస్ఫుటమవుతున్నాయి.

శివ కుమార్ సమతావాది. ఇందులో వర్ణవివక్షను నిరసించారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించి దళితులను పంచమ జాతిగా అభివర్ణించి వెలి వేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూముల్లో కర్మాగారాలు నిర్మించి ఆ తర్వాత నష్టం పేరుతో మూసివేసే ప్రభుత్వరంగ సంస్థల తీరును కవి ఎండగట్టారు.

పాలకంకుల కల కవిత్వంలో కర్షకుల కన్నీటి సాగు, మానవత్వం, సామాజిక చింతన, స్త్రీవాదం, దళితవాదం, అభ్యుదయం, శ్రామికుల పట్ల పక్షపాతం.... అన్నీ ఉన్నాయి. ఆయన కవిత్వం సగటు మనిషి పక్షాన నిలబడింది. ఒక చోట జీవితంలోని భిన్నమైన పార్శ్వాలను స్పృశించారు. మరొక చోట స్త్రీ హృదయాన్ని తన హృదయంగా ప్రకటించించారు. వేరొక చోట ఆవేశస్ఫూర్తితో రగిలిపోయారు. ఇంకొక చోట ఆనందానుభూతులను పంచారు. శిల్పసోయగంతో, రసస్ఫోరకంగా తన హృదయతత్వాన్ని ప్రకటించారు. అంతకు మించి ఆయన కవిత్వంలో స్వచ్ఛత ఉంది. “తొక్క బడిన స్వప్నాల సమిష్టి వ్యవస్థనే పాలకంకుల కల!”


**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

# 'స్వకృతి'



**పోతన భాగవతం - అలంకార శిల్పం**
డా. గొట్టె శ్రీనివాస రావు
వెల : 400/-
**ప్రతులకు :** శ్రీరాధాకృష్ణ ప్రచురణలు
శ్రీరాధాకృష్ణ బృందావనం, ఇం.నెం. 1-52/1/269
భవానీపురం, చందానగర్, హైదరాబాద్ - 50
ఫోన్ : 98480 20646




**బాల కథా సౌరభం**
వెల : 120/-
**ప్రతులకు :**
తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్
ఆబిడ్స్, హైదరాబాద్ - 500 001
ఫోన్ : 90002 73224




**విజ్ఞానం - వికాసం**
వెల : 165/-
**ప్రతులకు :**
తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్
ఆబిడ్స్, హైదరాబాద్ - 500 001
ఫోన్ : 90002 73224




**పిల్లల పాటల పరిమళం**
వెల : 180/-
**ప్రతులకు :**
తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్
ఆబిడ్స్, హైదరాబాద్ - 500 001
ఫోన్ : 90002 73224




**ఎన్.టి.ఆర్ 100 (అష్టోత్తర శత వ్యాస సంచిక)**
**సంపాదకులు : డా. తూమాటి సంజీవరావు**
వెల : 800/-
**ప్రతులకు :**
సంపాదకులు, మేనేజింగ్ ట్రస్టీ, చెన్నపురి తెలుగు అకాడమీ, జి-2, నీలాద్రి అపార్ట్‌మెంట్స్, 186(111), లేక్‌వ్యూ రోడ్, వెస్ట్ మాంబాలం, చెన్నై - 600 033. ఫోన్ : 98844 46208

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com




**జ్ఞాపకాల సంతకం (కవిత్వం)**
ధూళిపాళ అరుణ ఫోన్ : 8712342323
వెల : 100/-
**ప్రతులకు :** ధూళిపాళ దత్తాత్రేయ శర్మ
హరిహర త్రిశక్తి క్షేత్రం, వలిగొండ,
యాదాద్రి జిల్లా.
ఫోన్ : 9000998850




**మధుర గీతి (ఖండకావ్య సంపుటి)**
మధుసూదన్ కోమటి,
వెల : 100/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 6-2-132 1/ఎ
శ్రీ లక్ష్మీనగర్ కాలనీ, హైదరాబాద్ రోడ్,
నల్లగొండ - 508 001. ఫోన్ : 94913 28432



# నవ వసంతం

**ధూళిపాళ అరుణ, ఫోన్ : 8712342323**

మట్టినుండే ఎదిగిన ఆకులన్నీ
రాలుతున్న చుక్కలై
ఒదిగిపోతున్నాయి భూమిలోకి
గాలి సావాస సంబరాలకు వీడ్కోలిచ్చి
అలసి సొలసిన దేహాలతో
తల్లి ఒడిలోకి జారుకుంటున్నాయి

గున్న మావిళ్లు గుబురుగా పాకి
పసందైన కాయల పరువాలను బిగిస్తూ
ఆకృతులను అలంకరించుకుంటున్నాయి
దర్పాలను ఒలకబోస్తూ....

మత్తు వదిలిన కాకలీరవములు
నవ వసంతాన్ని చుంబించి
చిగురు గొంతుకలతో
పచ్చదనాన్ని నింపుకున్న
పడతి ఎదను మీటి
రాగ తోరణాలను కడుతున్నాయి

తన వైపు ఎప్పుడూ
ఎవరి కన్నూ సోకని మాను
అరమరికలు లేక
ఒళ్ళంతా తెల్లని
పూలపానుపు పరచి
విసురుతోంది ఆనందాన్ని విరివిగా

దెబ్బల గాయాల నుండి విడివడి
రెక్కలు విప్పుకొని
పులుపు వలపుల చింత
జిహ్వాగ్రానికి రుచులనిస్తూ
మైమరిపిస్తోంది కొత్తగా

ఎప్పటిలాగే
శిశిరపు వలువను వీడిన ప్రకృతి
కాలానికి దాసోహమై
మరో వసంతాన్ని కప్పుకుంటోంది
జీవిత వాస్తవాన్ని మనిషికి
ఎరుకపరుస్తూ...!!

# దైవ చింతన నేర్పగ తరలు క్రోధి

**డా. జనమంచి విఠలేశ్వర శర్మ, ఫోన్. 94928 29083**



అదిగో క్రోధను పేరుతో భువికి రానే వచ్చె నీ వత్సరం
బిదియైనం ఇసుమంత మంచితనమున్ బెంచెనో చూడన్వలెన్
ముదమారన్ ప్రభులెల్ల బుద్ధిమతులై మోదాన పాలించి, సం
పదలన్ బెంచుచు సౌఖ్యమిత్తురో కదా బాధించకన్బుద్ధితో

ఆకాశమ్మున సంచరించు గ్రహముల్ ఆనంద సంచారులై
చీకాకుల్ తెగదూడ్చి వైపరితముల్ ఛేదించి చిత్సౌఖ్యముల్
సాకారం బగునట్లు చేయగలవో సత్యమ్ములన్ బంచుచున్
రాకాచంద్ర ప్రశాంచతతల్ వెలయగా రాగమ్ములన్ పంచుచున్

కల్గును గాక సంపదలు కల్గును గాక సమస్త భోగముల్
కల్గును గాక మానవాళికి కల్గను ప్రేమలు కల్గు నెయ్యముల్
కల్గును ధర్మభావనలు కల్గగ జేయును క్రోధి రూపమున్
కల్గును విశ్వశాంతి ప్రజ కల్లలు లేకను సంచరించుగా!

ఆరు రుచులవి మనిషికి ఆశజంపి
స్వార్థ భావన వీడియు సత్యములతొ
ధనము ధనమను పేరుతో తనుకకుండ
బుద్ధి నిచ్చును గావుత సిద్ధి గూర్చి

సత్వ గుణములు మనిషికి సతము నిచ్చి
దానధర్మము జేసెడి జ్ఞానమిచ్చి
శాంత నడవడి నేర్పియు సంభ్రమముగ
దైవ చింతన నేర్పగ తరలు క్రోధి

పేరున క్రోధము లున్న న
పారములౌ శాంతి నింపి భారత భువినే
పేరున పెద్దగ జేయుమ
ధీరుండౌ రాజు నిమ్మ తేజమలరగాన్!

## ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

**మీరు తీసుకునే**
**ప్రతి నిర్ణయానికి**
**మా ప్రేమ, సేవ**
**అంకిత భావం మీకు**
**తోడుగా ఉంటుంది.**

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్